
ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★




పార్లమెంట్‌లో ఒకే సెషన్‌లో.. బిల్లులు ప్రవేశపెట్టి, ఆమోదించే ధోరణి! 07
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ యథాతథం 03
కాంగ్రెస్ అధిష్టానానికి వ్యతిరేకంగా మాట్లాడలేదు : చిన్నారెడ్డి



సంపుటి 09, సంచిక: 264 | ఆదివారం | 23-08-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# హైదరాబాద్‌లో లండన్ వర్సిటీ

- ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు వెల్లడి
- కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో సిఎం రేవంత్ రెడ్డి బృందం భేటీ
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంలో భాగస్వామి కావాలని విజ్ఞప్తి




ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు లండన్ యూనివర్సిటీ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి తెలియజేశారు. లండన్ యూనివర్సిటీ సెనేట్ హౌస్‌లో శనివారం తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం జరిగింది. ఈ భేటీలో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ (ఎల్‌ఎస్‌ఈ), స్కూల్ ఆఫ్ ఓరియంటల్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్ (ఎస్‌ఓఏఎస్)కు చెందిన ప్రతినిధి బృందాలు, ఇతర ప్రతినిధులు కూడా ఉన్నారు. హైదరాబాద్‌లో క్యాంపస్ ఏర్పాటు చేసేందుకు లండన్ యూనివర్సిటీ కృషి చేస్తోందని ఆ సంస్థ ప్రతినిధులు ఈ సందర్భంగా వెల్లడించారు. యూనివర్సిటీకి చెందిన వివిధ స్కూళ్లు, విభాగాల ద్వారా విస్తృత స్థాయిలో విద్యా కోర్సులు, వివిధ విద్యా కార్యక్రమాలను అందించేలా ఈ క్యాంపస్ను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు వివరించారు. లండన్ యూనివర్సిటీకి చెందిన వివిధ విద్యా విభాగాలను ఒకే అకడమిక్ ఫెడరేషన్‌గా అనుసంధానించే విధంగా ఈ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ లక్ష్యంలో భాగస్వామి కావాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయాన్ని ఆహ్వానించారు. సిఎం నేతృత్వంలో బ్రిటన్ పర్యటనకు వెళ్లిన తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం నేడు కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ విద్యావేత్తలతో ఫలప్రదమైన


తరువాయి 8లో




# సురవరం జీవితం స్ఫూర్తిదాయకం

- గ్రామీణ యువతపై సుధాకర్‌రెడ్డి ఆదర్శాల ప్రభావం
- వర్ధంతి సభలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వైస్ ఛాన్స్‌లర్ ఘంటా చక్రపాణి
- ఓ వ్యక్తి తన జీవితకాలంలో ఒక్కరినైనా మార్చగలిగితే గొప్ప కమ్యూనిస్టు అవుతారు.. ప్రత్యక్ష ఉదాహరణే సురవరం
- సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శికి ప్రముఖుల నివాళి

ప్రజాపక్షం/హైదరాబాద్

సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర రెడ్డి జీవితమంతా స్ఫూర్తిదాయకమని, ''ఎంత కాలం జీవించామనేది కాదు. ఎంత గొప్పగా జీవించామనేది ముఖ్యం'' (లైఫ్ షుడ్ బి గ్రేట్ రాథెర్ థెన్ లాంగ్) అనే డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చెప్పిన సూక్తికి సురవరం సుధాకర రెడ్డి జీవితం పర్యాయపదంగా నిలుస్తుందని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి కొనియాడారు. సమసమాజం స్థాపన అధికారంతో కాదని, కమ్యూనిస్టుల ఏకీకరణ ద్వారా మాత్రమే అది సాధ్యమని సురవరం సుధాకర్‌రెడ్డి ప్రగాఢంగా విశ్వసించేవారని, ఆ దిశగా కమ్యూనిస్టు శ్రేణులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో దివంగత సిపిఐ అగ్ర నేత, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సభ శనివారం మఖ్దూంభవన్‌లో జరిగింది. సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించగా, ఘంటా చక్రపాణి, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ సెంట్రల్ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సురవరం సుధాకర రెడ్డి సతీమణి సీనియర్ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి ప్రసంగించారు. సురవరం సుధాకర్‌రెడ్డి వివిధ సందర్భాలలో వివిధ అంశాలపై రాసిన వ్యాసాలతో రూపొందించిన 'ఉద్యమాక్షరం' పుస్తకాన్ని వారు


తరువాయి 12లో





ఢిల్లీలోని అజయ్‌భవన్‌లో సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించిన సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా




కరీంనగర్‌లో బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి. చిత్రంలో పార్టీ శ్రేణులు.

# పాలకులను ప్రశ్నించే పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం

- జర్నలిజం వ్యాపారం మాత్రమే కాదు.. సామాజిక బాధ్యత
- సమాజంలోని ఘటనలను వార్తలుగా నివేదించడమే కాకుండా వివక్షను ప్రశ్నించాలి
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు
- హైదరాబాద్‌లో లాంఛనంగా 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్' ప్రారంభం




ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజాస్వామ్యం మనుగడకు పాలకులను, అధికారంలో ఉన్నవారిని నిలదీసే పత్రికా స్వేచ్ఛ అత్యంత కీలకమని, విమర్శలను స్వీకరించే ధైర్యం ప్రభుత్వాలకు ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. జర్నలిజం కేవలం వ్యాపారం మాత్రమే కాదని, అదొక గొప్ప సామాజిక బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఎనిమిది ప్రధాన ప్రెస్ క్లబ్‌ల ప్రతినిధులు ఏకతాటిపైకి వచ్చి ఏర్పాటు చేసిన 'ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ ఆఫ్ ఇండియా'ను శనివారం హైదరాబాద్‌లో బేగంపేటలోని ఐఎఎస్ క్లబ్‌లో డిప్యూటీ సిఎం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భట్టి విక్రమార్క, 'ది హిందూ' గ్రూప్ పబ్లిషింగ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ ఎన్.రామ్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు సంగీత బారోచ్ పిషారోటి, 'ది కారవాన్' ఎడిటర్ అనంత్ నాథ్, ఫెడరేషన్ ఆఫ్ ప్రెస్ క్లబ్స్ అధ్యక్షులు గౌతమ్ లాహిరీ, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వరికుప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు. సమాజంలో జరుగుతున్న ఘటనలను కేవలం వార్తలుగా నివేదించడమే కాకుండా, వాటి అంతరార్థాన్ని, సమాజంలో నెలకొన్న వివక్షను ప్రశ్నించాల్సిన బాధ్యత జర్నలిజంపై ఉందని డిప్యూటీ సిఎం అన్నారు. ఇటీవల కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే హల్ద్వానీలోని రాంలీలా మైదానంలో ప్రసంగించిన రెండు రోజుల తర్వాత అక్కడ నిర్వహించినట్టు చెబుతున్న 'శుద్ధీకరణ' కార్యక్రమంపై భట్టి తీవ్రంగా


తరువాయి 8లో




# ఏడంతస్తుల మేడ కుప్పకూలింది

**ఇద్దరు కార్మికులు దుర్మరణం**

- హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఘటన
- నాలా ఆక్రమించి ఇరుకైన 50 గజాల స్థలంలో అక్రమ నిర్మాణం
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- అంజయ్య నగర్‌లో అక్రమ నిర్మాణాలు తొలగిస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటన


ప్రజాపక్షం/హైదరాబాద్/ శేరిలింగంపల్లి

రాజధాని నగరంలో అక్రమ నిర్మాణాల అత్యాశ అమాయక కార్మికుల ప్రాణాలను బలిగొంటోంది. హైదరాబాద్‌లోని మాదాపూర్ సర్కిల్ పరిధి గచ్చిబౌలి అంజయ్య నగర్‌లో శనివారం నిర్మాణంలో ఉన్న ఓ ఏడంతస్తుల (జి ప్లస్ 6, పెంట్‌హౌస్) భవనం పక్కకు ఒరిగి, సమీపంలో ఉన్న వైట్ ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌పై కుప్పకూలింది. ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందగా, మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతకు సమీపంలోని అపార్ట్‌మెంట్ గోడలు ధ్వంసమవ్వడమే కాకుండా,


తరువాయి 8లో


# ఇది ఎలాంటి 'ఆత్మనిర్భర భారత్'

- ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షులు మూడు ప్రశ్నలు
- చక్కెర ధరల పెంపు, ఇథనాల్ విధానంపై మండిపాటు



**న్యూఢిల్లీ :** పెరుగుతున్న చక్కెర ధరలు, తగ్గుతున్న నిల్వలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మోదీ ప్రభుత్వ విధానాల చేదుతనం చక్కెర తీపిలోనూ చొరబడిందని ఎద్దేవా చేశారు. శనివారం ఖర్గే ఎక్స్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు. ప్రధాని మోదీ ప్రభుత్వానికి మూడు సూటి ప్రశ్నలు సంధించారు. 1. ప్రపంచంలోనే అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారు, ఎగుమతిదారు అయిన భారతదేశంలో, చక్కెర నిల్వలు నేడు ఎందుకు గత 9 ఏళ్లలో కనిష్ట స్థాయికి పడిపోయాయి? ఎగుమతులను నిలిపివేసి, సుంకం లేకుండా మిలియన్ టన్నుల చక్కెరను దిగుమతి చేసుకునే పరిస్థితికి మనం ఎలా వచ్చాము? 2. మూడు నెలల్లో చక్కెర ధర దాదాపు 40 శాతం పెరిగింది. పండుగలకు ముందే ప్రజలపై


తరువాయి 12లో


# అందరి ఫిర్యాదులు అందాక పరిశీలించి చర్యలు

- చిన్నారెడ్డి వివరణ అందింది, మేఘారెడ్డిని మరోసారి పిలిచి వివరణ తీసుకుంటాం
- టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి



ప్రజాపక్షం/హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కొండా సుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలకు సంబంధించి అందరి ఫిర్యాదులు అందిన తర్వాత వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామమని టిపిసిసి క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపి మల్లు రవి తెలిపారు. గాంధీభవన్‌లో శనివారం జరిగిన టిపిసిసి క్రమశిక్షణ కమిటీ సమావేశంలో పార్టీ నాయకుల వివాదాలు, వివాదాస్పద వ్యాఖ్యలపై సుదీర్ఘంగా


తరువాయి 8లో



నాపై అవమానకర వ్యాఖ్యలు చర్యలు తీసుకోండి : సురేఖ
సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పాలి : అడ్లూరి 03


# నిర్లక్ష్యపు నీడలో 'నిర్మల్' పర్యాటకం!

- బాసర ఆలయంలో కనీస వసతులు కరువు
- శిథిలావస్థకు 'శ్యామ్‌గఢ్'
- అభివృద్ధికి నోచుకోని వెయ్యిగూడల మర్రి





ప్రజాపక్షం/నిర్మల్

పచ్చని ప్రకృతి, చారిత్రక కట్టడాలు, పవిత్ర ఆధ్యాత్మిక క్షేత్రాలు, అద్భుతమైన జలపాతాలు.. వెరసి నిర్మల్ జిల్లా పర్యాటక రంగానికి పెట్టింది పేరు. కానీ, పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వెరసి ఈ అద్భుతమైన పర్యాటక సంపద నానాటికీ తీసికట్టుగా మారుతోంది. ప్రతి ఏటా పర్యాటక అభివృద్ధి పేరుతో విడుదలవుతున్న కోట్ల రూపాయల నిధులు ఎటుపోతున్నాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఎన్నికల సమయంలో నాయకులు ఇచ్చే పర్యాటక


తరువాయి 8లో


# హైదరాబాద్ తరహా నిజామాబాద్‌లోనూ ఇందిరమ్మ టవర్స్

- కుల, మత రాజకీయాలకతీతంగా ఇళ్ల కేటాయింపు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- అట్టహాసంగా లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ




ప్రజాపక్షం/నిజామాబాద్

పేదల సొంతింటి కలను సాకారం చేసి, వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించటమే ప్రజాప్రభుత్వం సంకల్పమని, హైదరాబాద్ తరహాలో నిజామాబాద్‌లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థల పరిశీలన చేశామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారపౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. నగరంలో శనివారం మంత్రి పలు ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. నాగారంలోని నిర్మితి కేంద్రంలో గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారుల కోసం నిర్మించనున్న హౌసింగ్ టవర్స్ స్థలాన్ని పరిశీలించారు. రెండు ఎకరాల విస్తీర్ణంలో ఆరు అంతస్తులతో కూడిన టవర్స్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపారు. అనంతరం 43వ డివిజన్‌లోని పాములబస్తీలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులతో మంత్రి భేటీ అయి


తరువాయి 12లో




## మారిన భూమి ముఖచిత్రం!

అపోలో–8 యాత్ర (1968)లో వ్యోమగామి విలియం ఆండర్స్ తీసిన 'ఎర్త్‌రైజ్' చిత్రం అంతరిక్ష చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన ఫొటోల్లో ఒకటిగా నిలిచింది. చంద్రుడి నిర్జన ఉపరితలం వెనుక నుంచి నీలిరంగు భూమి ఉదయిస్తున్న ఆ దృశ్యం ప్రపంచానికి ఒక కొత్త దృక్పథాన్ని అందించింది. మన గ్రహం ఎంత చిన్నదో, ఎంత సున్నితమైనదో ఆ చిత్రం మానవాళికి గుర్తుచేసింది. అనంతరం పర్యావరణ పరిరక్షణ ఉద్యమాలకు అది ఒక ప్రతీకగా మారి, 1970లో ప్రారంభమైన 'ఎర్త్ డే' ఉద్యమానికి కూడా ప్రేరణ నిచ్చింది. దాదాపు 58 సంవత్సరాల తర్వాత, నాసా చేపట్టిన ఆర్టెమిస్ II యాత్రలో వ్యోమగాములు చంద్రుడి సమీపం నుంచి భూమి దిగువకు జారుతున్న మరో అద్భుత దృశ్యాన్ని చిత్రీకరించారు. దీనిని 'ఎర్త్‌సెట్'గా పిలుస్తున్నారు. ఈ చిత్రాన్ని మొత్తం సిబ్బంది తరఫున విడుదల చేయడం విశేషం. ఆధునిక ఉపగ్రహాలు ప్రతిరోజూ భూమి లక్షలాది చిత్రాలను పంపుతున్నప్పటికీ, ఒక మనిషి కళ్లతో చూసి తీసిన ఈ చిత్రం ప్రత్యేకమైన భావోద్వేగాన్ని కలిగిస్తుంది. ఈ రెండు చిత్రాలు కేవలం అందమైన దృశ్యాలను మాత్రమే చూపించడం లేదు. గత ఆరు దశాబ్దాల్లో భూమిపై జరిగిన పర్యావరణ మార్పులకు కూడా సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ కాలంలో వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ సాంద్రత గణనీయంగా పెరిగింది. ప్రపంచ సగటు ఉష్ణోగ్రత ఒక డిగ్రీ సెల్సియస్‌కు పైగా పెరిగింది. అడవుల నరికివేత, నగరాల విస్తరణ, వ్యవసాయ భూముల పెరుగుదల, ఆరల్ సముద్రం వంటి భారీ జలాశయాల క్షీణత వంటి మార్పులు భూమి రూపురేఖలను మార్చేశాయి. అంతేకాకుండా అంటార్కిటికాలో వేలాది చదరపు కిలోమీటర్ల మంచు ఫలకాలు కూలిపోవడం, రెండు ధ్రువాల్లో సముద్ర మంచు తగ్గిపోవడం వంటి పరిణామాలు వాతావరణ మార్పుల తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తున్నాయి. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఈ మార్పుల్లో అత్యధిక భాగానికి మానవ కార్యకలాపాలే కారణం.



## చిగురించిన రాబిన్ హుడ్ చెట్టు..




ఉత్తర ఇంగ్లాండ్‌లోని ప్రసిద్ధ 'సైకమోర్ గ్యాప్' వద్ద ఉన్న సైకమోర్ చెట్టు ప్రపంచవ్యాప్తం గా ప్రకృతి ప్రేమికులను ఆకర్షించిన ఒక అరుదైన చిహ్నం. ఒంటరిగా ఒక లోయ మధ్య నిలిచిన ఈ చెట్టుకు సుమారు 150 నుంచి 200 సంవత్సరాల చరిత్ర ఉంది. అందమైన ప్రకృతి దృశ్యంలో భాగంగా నిలిచిన ఈ వృక్షం, 'రాబిన్ హుడ్: ప్రిన్స్ ఆఫ్ థీవ్స్' అనే సినిమాలో కనిపించింది. ఆ తర్వాత దీనిపేరు 'రాబిన్ హుడ్ ట్రీ'గా మారిపోయింది. 2023లో ఈ చారిత్రక చెట్టును ఉద్దేశపూర్వకంగా నరికివేయడం బ్రిటన్ అంతటా తీవ్ర ఆగ్రహానికి కారణమైంది. ఈ ఘటనలో చెట్టుతోపాటు సమీపంలోని రోమన్ చక్రవర్తి హాడ్రియన్ నిర్మించిన 'హాడ్రియన్స్ వాల్'లోని ఒక భాగం కూడా దెబ్బతింది. క్రీ.శ. రెండో శతాబ్దానికి చెందిన ఈ గోడ ప్రస్తుతం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందింది. అయితే చెట్టు కథ అక్కడితో ముగియలేదు. నరికివేసిన తర్వాత నేలలో మిగిలిన మొద్దు నుంచి కొత్త చిగుర్లు రావడం ప్రారంభమైంది. దీనిని సహజ పునరుత్పత్తి అంటారు. సైకమోర్ వంటి కొన్ని చెట్లకు వేర్లు సజీవంగా ఉంటే, అవి మళ్లీ కొత్త కొమ్మలను పెంచుకునే సామర్థ్యం ఉంటుంది. ఈ కొత్త చిగుర్లు భవిష్యత్తులో మళ్లీ పెద్ద చెట్టుగా ఎదుగుతాయా అనేది సంరక్షణ, వాతావరణ పరిస్థితులు, వ్యాధుల నియంత్రణ వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. అయినప్పటికీ, శతాబ్దాల చరిత్రను మోసిన ఈ చెట్టు మరోసారి జీవం పొందే అవకాశం ప్రకృతి పునరుజ్జీవన శక్తికి నిదర్శనంగా నిలుస్తోంది. 'ఒక చెట్టును నాశనం చేయడానికి కొన్ని నిమిషాలు చాలు. కానీ అది పెరిగి తరతరాల జ్ఞాపకంగా మారడానికి శతాబ్దాలు పడతాయి' అనే వాస్తవాన్ని ఈ ఘటన స్పష్టం చేస్తుంది. ప్రకృతి వారసత్వాన్ని కాపాడటం అంటే కేవలం పర్యావరణాన్ని రక్షించడం మాత్రమే కాదని, చరిత్ర, సంస్కృతి, ప్రజల భావోద్వేగాలను కూడా సంరక్షించడమని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి.

## వ్యవసాయంలో రోబోటిక్ విప్లవం



వ్యవసాయరంగంలో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, కీటకాల నియంత్రణకు శాస్త్రవేత్తలు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. ఇందులో భాగంగా అతినీల లోహిత (అల్ట్రావయొలెట్ లేదా యువి)కాంతిని ఉపయోగించే స్వయంచాలక రోబోట్లను అభివృద్ధి చేశారు. ఈ భారీ రోబోట్లు పొలాల్లో స్వయంగా సంచరిస్తూ, పంటలకు నష్టం కలిగించే కీటకాలను గుర్తించి వాటిపై యువి కాంతిని ప్రయోగించి నియంత్రించగలవు. ప్రస్తుతం రైతులు కీటకాల నివారణకు అధికంగా రసాయనిక పురుగుమందులపై ఆధారపడుతున్నారు. అయితే వీటి అధిక వినియోగం వల్ల నేల నాణ్యత తగ్గడం, నీటి కాలుష్యం పెరగడం, పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. అంతేకాకుండా ఆహార పదార్థాల్లో రసాయన అవశేషాలు మిగిలి మానవ ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంటుంది. యువి ఆధారిత రోబోటిక్ వ్యవస్థలు ఈ సమస్యలకు పర్యావరణహిత ప్రత్యామ్నాయంగా మారే అవకాశం ఉంది. అవసరమైన ప్రాంతాల్లో మాత్రమే కీటకాలను లక్ష్యంగా చేసుకోవడం వల్ల రసాయనాల వినియోగాన్ని తగ్గించవచ్చు. దీనివల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు పంటల్లో రసాయన అవశేషాలు తగ్గుతాయి. పంటలకు మేలుచేసే తేనెటీగలు, సీతాకోకచిలుకలు వంటి పరాగసంపర్క కీటకాలను రక్షించే అవకాశం ఈ సాంకేతికత వల్ల సాధ్యమవుతుంది. .

## అరుదైన వ్యక్తిత్వం



ఉరుగ్వే మాజీ అధ్యక్షుడు జోస్ ముజికాను అరుదైన వ్యక్తిత్వంగల నాయకుడిగా పేర్కొంటారు. 2010 నుంచి 2015 వరకు ఉరుగ్వే అధ్యక్షుడిగా పని చేసిన ఆయన, అధికార పదవిలో ఉన్నప్పటికీ అత్యంత సాధారణ జీవనశైలిని కొనసాగించ డం ద్వారా అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందాడు. తన అధ్యక్ష జీతంలో ఎక్కువ భాగాన్ని దానం చేయడం, రాజధాని మాంటెవీడియోలోని సాధారణ ఫార్మ్‌హౌస్‌లో నివసించడం, పాత 'వోక్స్‌వాగన్ బీటిల్' కారును ఉపయోగించడం వంటి విషయాలు అతని నిరాడంబరత్వానికి ప్రతీకలు. కొంతమంది ఆయనను ప్రపంచంలోనే అత్యంత పేద దేశాధ్యక్షుడిగా అభివర్ణిస్తారు. కానీ, ఆ వాదన సరైనది కాదు. ఎందుకంటే, ముజికాకు వ్యవసాయ భూమి ఉంది, రాజకీయ అనుభవం, ప్రజాదరణ, సామాజిక ప్రభావం ఉన్నాయి. అవసరాలకు మించి సంపదను కూడబెట్టకూడదనే ఒక చైతన్యపూర్వక జీవన విధానాన్ని అవలంభించాడు. ఎప్పుడూ ఇంకా ఎక్కువ కావాలని కోరుకోవడమే నిజమైన పేదరికం అనే ఆయన భావన వినియోగవాదంపై ఒక తాత్విక విమర్శగా చూడవచ్చు. ఇది మినిమలిజం, స్టోయిసిజం వంటి ఆలోచనా ధోరణులకు దగ్గరగా ఉంటుంది. ముజికా పాలనలో ఉరుగ్వే ఆర్థిక వృద్ధిని కొనసాగించింది. అదే సమయంలో గంజాయి చట్టబద్ధీకరణ, స్వలింగ వివాహానికి చట్టబద్ధ గుర్తింపు వంటి సామాజిక సంస్కరణలు కూడా ఆయన కాలంలో జరిగాయి.

– బిఎస్ఎస్ మైత్రేయి

# ఇస్రో ఆపరేషన్స్ ప్రైవేటీకరణ ఎజండా

రోదసీ అన్వేషణలో కీలకం, దేశానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఉపగ్రహాల ఉత్పత్తిని, వాటిని ప్రయోగించే వాహకాల (లాంచ్ వెహికల్స్)ను మోదీ ప్రభుత్వం ఇండియన్ స్పేస్ రీసెర్చి ఆర్గనైజేషన్ (ఇస్రో) నుంచి ప్రైవేటురంగానికి బదిలీ చేస్తున్నదా? ఇప్పుడు అమలు జరుగుతున్న చర్యలు 'ఔను' అనే సమాధానాన్ని ధృవీకరిస్తున్నాయి. ఇస్రో మరింతగా పరిశోధన, శాస్త్రీయ అన్వేషణ రోదసీ యాత్రలు, అధునాతన రోదసీ మౌలిక వసతుల నిర్మాణం వంటి వాటిపై కేంద్రీకరించే వెసులుబాటు కలిగించే నిమిత్తం ప్రైవేటురంగాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నది. ఇస్రో కార్యక్రమాల్లో మార్పు 2023 లో ప్రకటించిన స్పేస్ పాలసీ కింద వేగవంతమైంది. 2025 చివరలో ఎస్ఎస్ఎల్‌వి (చిన్న ఉపగ్రహ ప్రయోగ వెహికిల్) హక్కులను ఇస్రోనుంచి హెచ్ఎఎల్ రూ.511కోట్లకు వేలంలో దక్కించుకుంది. ఇది ఒక ప్రభుత్వరంగ సంస్థ నుంచి మరో ప్రభుత్వరంగ సంస్థకు బదలాయింపులా కనిపించినా, హెచ్ఎఎల్ వైఫల్యాన్ని చాటటానికి ఈ బదలాయింపు జరిగి ఉండవచ్చుననే అనుమానాలు లేకపోలేదు. ఎందుకంటే, అది తేజాస్ ఎంకె1A జెట్‌లు తదితర కీలకమైన స్వదేశీ యుద్ధ పరికరాలను నిర్ణీత సమయంలో సరఫరా చేయలేక విమర్శలు ఎదుర్కొంటున్నది.

ఇస్రోలో ప్రైవేటీకరణకు అనుసరిస్తున్న పద్ధతి రైల్వేలలో, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ వంటి ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణకు ఆచరించిన పద్ధతులను గుర్తు చేస్తున్నది. ప్రజల డబ్బుతో ప్రభుత్వ ఆస్తులు నిర్మించటం, వాటి నిర్వహణను నిర్లక్ష్యం చేసి అవి సవ్యంగా పనిచేయటం లేదని నిందలు వ్యాప్తిలో పెట్టటం, అంతిమంగా వాటిని కారుచౌకగా ప్రైవేటు కంపెనీలకు విక్రయించి లాభాలు చేకూర్చటమే ఆ రీతి. అటువంటి లోపాయికారి ఒప్పందాల్లో అధికారులు కమిషన్‌లు, లంచాలు అందుకున్నారనే ఆరోపణలు లేకపోలేదు.


ఇస్రో వాణిజ్య కార్యకలాపాల నిర్వహణకు న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్(ఎన్ఎస్ఐఎల్) అనే సంస్థ ఉండగా, ఇన్–స్పేస్ (IN–SPACe) అనే మరో సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇస్రో ఆస్తులను వాణిజ్యపరం చేయటాన్ని (విక్రయించే) వేగిరపరచటానికే ఈ కొత్త సంస్థను ఏర్పాటు చేశారని విమర్శకులు వాదిస్తున్నారు. దాని చైర్మన్ డాక్టర్ పవన్ గోయింకా శుక్రవారం ఢిల్లీలో మాట్లాడుతూ, రొటీన్ ఉపగ్రహాలు, పిఎస్ఎల్‌వి, ఎల్‌వి ఎంకె వంటి లాంచి వెహికల్స్ ఉత్పత్తి చేయటాన్ని ఇస్రో నిలుపు చేస్తుందని, వాటి ఉత్పత్తి పూర్తిగా ప్రైవేటు, ప్రభుత్వరంగ సంస్థలకు బదిలీ అవుతుందని చెప్పారు. ఈ క్రమం ఇప్పటికే ప్రారంభమైంది. ప్రైవేటు కంపెనీలు సొంతంగా చేపట్టలేని పరిశోధన, అధునాతన టెక్నాలజీలు, శాస్త్రీయ పరిశోధన యాత్రలు, మౌలిక వసతుల నిర్మాణంపై ఇస్రో కేంద్రీకరిస్తుందన్నారు. ఎస్ఎస్ఎల్‌వి క్రమంలో హెచ్ఎఎల్‌ను అనుమతించినట్లు, పిఎస్ఎల్‌వి వేలం ఎల్‌విఎం 3 తదితర భవిష్యత్ టెక్నాలజీ బదలాయింపు క్రమంలో పాల్గొనేందుకు ప్రభుత్వరంగ సంస్థలు అనుమతించబడవని, ప్రైవేటు పరిశ్రమలు మాత్రమే ఆ వ్యాపారం చేబడతాయని కూడా డాక్టర్ గోయింకా చెప్పటం గమనార్హం. "మేము ఇప్పటికే 120 టెక్నాలజీలను ఇస్రో నుంచి ప్రైవేటురంగానికి బదిలీ చేశాం. కొత్త లాంచ్ సెంటర్ కార్యకలాపాలను ప్రైవేటు పరిశ్రమలకు ఇచ్చేందుకు ప్రభుత్వం తలపెట్టింది. వచ్చే నాలుగైదు మాసాల్లో ప్రైవేటు ఆపరేటర్ ఖరారు అవుతారని" కూడా ఆయన చెప్పారు. ఇస్రో ఆస్తులు, కార్యకలాపాల ప్రైవేటీకరణకు మోదీ ప్రభుత్వం ఎంత త్వరపడుతున్నదో కదా! రోదసీ ఆర్థిక వ్యవస్థను 2033 నాటికి ప్రస్తుత 8 బిలియన్ డాలర్లనుంచి 44బి.డా.లకు పెంపు చేయటం ప్రభుత్వ లక్ష్యం. రక్షణశాఖ ఇప్పటికే ప్రైవేటు కంపెనీలకు 31 ఉపగ్రహాలు ఆర్డరు ఇచ్చిందట, ఇస్రో 21 ఉపగ్రహాలే ఉత్పత్తి చేస్తుందట. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో వేగవంతమైన మార్పుకు ఇది మరో సూచన.

రెండోవైపున, ఇస్రో లక్ష్యాల సాధన నెమ్మదించటాన్ని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ విమర్శించింది. ఇస్రో బడ్జెట్ పూర్తిగా ఉపయోగించకపోవటం, చంద్రయాన్–4, చంద్రయాన్–5, వీనస్ ఆర్బిటర్ మిషన్ (శుక్రయాన్ 1) సహా ప్రధానమైన అన్వేషణ కార్యక్రమాలు జాప్యం కావటాన్ని ఆ కమిటీ మార్చి 2026 నివేదిక ఆక్షేపించింది. అధునాతన టెక్నాలజీలను (ఉపగ్రహాలు, రాకెట్లు, ఆధునిక మెటీరియల్స్) తక్కువ ధరలకు ప్రైవేటు కంపెనీలకు బదిలీ చేయటాన్ని కమిటీ గట్టిగా తప్పుపట్టింది.

ఇస్రో, దాని శాస్త్రవేత్తల పట్ల నిర్లక్ష్యం, అనేక కార్యకలాపాలను ప్రైవేటీకరించటం వల్ల ఇస్రో మానవ వనరుల కొరత ఎదుర్కొంటున్నది. 100 మందికిపైగా శాస్త్రవేత్తలు, సాంకేతిక సిబ్బంది ఇటీవల రాజీనామా, వలెంటరీ రిటైర్మెంట్ తీసుకుని ప్రైవేటు రంగంలోకి వెళ్లటం తెలిసిందే. ఈ రిటైర్మెంట్లకు వేతనాలు సమస్య కన్నా వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు, పెరుగుతున్న బ్యూరోక్రటిక్ పెత్తనం కారణమని ఇస్రో మాజీ చైర్మన్ జి.మాధవన్ హెచ్చరిక చేశారు. ప్రభుత్వం ప్రైవేటీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాక రోదసీ శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు మెరుగైన జీవితాన్ని ఎంచుకోవటంలో ఆశ్చర్యం లేదు.

# హార్ముజ్ జలసంధిపై ట్రంప్ మడత పేచీలు

ఆజాద్ మీర్జా




ఇరాన్‌పై అమెరికా – ఇజ్రాయెల్ యుద్ధం దాదాపు ఆరు నెలలు పూర్తిచేసుకుంటోంది. హార్ముజ్ జలసంధి నౌకాయానమార్గంగా తగ్గిపోయి వాగాడంబర యుద్ధక్షేత్రంగా మారింది. ఆ కార్యస్థలం ఈ వారం కొత్త దశకు చేరుకుంది. ఆ జలమార్గం "కొత్త అమెరికా భూభాగం" అంటూ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం (ట్రూత్ సోషల్‌పై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)తో రూపొందించిన మ్యాప్ పోస్టు చేశారు. "జలసంధి తెరుచుకుంది – పనిచేస్తున్నది" అని వక్కాణిస్తూ, "నీటిలోని మందుపాతరలన్నీ తొలగించబడినాయి లేదా పేల్చి వేయబడినాయి" అని ప్రకటించారు.

టెహరాన్ ఆ ప్రకటనను మొరటుగా పరిహసించింది – ట్రంప్ తర్కం ప్రకారం తాము కూడా కాలిఫోర్నియాను ఇరాన్ భూభాగంగా ప్రకటించగలం అని ఇరాన్ అధికారులు అన్నారు. "వాషింగ్టన్ ఇరాన్ రేవుల దిగ్బంధనం ఎత్తివేసేవరకు, ఆయిలుపై ఆంక్షలు ఎత్తివేసేవరకు, స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తులు విడుదల చేసేవరకు, ప్రతి ఒక్క రంగంలోనూ మిలటరీ చర్యలు నిలుపు చేసేవరకు హార్ముజ్ జలసంధి మూసివేయబడే ఉంటుంది" అని పార్లమెంటు స్పీకర్ మొహమ్మద్ బకెర్ క్వాలిబఫ్ పార్లమెంటు సభ్యులకు చెప్పారు. రెండు ప్రకటనలూ సత్యం కాబోవు. చెప్పుకునేదానికీ – వాస్తవికతకు మధ్యనున్న దూరం ఇప్పుడు ఈ సంక్షోభంలో కేంద్రబిందువుగా ఉన్న వాస్తవం.

ట్రంప్ భౌగోళిక వాదనను మానసిక ఒత్తిడి తెచ్చేటటువంటి రాజకీయ ప్రదర్శనగా చూడాలి తప్ప ఆచరణకు నోచుకున్న క్లెయింగా కాదు. జలసంధిని స్వాధీనం చేసుకోవటం, భౌతికంగా దాన్ని నిర్వహించటం అమెరికా ఉద్దేశం అయినట్లు గంభీరమైన సూచన ఏదీ లేదు. ట్రంప్ సొంత అధికారులు సైతం జలసంధి ద్వారా సురక్షిత ప్రయాణాన్ని సుగమం చేసేందుకు నావికా దిగ్బంధనం గూర్చి మాట్లాడుతున్నారు. అయితే హార్ముజ్ తమ భూభాగం అని వ్యూహాత్మక ప్రకటన చేయటంలో ట్రంప్ ఎత్తుగడ – జలసంధి ఇప్పటికే తెరుచుకుందని చెప్పటం ద్వారా దాని మూసివేతను నియంత్రించే అవకాశాన్ని ఇరాన్‌కు నిరాకరించటం, అదే సమయంలో ముమ్ముందు ఏదైనా విఘాతం జరిగినా అమెరికా ప్రకటిత భూభాగంపై 'కవ్వింపు'గా చిత్రించే అవకాశాన్ని అట్టిపెట్టుకోవటం.

ఇదిలా వుండగా, ఇరాన్ ఒమన్‌తో నేరుగా జలసంధి ద్వారా ఓడల రాకపోకలపై ఒక ఒప్పందం కుదుర్చుకుంది. వాషింగ్టన్‌కు ఏ మాత్రం అవకాశం కల్పించకుండా కొంత ట్రాఫిక్ పునరుద్ధరించటం ఇరాన్ ఉద్దేశం. తమ ఏర్పాటు బాటలోకి ప్రవేశిస్తే ఒమన్ పై బాంబుల వర్షం కురిపిస్తామని ట్రంప్ చేసిన హెచ్చరిక – హార్ముజ్ తమ భూభాగం అంటూ ఆయన ప్రకటించటంలోని వాస్తవ ఆందోళనను వ్యక్తం చేస్తున్నది. జలసంధి మూతపడి ఉండటం పట్ల ఆందోళన కన్నా దాన్ని తెరిచే కథనంలో తమ కంట్రోలు చేజారుతున్నదనే భయం వాషింగ్టన్‌లో కనిపిస్తున్నది.

ఇదంతా కలిపి చూస్తే, ఇరుపక్షాలూ ఒప్పందం వైపు ప్రయాణించటం లేదు. అవి రెండూ హార్మూజ్ జలసంధిని తెరిచేందుకు తమ సొంత నిర్ణయాల అమలుకై ప్రయత్నిస్తున్నాయి. దీనివల్ల సమీప భవిష్యత్తులో సాధారణ ట్రాఫిక్ పునరుద్ధరణ అసాధ్యమవుతున్నది. దేశంలో రాజకీయ నేపథ్యం మసకబారుతుండగా ట్రంప్ దేశం వెలుపల ధీరత్వం ప్రదర్శిస్తున్నారు. రాయిటర్స్/ఐప్‌సోస్‌పోల్ ప్రకారం ట్రంప్ ఆమోద రేటింగ్ ఈవారంలో 33 శాతానికి తగ్గింది. అది ఆయన ఈ అధ్యక్షపదవీ కాలంలో అతితక్కువ. 64 శాతం మంది అమెరికన్‌లు ఆయన విధానాలు ఆమోదించటం లేదు. ఇరాన్ యుద్ధం త్వరలో పరిష్కారం కాబోదని ప్రతి ఐదుగురు అమెరికన్‌లలో దాదాపు నలుగురు భావిస్తున్నారు."కొద్ది వారాల్లో ముగుస్తుందని" ట్రంప్ వాగ్దానం చేసిన యుద్ధం ఆర్నెల్లుగా కొనసాగుతూ ఉండటం గ్యాసోలిన్ ధరను గణనీయంగా పెంచింది. నవంబర్ మధ్యంతర ఎన్నికలు సమీపిస్తున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థపైన, కాంగ్రెస్ ఎన్నికల్లో పార్టీ అవకాశాలపైన భారంగా తయారైన సంఘర్షణ పట్ల రిపబ్లికన్ వ్యూహకర్తలు ఆందోళన చెందుతున్నారు. ట్రంప్ "అమెరికా కొత్త భూభాగం" ప్రకటన చేయటానికి ఇదీ నేపథ్యం. ఈ ప్రకటన టెహరాన్ కన్నా ఎక్కువగా అమెరికా ఓటర్లకు ఉద్దేశించింది. ఇది ప్రకటనలతో పరిష్కారమయ్యే సమస్య కాదు.

ఏదో ఒక పక్షం వెనక్కు తగ్గాలి. ఆ పరిస్థితి కనిపించటం లేదు. యుద్ధం ప్రారంభించింది అమెరికా కాబట్టి ఇరాన్ సైనికంగా గట్టిగా ఎదుర్కొంటూనే తమ డిమాండ్లపై దృఢంగా ఉంది. అమెరికా సైనిక చర్యలకు సహాయ పడితే దాడులు చేస్తామని గల్ఫ్ సహకార కౌన్సిల్ (బహరైన్, కువైట్, ఒమన్, కటార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) దేశాలను ఇరాన్ హెచ్చరించటం దాని తెగింపును సూచిస్తుంది. అమెరికా–ఇరాన్ మధ్య చర్చలకు మధ్యవర్తులు కుదిర్చిన "మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండింగ్ " కాలం గతించి పేరుకు తప్ప ఆచరణ లో జీవంలేని కాగితంగా మారింది. అందువల్ల సమగ్రమైన పరిష్కారం జరగాలంటే యుద్ధరంగంలో లేదా ఆర్థిక రంగంలో నాటకీయమైన మలుపు సంభవించి ఒక పక్షం వెనక్కు తగ్గాలి. లేదా అమెరికా – ఇరాన్‌లు తమ వాదోపవాదాలు కొనసాగించుకుంటూనే, ఒమన్ ఇరాన్‌తో కుదుర్చుకున్న నౌకాయాన మార్గంద్వారా ఆయిలు, ఇతర వాణిజ్య సరుకు ఓడల రవాణాను పాక్షికంగానైనా అనుమతించాలి. లేనట్లయితే ప్రపంచ ఇంధన ధరలు నిత్యం పెరుగుతూ ప్రపంచ వ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. అదీ ట్రంప్‌కే చేటు చేస్తుంది.

ప్రపంచంలో ఆయిలు దిగుమతుల్లో మూడవ అతిపెద్ద స్థితిలో ఉన్న భారత్ తన క్రూడ్ ఆయిలు అవసరాల్లో 88 శాతం దిగుమతులపై ఆధారపడి ఉంది. అందువల్ల గల్ఫ్ సంక్షోభం దెబ్బ నేరుగా తగులుతుంది. దాని దిగుమతుల్లో 40–50 శాతం, ఎల్ఎన్‌జి, ఎల్‌పిజి దిగుమతుల్లో అత్యధికం హార్మూజ్ జలసంధి ద్వారానే జరగాలి. తమ కొనుగోలును 40దేశాలకు విస్తృతం చేసినప్పటికీ నిత్యం టెన్షన్ తప్పదు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఆయిలు దిగుమతుల వల్ల పరిస్థితి కొంత మెరుగైనప్పటికీ, దిగుమతుల వ్యయం భారీగా పెరుగుతున్నది. భారత్‌తో పాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ఇబ్బందుల పాల్జేస్తున్న ట్రంప్ చివరకు సాధించేది ఏమీ ఉండదు– పరాజయం లేదా పరాభవం తప్ప!

# విలీనం వద్దు.. పాలిటెక్నిక్‌లను బలోపేతం చేయాలి!



కసిరెడ్డి మణికంఠ రెడ్డి
ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు
7569548477

తెలంగాణలో పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉన్న సాంకేతిక విద్యకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు వెన్నెముకగా ఉన్నాయి. ఎన్నో దశాబ్దాలుగా ప్రతి విద్యాసంవత్సరం వేలాదిమంది విద్యార్థులకు డిప్లొమా విద్యను అందిస్తూ, ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలకు మార్గం చూపుతున్న పాలిటెక్నిక్ విద్య వ్యవస్థకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభు త్వం జీఒనెం.97 తీసుకువచ్చి పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలనే ప్రభుత్వ నిర్ణయం విద్యార్థుల్లో, అధ్యాపకుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో 59 ప్రభుత్వ,54 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉండగా లక్ష మంది విద్యార్థులు పాలిటెక్నిక్ విద్య చదువుతున్నారు. పాలిటెక్నిక్ విద్య చదివే వారిలో అత్యధికులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ విద్యార్థులే. అందులో పాలిటెక్నిక్ విద్యను ఎక్కువగా బాలికలే చదివేది.

నైపుణ్య విద్యను అభివృద్ధి చేయడం పేరుతో ఇప్పటి కే ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను, ఐటీఐలను, ఎటిసి విద్యారంగాలను స్కిల్ ఇండియా యూనివర్సిటీలో విలీనం చేయడం పరిష్కారం కాదు. ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యంతో నడిచే స్కిల్ యూనివర్సిటీలో పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను విలీనం చేయడం పాలిటెక్నిక్ విద్యను కార్పొరేటీకరించే కుట్రలో భాగంగానే జరుగుతున్నట్లు అనుమానాలు కలుగుతున్నాయి. ప్రభుత్వ ప్రవేట్ భాగస్వామ్యంతో స్కిల్ యూనివర్సిటీ నిర్వహణలో ఉన్నది కాబట్టి ఆ యూనివర్సిటీకి ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే యూనివర్సిటీ వారు ఫీజులు పెంచి విద్యార్థుల దగ్గరి నుండి నిధులు రాబట్టే అవకాశం ఉంటుంది. దీంతో విద్యార్థులపై ఫీజుల భారం పడే అవకాశం ఉంది. ఒకవేళ ఫీజు లు పెంచితే వేలాది మంది విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యకు దూరమయ్యే అవకాశం లేకపోలేదు. స్కిల్ యూనివర్సిటీపై మాకు వ్యతిరేకత లేదు కానీ ఈ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను దాని పరిధిలో కలిపే నిర్ణయాన్ని మాత్రం వ్యతిరేకిస్తున్నాం.

పాలిటెక్నిక్ విద్య అనేది కేవలం స్కిల్ ట్రైనింగ్ సెంటర్ కాదు. ఇది గుర్తింపు పొందిన సాంకేతిక విద్యా వ్యవస్థ. డిప్లొమా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఇంజినీరింగ్ విద్యలోకి వెళ్లే అవకాశాలను కల్పించే కీలకమైన విద్యా మార్గం. అలాంటి వ్యవస్థను మరో సంస్థ పరిధిలోకి తీసుకెళ్లే ముందు విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభుత్వం ఆలోచించాలి. ఉన్న వ్యవస్థ అభివృద్ధికి కృషి చేయాల్సింది పోయి ఇలాంటి నిర్ణయం ఎందుకని? దీని వెనుక ఆలోచన ఏందని? ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల పాలిటెక్నిక్ విద్య ప్రైవేట్ పరం కానుంది అనే ఆందోళనలో విద్యార్థులు ఉన్నారు.




**ప్రభుత్వం దృష్టికి కొన్ని అంశాలు?**

పాలిటెక్నిక్ కళాశాలలు స్కిల్ యూనివర్సిటీలో విలీనం అయితే విద్యార్థుల డిప్లొమా గుర్తింపు, ఉన్నత విద్య అవకాశాలు, ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, ఉద్యోగ అవకాశాలు ఎలా ఉంటాయి? ప్రస్తుతం ప్రభుత్వ ఆధ్వర్యంలో తక్కువ ఖర్చుతో చదువుతున్న పేద విద్యార్థులపై పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో నిర్వహణలో ఉండే స్కిల్ యూనివర్సిటీలో భవిష్యత్తులో అదనపు ఫీజుల భారం పడదని ప్రభుత్వం హామీ ఇవ్వగలదా? ఆ నమ్మకం లేదు విద్యార్థులకు ఎందుకంటే అక్కడ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నది అంత పారిశ్రామిక వేత్తలే కాబట్టి.

పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయకుండా, సరైన ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేయకుండా కేవలం వ్యవస్థను మార్చడం వల్ల విద్యార్థులకు వచ్చే ప్రయోజనం ఏమిటి? సమస్య పాలిటెక్నిక్ విద్యలో ఉందా? లేక దానికి అవసరమైన నిధులు, అధ్యాపకులు, మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యంలో ఉందా? అనే ప్రశ్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కలుగుతుంది. ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వెనుక ఉద్దేశ్యం ఏంటి?

**విలీనం కాదు.. బలోపేతం చేయాలి**

ప్రభుత్వం చేయాల్సింది పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో కలపడం కాదు. ప్రతి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఆధునిక సాంకేతిక విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయాలి. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఆధునిక ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేయాలి. పరిశ్రమలతో అనుసంధానం చేసి ఇంటర్న్‌షిప్‌లు, అప్రెంటిస్‌షిప్‌లు పెంచాలి. క్యాంపస్ ప్లేస్‌మెంట్లను బలోపేతం చేయాలి. విద్యార్థులకు ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో నాణ్యమైన సాంకేతిక విద్య అందించాలి. డిప్లొమా తర్వాత ఉన్నత విద్యకు వెళ్లే అవకాశాలను మరింత విస్తరించాలి. స్కిల్ యూనివర్సిటీని అభివృద్ధి చేయాలంటే కొత్త అవకాశాలు సృష్టించాలి కానీ ఉన్న ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీన పరచకూడదు.

ప్రభుత్వ విద్యాసంస్థలను ఒక్కొక్కటిగా కొత్త పేర్లు, కొత్త విధానాల పేరుతో పునర్వ్యవస్థీకరించడం వల్ల చివరకు పేద విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్య దూరమయ్యే ప్రమాదం ఉంది. విద్యను మార్కెట్ అవసరాలకు మాత్రమే పరిమితం చేయకుండా, విద్యార్థుల సామాజిక, విద్యా హక్కులను కూడా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. విద్యార్థులు, అధ్యాపకులు, విద్యావేత్తలు, సాంకేతిక నిపుణులు, విద్యార్థి సంఘాలతో బహిరంగ చర్చ నిర్వహించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి.

ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న రోజు నుండి ఇప్పటివరకు విద్యార్థులంతా రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకొని స్కిల్ యూనివర్సిటీలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేసే నిర్ణయాన్నిల వెంటనే ఉపసంహరించుకోవాలి.

# డిసెంబర్‌లోగా సచివాలయంలో సోలార్ పార్కింగ్ పనులు పూర్తి

- సిఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్, ఆర్‌ఓబి పనుల్లో వేగం పెంచాలి
- రూ.5,159 కోట్లతో 3,918 కి.మీ.రోడ్ల పనులు మంజూరు
- అధికారులు క్షేత్రస్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలి: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర సచివాలయంలో చేపడుతున్న సోలార్ కార్ పార్కింగ్ పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా సిఆర్ఐఎఫ్ రోడ్లు, సేతుబంధన్ పథకం కింద చేపడుతున్న బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) పనుల్లో వేగం పెంచాలని సూచించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శనివారం ఆర్అండ్‌బి శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్మిస్తున్న షెడెడ్ పార్కింగ్ (సోలార్ కార్ పార్కింగ్) పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సోలార్ కార్ పార్కింగ్ అందుబాటులోకి వస్తే సచివాలయానికి అవసరమైన సుమారు 90 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, తద్వారా నెలవారీ విద్యుత్ బిల్లులో దాదాపు 16 శాతం ఆదా అవుతుందని మంత్రి తెలిపారు.

**3,918 కి.మీ. రోడ్ల పనులు..**
రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రూ.5,159 కోట్లతో 3,918 కి.మీ. మేర 316 రోడ్డు పనులను మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. వీటిలో కొన్ని పనులు ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, మరికొన్ని చివరి దశకు చేరుకున్నాయని చెప్పారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.868 కోట్లతో చేపట్టిన 422.36 కి.మీ. రోడ్ల పనుల పురోగతి సంతృప్తికరంగా ఉందని పేర్కొన్నారు. హై లెవెల్ బ్రిడ్జిలు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సేతుబంధన్ పథకం కింద రూ.76 కోట్లతో చేపడుతున్న నార్కట్‌పల్లి బ్రిడ్జి పనుల పురోగతిపై మంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. మిర్యాలగూడ, సందిప హాప్ బ్రిడ్జి పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. క్షేత్రస్థాయిలో అధికారులు మరింత కష్టపడి పనిచేయాలని, నాణ్యమైన రోడ్ల నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో ఆర్అండ్‌బి శాఖ ఇఎన్‌సి (అడ్మిన్) లింగారెడ్డి, సిఇలు వసంత నాయక్, వనజ, ధర్మారెడ్డి, డిసిఇ అహ్మద్ అబ్దుల్ అలీ, ఇఇ రూప్ కరణ్, డిఇ రూపారాణి, ఎఇఇ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల పక్షపాతిగా చెరగని ముద్ర

- సురవరం ఆశయాలను, లక్ష్యాలను కొనసాగించాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పిలుపు



**ప్రజాపక్షం/కరీంనగర్:** పేద ప్రజల పక్షపాతిగా అలుపెరగని పోరాటాలు చేసి కార్మికులు,కర్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న మహోన్నతమైన గొప్ప మేధావిగా, కమ్యూనిస్టు యోధుడుగా పేద ప్రజల్లో స్థానం సంపాదించుకున్న సిపిఐ అగ్ర నేత సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి కొనియాడారు. శనివారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి కుటుంబం కమ్యూనిస్టు భావజాలం, అభ్యుదయ భావాలతో నిండి ఉందని, ఆయన పెదనాన్న సురవరం ప్రతాప రెడ్డి నిజాం కాలంలో తెలుగు సాహిత్యంతో గోల్కొండ పత్రికను స్థాపించారని, సాయుధ పోరాట సమయంలో ఆయన కుటుంబమంతా పోరాటంలో పాల్గొన్నారని, ఆ వారసత్వాన్ని సుధాకర్ రెడ్డి పుణికిపుచ్చుకున్నారని గుర్తు చేశారు. విద్యార్థి దశలోనే ఏఐఎస్ఎఫ్ నాయకునిగా ప్రస్థానం ప్రారంభించిన సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి, యువజన సంఘాలకు రాష్ట్ర, జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసి నిరంతరం ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించే నాయకునిగా ఎదిగారని, కరువుకు నిలయమైన రాష్ట్రంలో సాగు, తాగునీరు కోసం జరిగిన అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించారని, విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా జరిగిన ఉద్యమంలో బాష్పవాయువు, లాఠీదెబ్బలు, ఫైరింగ్‌కు కూడా ఆయన ఎదురొడ్డి ముందుండి నిలిచారని గుర్తు చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం, సమాచార హక్కు చట్టం, భూ సంస్కరణల చట్టం అమలు చేయడంలో కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, సమ్మయ్య, న్యాలపట్ల రాజు, సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, పైడిపల్లి రాజు, బామండ్లపెల్లి యుగేందర్, మచ్చ రమేష్, దుడ్డేల సమ్మయ్య, బోనగిరి మహేందర్, బూడిద సదాశివ, పిట్టల శ్రీనివాస్, నాయకులు సునవత్ శ్రీనివాస్, అల్లేపు రాజు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

**సురవరం సుధాకర్ రెడ్డి పాట విడుదల**
సురవరం సుధాకర్ రెడ్డి స్మృతికి గీతాన్ని ఎస్.కె మీరా రచించగా, గడిపె మల్లేష్ సంగీతం, గానం చేసిన పాటను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి ఆవిష్కరించారు. సుధాకర్ రెడ్డిపై పాట రాసిన ఎస్.కె.మీరాను, సంగీతం సమకూర్చి పాడిన గడిపె మల్లేష్‌ను వెంకటరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డేల సమ్మయ్య, సదానందం, సిపిఐ నాయకులు పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, సమ్మయ్య, న్యాలపట్ల రాజు, పైడిపల్లి రాజు, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బోనగిరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన రద్దు రాజకీయ కక్షే

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటన రద్దు కావడం రాజకీయ కక్షలో భాగమేనని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. సిఎం అమెరికా పర్యటన వ్యక్తిగత పర్యటన కాదని, తెలంగాణకు పెట్టుబడులు, విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, సాంకేతికత, ఉపాధి అవకాశాలు తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి విజ్ఞాన, విద్య, నైపుణ్య, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవడం తగదన్నారు. అంతర్జాతీయ విద్యా, పరిశోధనా సంస్థలు, సాంకేతిక సంస్థలను హైదరాబాద్‌కు తీసుకురావడం ద్వారా తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు కల్పించవచ్చని చెప్పారు. రాజకీయ కక్షలు ఉంటే రాజకీయ వేదికపై ఎదుర్కోవాలి తప్ప యువత భవిష్యత్తును, తెలంగాణ అభివృద్ధిని రాజకీయాలకు బలిచేయరాదని మంత్రి హితవు పలికారు.

**కాళేశ్వరం ప్రాజెక్టు ప్రజల ఆస్తి.. లోపాలపై నిగ్గు తేల్చాల్సిందే**
కాళేశ్వరం ప్రాజెక్టు ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని, అది తెలంగాణ ప్రజల ఆస్తి అని, బ్యారేజీల నిర్మాణపరమైన లోపాలపై నిగ్గు తేల్చడంతో పాటు ప్రజాధనానికీ ప్రయోజనం చేకూర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు భవిష్యత్తు భద్రతపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా సమగ్ర శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనం జరగాల్సిన అవసరం ఉందన్నారు. మేడిగడ్డ బ్యారేజీలో వెలుగుచూసిన నిర్మాణపరమైన సమస్యలను కేవలం ఒక బ్యారేజీకి సంబంధించిన అంశంగా కాకుండా, ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం దీర్ఘకాలిక భద్రత, నాణ్యత, జవాబుదారీతనానికి సంబంధించిన అంశంగా చూడాల్సి ఉందన్నారు. మేడిగడ్డ బ్యారేజీ 7వ బ్లాక్‌లోని పియర్లపై కేంద్ర జల, విద్యుత్ పరిశోధన సంస్థ నిర్వహించిన కాంక్రీటు నాణ్యత పరీక్షల్లో లోపాలను గుర్తించిన నేపథ్యంలో ప్రతి అంశాన్ని నిపుణుల సాంకేతిక పరిశీలన ద్వారా నిర్ధారించాల్సి ఉందన్నారు. 19వ పియర్‌లో 73.3 శాతం, 18వ పియర్‌లో 65.5 శాతం, 20వ పియర్‌లో 61.1 శాతం ,17వ పియర్‌లో 50.5 శాతం, 21వ పియర్‌లో 49.9 శాతం, 16వ పియర్‌లో 41.3 శాతం వరకు నాణ్యత లోపాలు ఉన్నట్లు గుర్తించారని చెప్పారు. ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టుకు నష్టం ఎందుకు జరిగిందో, బాధ్యత ఎక్కడ ఉందో, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో తమ ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు. కేంద్ర సంస్థలు, నిపుణుల సూచనలు, సాంకేతిక పరీక్షల ఫలితాల ఆధారంగానే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోందని చెప్పారు.

# కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ యథాతథం

- కోర్టులో ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపిస్తున్నాం: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను తెలంగాణ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ నిలిపివేయదని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ పథకాలపై హైకోర్టులో విచారణ సందర్భంగా ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం తరపున కౌంటర్ దాఖలు కాకపోవడంతో కోర్టు స్టే విధించిందని, విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిన వెంటనే కౌంటర్‌తో పాటు వెకేట్ పిటిషన్ దాఖలు చేసినట్లు చెప్పారు. ఈ అంశంపై హియరింగ్ కూడా పూర్తయిందని వెల్లడించారు.

**ప్రభుత్వ విధానంలో భాగమే సంక్షేమ పథకాలు..**
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలు ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాల్లో భాగమని మంత్రి అన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలవడం, ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. హైకోర్టు ప్రభుత్వం తరఫున వినిపించిన వాదనలను పరిగణనలోకి తీసుకుని అనుకూల నిర్ణయం వెలువడుతుందన్న నమ్మకం ఉందన్నారు. పేద ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక సహాయం అందించే పథకాల విషయంలో రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. పథకం ఆగిపోవాలని కోరుకోవడం, ప్రభుత్వం ఇబ్బందుల్లో పడాలని ఆశించడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు. పేద ప్రజలకు ప్రయోజనం చేకూర్చే పథకాల విషయంలో రాజకీయాలకు అతీతంగా సహకరించాలని ప్రతిపక్షాలను కోరారు. అవసరమైతే ప్రతిపక్షాలు కూడా న్యాయస్థానంలో ఇంప్లీడ్ అయి పేద ప్రజల ప్రయోజనాల కోసం తమ వాదనలు వినిపించాలని మంత్రి సూచించారు. న్యాయపరమైన అంశాలను పరిష్కరించుకుంటూనే అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిరంతరం అందేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ అధిష్టానానికి వ్యతిరేకంగా మాట్లాడలేదు

క్రమశిక్షణ కమిటీ నోటీసుకు వివరణ ఇచ్చిన గడ్డం చిన్నారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా తాను ఎప్పుడూ మాట్లాడలేదని, గోపాల్‌పేటలో ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల కార్యాలయ ప్రారంభోత్సవంలో కూడా ఎవరి పట్లా అనుచిత వ్యాఖ్యలు చేయలేదని టిపిసిసి సీనియర్ నాయకులు డాక్టర్ జి.చిన్నారెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు టిపిసిసి క్రమశిక్షణ కమిటీ అధ్యక్షులు మల్లు రవికి లిఖితపూర్వక వివరణ అందజేశారు. గోపాల్‌పేటలో ఆగస్టు 16న జరిగిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పార్టీ అధిష్టానానికి వ్యతిరేకంగా డాక్టర్ చిన్నారెడ్డి వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన ఆరోపణలపై ఆయన వివరణ కోరుతూ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. దీనికి స్పందించిన ఆయన స్థానిక ఎమ్మెల్యేపై అనుచితంగా ప్రసంగించినట్లు వచ్చిన ఆరోపణలను ఖండించారు. గత కొంతకాలంగా ఒరిజినల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, వివక్షపై తమ ఆవేదనను మాత్రమే కార్యక్రమంలో వ్యక్తం చేశానని, ఎవరిపైనా అనుచిత వ్యాఖ్యలు చేయలేదని వివరణలో తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని, పార్టీ క్రమశిక్షణకు ఎప్పుడూ కట్టుబడి ఉంటానని డాక్టర్ చిన్నారెడ్డి స్పష్టం చేస్తూ నోటీసును ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణ కమిటీని కోరారు. తాను విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీతో అనుబంధం కలిగి ఉన్నానని, సుదీర్ఘకాలంగా పార్టీలో కొనసాగుతున్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలను, పార్టీ అగ్రనేతలను తాను ఎంతో గౌరవిస్తానని, అలాంటి నేతలకు వ్యతిరేకంగా మాట్లాడే ప్రశ్నే లేదన్నారు.

# నాపై అవమానకర వ్యాఖ్యలు.. చర్యలు తీసుకోండి

- నా వెనుక కుట్ర నడిపిస్తున్న అసలు వ్యక్తులను గుర్తించాలి
- టిపిసిసి క్రమశిక్షణా కమిటీకి మంత్రి కొండా సురేఖ లేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తనపై, తన కుటుంబ సభ్యులపై పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు బహిరంగంగా అవమానకర వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం వెనుక ఉండి నడిపిస్తున్న అసలు వ్యక్తులను నిష్పాక్షికంగా గుర్తించి, వారిపై కఠిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని టిపిసిసి క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవిని కోరుతూ ఆమె లేఖ రాశారు. క్రమశిక్షణా కమిటీ తనకు జారీ చేసిన నోటీసుకు ఇప్పటికే వివరణ సమర్పించినప్పటికీ, తనను లక్ష్యంగా చేసుకుని బహిరంగంగా విమర్శలు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. కమిటీ విచారణ కొనసాగుతున్న సమయంలోనే తనపై చర్యలు తీసుకోవాలని మీడియా ముందు డిమాండ్లు చేయడం, తన రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇవ్వడం ద్వారా క్రమశిక్షణా కమిటీ స్వతంత్ర నిర్ణయాన్ని ప్రభావితం చేసే ప్రయత్నం జరిగిందా అనే అంశాన్ని కూడా విచారించాలని కోరారు. సీనియర్ బిసి మహిళా నాయకురాలైన తనపై తీవ్ర వ్యాఖ్యలతో సామూహిక దాడులు జరుగుతున్న సమయంలో పార్టీ నాయకత్వం మౌనం వహించడం ఆందోళన కలిగిస్తోందని సురేఖ లేఖలో పేర్కొన్నారు. తన రాజకీయ భవిష్యత్తుపై తీర్పులు ఇస్తూ, తనపై చర్యలు తీసుకోవాలని మీడియా ముందు డిమాండ్ చేయడం వెనుక ఉన్న ఉద్దేశాలను కూడా పార్టీ నాయకత్వం పరిశీలించాలని కోరారు. పార్టీ క్రమశిక్షణపై తనకు పూర్తి గౌరవం ఉందని మంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, మహిళా సాధికారత, బలహీన వర్గాల ఆత్మగౌరవానికి కట్టుబడి ఉందని పేర్కొంటూ, ఆ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై పార్టీ క్రమశిక్షణా నియమావళి ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణా కమిటీని కోరారు.

**సురేఖ బేషరతుగా క్షమాపణ చెప్పాలి**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తప్పు పట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి, తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కొండా సురేఖను సోదరిలా భావిస్తున్నానని ఆమె కుమార్తె ముఖ్యమంత్రిపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రేవంత్‌రెడ్డిని మెజారిటీ ఎమ్మెల్యేలు నాయకుడిగా ఎన్నుకున్నారన్న అంశం పార్టీ నిర్ణయాలు, నిబంధనలకు కట్టుబడి ఉండాలని సూచించారు.

# బిసిలను కులాల వారీగా లెక్కించాలి

- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాబోయే జనగణన 2027లో ఓబిసి, బిసి కులాల వారీగా జనగణన చేపట్టాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ లేఖ రాశారు. లేఖలో ముఖ్యంగా ఎస్‌సి, ఎస్‌టిల మాదిరిగానే బిసిల కులాల గణనను కూడా తప్పనిసరి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియాకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. 1931 తర్వాత బిసిల కులాల వారీ జనాభాకు సంబంధించి ప్రామాణిక సమాచారం అందుబాటులో లేదని పేర్కొన్నారు. 2011 సామాజిక ఆర్థిక కులగణనలో భారీగా భిన్నమైన కుల ఎంట్రీలు నమోదై డేటా విశ్వసనీయతపై సమస్యలు తలెత్తాయని తెలిపారు. జనగణనలో కులాల పేర్లు, పర్యాయపదాలు, ఉపకులాలు, ప్రాంతీయ పేర్లను ప్రామాణీకరించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్రాల ఓబిసి, బిసి జాబితాలను జనగణన డేటాబేస్‌తో అనుసంధానం చేయాలని కోరారు. బిసిలకు సంబంధించిన ఖచ్చితమైన కులాల వారీ డేటా రిజర్వేషన్లు, సంక్షేమం, విద్య, ఉపాధి విధానాలకు ఎంతో అవసరమని పేర్కొన్నారు. జనగణన 2027లో బిసి కులాల గణన శాస్త్రీయంగా, ఏకరీతిగా, విశ్వసనీయంగా జరిగేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని జి.నిరంజన్ డిమాండ్ చేశారు.

**GREATER HYDERABAD MUNICIPAL CORPORATION**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

**NIT No.**17, **పని పేరు:** 4 పనుల కోసం జిహెచ్ఎంసి, ఆర్‌జెడ్, అత్తాపూర్ సర్కిల్-20 పరిధిలోని వివిధ ప్రాంతాలలో CC రోడ్డు నిర్మాణం, SWD RCC NP3 450 mm పైప్‌లైన్ పునర్నిర్మాణం, అలాగే RCC 600 mm డయా NP3 పైప్‌లైన్ ఏర్పాటు, 450 mm డయా NP3 పైప్‌లైన్ ఏర్పాటు, **అంచనా విలువ / ఇసివి:** రూ.63.55 లక్షలు, **డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ:** 24.08.2026 మ.2.30గం.లకు, **బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం:** 28.08.2026 మ.2.40గం.ల వరకు, **ఇఇ/ఎస్ఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అత్తాపూర్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9492067578, ఇ-మెయిల్ ఐడి: eec20.attapur@gmail.com.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అత్తాపూర్ సర్కిల్-20, జిహెచ్ఎంసి.**


DIPR R.O. No. : 8480-PP/CL/ADVT/2026-27, Date: 22-08-2026

# ఫోన్ ట్యాపింగ్ కేసులో.. 'వీడని' చిక్కుముడి!

- ఏళ్లు గడుస్తున్నా ముగియని దర్యాప్తు.. వరుసగా నోటీసులు.. విచారణలు
- వందలాది మంది వాంగ్మూలాలు నమోదు.. కీలక వ్యక్తుల చుట్టూ ఇంకా 'సిట్' దర్యాప్తు


**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. కేసు నమోదై ఏళ్లు గడుస్తున్నప్పటికీ దర్యాప్తు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉంది. తాజాగా కాంగ్రెస్ నాయకుడు మానవతారాయికి సిట్ నోటీసులు జారీ చేయడంతో మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. ఇప్పటికే ఈ కేసులో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖులను సిట్ విచారించింది. అయినప్పటికీ అసలు ట్యాపింగ్ వెనుక ఉన్న పూర్తి వ్యవస్థ, నిర్ణయాలు తీసుకున్నవారు, ఆదేశాలు ఇచ్చినవారు ఎవరు? అనే ప్రశ్నలకు తుది సమాధానం కోసం దర్యాప్తు కొనసాగుతోంది.

**2024లో మొదలైన కేసు.. ఇంకా కొనసాగుతున్న విచారణ**
హైదరాబాద్‌లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో 2024 మార్చిలో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైంది. అదే ఏడాది జూన్‌లో తొలి చార్జిషీట్ దాఖలైంది. అందులో అప్పటి ఎస్ఐబి మాజీ అధికారి టి.ప్రభాకర్‌రావు, డిఎస్‌పి ప్రణీత్‌రావు, అదనపు ఎస్‌పిలు భుజంగరావు, తిరుపతన్న, టాస్క్‌ఫోర్స్ మాజీ ఓఎస్‌డి రాధాకిషన్‌రావు, వ్యాపారవేత్త శ్రవణ్‌కుమార్‌లను నిందితులుగా పేర్కొన్నారు. కానీ తొలి చార్జిషీట్‌తో కేసు ముగిసిపోలేదు. దర్యాప్తు పరిధి క్రమంగా విస్తరించింది. రాజకీయ నాయకులు,



అధికారులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల వాంగ్మూలాలను సిట్ నమోదు చేస్తూ వచ్చింది. 2026 ఆగస్టు నాటికి 600 మందికి పైగా సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా తెలిసింది. కేసులో కీలక వ్యక్తులకు వరుసగా నోటీసులు జారీ కావడం ఇప్పుడు సాధారణ పరిణామంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌ను సైతం సిట్ విచారించింది. ఆయనను ప్రశ్నించిన సందర్భంగా ఫోన్ ఇంటర్‌సెప్షన్‌కు సంబంధించిన నిబంధనలు, అనుమతుల అంశాలపై ప్రధానంగా ప్రశ్నలు వచ్చినట్లు నివేదికలు పేర్కొన్నాయి. అదే సమయంలో పలువురు రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, అధికారుల నుంచి కూడా సిట్ వివరాలు సేకరించింది. 2026 లోనూ ఈ విచారణల పరంపర కొనసాగుతోంది. అంటే కేసు దర్యాప్తు కేవలం గతంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ ఘటనలను గుర్తించడానికే పరిమితం కాకుండా ఎవరి ఆదేశాలతో? ఏ వ్యవస్థ ద్వారా? ఎవరెవరి ఫోన్లు? ఏ ఉద్దేశంతో? అనే అంశాల చుట్టూ విస్తరిస్తున్నట్లు స్పష్టమవుతోంది.

**600కుపైగా సాక్షులు.. ఇంకా ఎవరెవరు?**
ఒక క్రిమినల్ కేసులో 600 మందికి పైగా సాక్షుల



వాంగ్మూలాలు నమోదు చేయడం దర్యాప్తు ఎంత విస్తృతంగా సాగుతోందో సూచిస్తోంది. అయితే ఇంతకాలం దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో మరో ప్రశ్న కూడా ముందుకొస్తోంది. ఇంత పెద్దస్థాయిలో దర్యాప్తు జరుగుతున్నప్పుడు అసలు తుది నివేదిక ఎప్పుడనేదే ఇప్పుడు రాజకీయ, న్యాయవర్గాల్లో ఆసక్తి కలిగిస్తున్నది. సిట్ ఇప్పటికే తొలి చార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ, మరిన్ని అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తోంది. అదనపు చార్జిషీట్ దాఖలు చేసే ప్రక్రియపై కూడా 2026 ఆగస్టులో పోలీసు వర్గాలు దృష్టి సారించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసు సాధారణ క్రిమినల్ కేసుల మాదిరిగా కాకుండా సాంకేతిక, రాజకీయ, పరిపాలనా అంశాలతో ముడిపడి ఉంది. ఫోన్ ఇంటర్‌సెప్షన్‌కు సంబంధించిన రికార్డులు, డిజిటల్ ఆధారాలు, కాల్ డేటా, అధికారిక అనుమతులు, అప్పటి అధికారుల పాత్ర, ట్యాపింగ్‌కు గురైన వ్యక్తుల వాంగ్మూలాలు వంటి అనేక అంశాలను పరస్పరం సరిపోల్చాల్సి ఉంటుంది. అందుకే దర్యాప్తు విస్తరించే కొద్దీ కొత్త వ్యక్తుల పేర్లు, కొత్త ఆధారాలు, కొత్త ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

**ట్యాపింగ్ వ్యవహారానికి ముగింపు ఎప్పుడు?**
రెండేళ్ల కాలం గడిచినా కేసులో కొత్త కొత్త పరిణామాలు వెలుగులోకి వస్తుండటం ఈ వ్యవహారం ఎంత సంక్లిష్టంగా మారిందో తెలియజేస్తోందని పోలీసువర్గాలు అంటున్నాయి. ''నోటీసులు జారీ అవుతున్నాయి. విచారణలు జరుగుతున్నాయి. వాంగ్మూలాలు నమోదవుతున్నాయి. చార్జిషీట్‌లు దాఖలవుతున్నాయి. మళ్లీ కొత్త పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఫోన్ ట్యాపింగ్‌కు అసలు బాధ్యులు ఎవరు? ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయి? మొత్తం వ్యవహారం వెనుక ఉన్న నిజం ఎప్పుడు బయటపడుతుంది?'' అని రాజకీయ, ప్రభుత్వ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

**ST.JOHN'S P.G. COLLEGE**
Chengicherla (V), Medipally(M), Medchal - Malkajgiri (Dist)
(Approved by AICTE, Affiliated to O.U) Ph: 9949490652, 9849139745

**CATEGORY "B" (NRI/ MANAGEMENT Quota) NOTIFICATION**
Non minority Institute
**MBA: 54 & MCA: 18 Seats**
Application Fee Rs. 500/- Contact between 10am and 4pm on or before **24th August 2026** Admissions are subject to ratification by TGCHE/OU Fee Reimbursement is not Applicable
Candidates to pay tuition Fee. Processing Fee.
Apply Online:
www.stjohnspgcollege.in *Contact : 9849139745, 9603216358*

**భీమ్‌గల్ పురపాలక మండలి కార్యాలయం, నిజామాబాద్ జిల్లా**

నెం. E1/August/ad/2026 — **కొటేషన్ నోటీసు** — తేదీ: 22.08.2026

ఏజెన్సీలు / కాంట్రాక్టర్ / అధీకృత డీలర్ లేదా ఉత్పత్తిదారుల నుండి ఈ క్రింద పేర్కొన్న పనులకు సీల్డ్ కవరులో కొటేషన్లకు ఆహ్వానించడమైనది.

**పని వివరాలు: 1) వీలర్ ఆటో టిప్పర్స్**
1250 కేజీల సామర్థ్యంతోపాటు హైడ్రాలిక్ లిఫ్ట్ ఉండాలి. జిపిఎస్, 70 హెచ్‌పి మరియు కనీసం 3-సిలిండర్ ఇంజన్, ఎల్ఎన్‌టి టెక్నాలజీ(నెం. యాడ్ బ్లూ) ఐదు సంవత్సరాలు/రెండు లక్షల కి.మీ ప్రయాణం చేయగల ఇంజను వారెంటీ మరియు గేర్ బాక్స్ వారంటీ ఉండాలి. 10x5, 6x3 స్పెయిన్‌లెస్ స్టీల్‌తో కూడిన బోడీ ఉండాలి. (అడుగున 3 ఎంఎం, పక్కవైపుల 2ఎంఎం మందం ఉండాలి) 70 శాతం డ్రై, 30 శాతం వెట్ పార్టిషన్స్‌తో 1400-1500 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగి ఉండాలి.అదేవిధంగా మైక్ సెట్ మరియు మున్సిపల్ బ్రాండ్ పెయింటింగ్ / లోగోతో పైభాగంలో రోలింగ్ కవర్ ఉండాలి. చెల్లుబాటయ్యే రిజిస్ట్రేషన్ మరియు బీమా తదితరాలు కూడా ఉండాలి.
**2)ట్రాలర్‌తో కూడిన ట్రాక్టర్:** i)ఇంజన్ 40 హెచ్‌పి, కనీసం 3 సిలిండర్, చల్లని నీరు, పేరుగాంచిన హెచ్‌పి కేటగిరీ బ్రాండ్ డీజీలు: 39-42 హెచ్‌పి సింక్రోమెష్ / స్థిరమైన మెష్ పిటిఓ: 540 ఆర్‌పిఎం, హైడ్రాలిక్స్: 1500-1800 కిలోల ఎఫ్ లిఫ్టింగ్ సామర్థ్యం, పవర్ స్టీరింగ్ ఫ్యూయల్ ట్యాంక్: 55-65 లిట్. సామర్థ్యంతో చెల్లుబాటయ్యే రిజిస్ట్రేషన్ మరియు బీమా తదితరాలు ఉండాలి. ట్రాలీ: 85-100 సిఎఫ్‌టి మరియు హైడ్రాలిక్ లిఫ్టింగ్ సింగిల్ యాక్సిల్,హెవీ డ్యూటీ ఎంఎస్ షీట్‌తో రెడ్ ఆక్సైడ్‌తో రెండుసార్లు కోటింగ్ వేసి ఉండాలి. దీంతోపాటు మున్సిపాలిటీ ఆమోదిత బ్రాండ్ కలర్‌ను మున్సిపల్ లోగోతోపాటు లెటరింగ్ ఇతర టూల్‌బాక్స్ రిఫ్లెక్టర్స్, నంబర్ ప్లేటు, ట్రాక్టర్, ట్రాక్టర్ ట్రాలర్‌పై ముద్రితమై ఉండాలి. ఐఎఆర్ఎ/ ఆర్‌టిఓ ఆమోదం ఉండాలి.
**3) నీటిని జిమ్మేందుకు వీలుగా ట్రాక్టర్ ట్రాలీ, ట్రాక్టర్:** 5000 లీటర్లు సామర్థ్యం+ 2% ట్యాంక్ సైడ్‌లో ఎంఎస్ షీట్ పెయింటింగ్: ఫుడ్‌గ్రేడ్ ఎపోక్సీ 2 కోటింగ్‌లు వేయాలి. వెలుపల: రెండు కోటింగ్‌లు రెడ్ ఆక్సైడ్ వేయాలి దాంతోపాటు మున్సిపాలిటీ ఆమోదిత బ్రాండ్ కలర్‌తో లోగో మరియు లెటరింగ్ డ్రైన్ వాల్వ్, నీటి పరిమాణాన్ని కొలిచే ఇండికేటర్, రిఫ్లెక్టర్, మడ్‌గార్డ్స్, నంబరు ప్లేటు తదితరాలు ఉండాలి.
**4) వినాయక చవితి, దసరా, బతుకమ్మ మరియు ఇతర పండుగలకు ఏర్పాట్లు**
విద్యుత్ దీపాలు, క్రేన్లు, శిక్షణ పొందిన గజఈతగాళ్ళు, బ్యారికేడింగ్, టెంటుల, కుర్చీలు, లెడ్‌ప్రొజెక్టర్, మైక్ సెట్, డ్రమ్స్, రావణదహన బొమ్మ, కలరింగ్, ఆకుపచ్చ చాపలు, సైడ్‌వాల్స్ మరియు ఇతరాలు.
**5) ట్రాక్టర్‌కు అనుసంధానించి ఉండే భూమిని తొలిచి గొయ్యిలు తీసే యంత్రం:**
చెట్లు నాటేందుకు అనువైన మరియు ఎలాంటి మొక్కలు నాటడానికైనా వీలుగా ఉండే గోతులు తవ్వడానికి అనువుగా ఉండాలి. భూమిలో అ త్యంత బలంగా రంధ్రాలుచేసి డ్రిల్లింగ్ చేసే యంత్రం.
**6) ట్రాక్టర్ సహాయంతో వీధులు ఊడ్చేందుకు వీలుగా ఉండే యంత్రం:** పురపాలక సంఘం, వీధులు, రోడ్లు శుభ్రం చేయడానికి పక్కవైపుల బ్రష్‌లు మరియు నీరు చిలికే సదుపాయం ఉండాలి.
**7) వన మహోత్సవం:** 6X8 సైజులో మొక్కల సంచులు, 8x10 మరియు 10x12 సైజులలో సంచులు కావాలి. ఇళ్ళకు పంపిణీ చేసేందుకు వీలుగా ఉండాలి. మరియు మొక్కలు నాటే కార్యకలాపాలు,వెదురు బొంగులు, మొక్కలను సంరక్షించేందుకు వీలుగా ఏర్పాటు చేసే ఇనుప జల్లెడలు తదితరాలు.
**8) ఇంటింటికీ పంపిణీ:** 10-15 లిట్ ఓపెన్ ఆకుపచ్చ,నీలం రంగు చెత్త బుట్టలు తడిసిన,ఎండిన చెత్త సేకరణకు.
**9) పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది:** సాధారణ చొక్కా మరియు ప్యాంట్, చీర, యూనిఫామ్ చొక్కాలు మరియు ప్యాంట్లు, రేడియం జాకెట్లు.
**10) నానావిధ అవసరాలు:** బ్లీచింగ్ మరియు లైమ్ పౌడర్, ట్రాక్టర్, జెసిబి, రోజువారీ వేతనంపై పనిచేసే ఆటో డ్రైవర్స్, రోజువారీ వేతనంపై పనిచేసే ఎలక్ట్రీషియన్, ఆన్‌లైన్‌లో ప్రతి టెండరు వేసేందుకు మరియు ఆన్‌లైన్ ఇ-టెండర్ల సేకరణ, చెట్లు కత్తిరించే యంత్రం, ట్రాక్టర్ టైర్లు, బ్యాటరీలు, లెడ్ డ్రైవర్స్, ఎలక్ట్రిక్ పోల్ బాక్సు, జాకెట్స్, నిచ్చెన, బూట్లు, ఎబి కేబుల్ మరియు ఇతర పనులు.

25.08.2026 వ తేదీ సాయంత్రం 4.00 గంటల సమయానికి కొటేషన్లను కార్యాలయానికి అందజేయాలి.

ఇతర సమాచారం కోసం మరియు మరిన్ని వివరాలకోసం 8519850388, 9133484671 ఫోన్ నంబర్లకు కార్యాలయం పని గంటలలో సంప్రదించాలి.

DIPR R.O. No. : 8487-PP/CL/ADVT/2026-27, Date: 22-08-2026 — సం/- కమిషనర్

# రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం* గౌరవెల్లి పూర్తి కాకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగను*183 గ్రామాల్లో 'పల్లె పల్లెకు ప్రజాపాలన' బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం



ప్రజాపక్షం/అక్కన్నపేట: తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని,రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలని రవాణా,బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.'పల్లె పల్లెకు పొన్నం అన్న..పల్లె పల్లెలో ప్రజాపాలన' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అక్కన్నపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులు,ప్రాజెక్టులు,అనుమతుల విషయంలో రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ అభివృద్ధి చెందితే దేశం కూడా అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు.ప్రధానమంత్రి చెబుతున్న వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలంటే ప్రతీ రాష్ట్రం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు.తెలంగాణను 'తెలంగాణ రైజింగ్2047' లక్ష్యంతో ముందుకు తీసుకెళ్ళేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ దేశ అభివృద్ధి విషయంలో కేంద్రంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని,తెలంగాణకు పెట్టుబడులు తీసుకు రావడం,అంతర్జాతీయ వేదికలపై రాష్ట్ర సామర్థ్యాన్నీ ప్రపంచానికి పరిచయం చేయడం,అన్ని వర్గాలను కలుపుకొని సమగ్ర అభివృద్ధి సాధించడం తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు.రాష్ట్ర ప్రయోజనాల కోసం పెట్టుబడులు తీసుకురావడానికి ముఖ్యమంత్రి విదేశాలకు వెళ్ళే హక్కు కూడా లేదా? రాష్ట్ర అభివృద్ధి కోసం చేపట్టే పర్యటనలకు అడ్డంకులు సృష్టించడం సమైఖ్య స్పూర్తికి విరుద్ధం అని వ్యాఖ్యానించారు.తెలంగాణకు రావాల్సిన మెట్రో రైలు,ఔటర్ రింగ్ రోడ్లు,ఇంటర్నల్ రేడియల్ రింగ్ రోడ్లు తదితర కీలక ప్రాజెక్టులతోపాటు మౌళిక వసతుల అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలని కోరారు.రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన ఆర్థిక సహకారం,నిధుల విషయంలో కూడా కేంద్రం సానుకూలంగా వ్యవహరించాలన్నారు. తెలంగాణకు రావల్సిన నిధులు,ప్రాజెక్టులు,మౌళిక వసతుల కోసం కేంద్రాన్నీ నిలదీయడంలో బిజెపి రాష్ట్ర నాయకుల ఐక్యత ఎందుకు కనిపించడం లేదని.. బిజెపి రాష్ట్ర నాయకత్వాన్నీ మంత్రి ప్రశ్నించారు.పక్క రాష్ట్రాలకు నిధులు కేటాయిస్తున్నప్పుడు తెలంగాణకు ఎందుకు నిధులు ఇవ్వడం లేదో కేంద్రం సమాధానం చెప్పాలని కోరారు. గౌరవెల్లి పూర్తి కాకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడగను గ్రామాల్లో మౌళిక వసతుల కల్పనతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజాపాలన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,త్వరలోనే హుస్నాబాద్ నియోజకవర్గ రైతాంగానికి సాగునీరందించే దిశగా గౌరవెల్లి రిజర్వాయర్ పనులను త్వరతగతిన పూర్తి చేసే బాధ్యత తనదేనని గడువులోగా పూర్తి చేయకపోతే వచ్చే ఎన్నికల్లో ప్రజలను ఓట్లు అడిగే ప్రసక్తే లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ తేల్చిచెప్పారు.శనివారం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలోని పెద్దతండా,మోత్కులపల్లి, కేశ్వాపూర్,గొల్లపల్లి,మల్లంపల్లి,చౌటపల్లి గ్రామాల్లో 'పల్లె పల్లెల్లో ప్రజాపాలన' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు పాలనాధికారి లక్ష్మి కిరణ్, ఆర్డీవో రామ్మూర్తి ,ఎంపిడిఒజయరాం,తహశీల్దార్ మధుసుధన్‌తో పాటు జిల్లా ,మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు,గ్రామస్థులు,మహిళా సంఘాల ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## మానకొండూర్‌లో పేలుడు పదార్థాల పట్టివేత



ప్రజాపక్షం /మానకొండూర్ : కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాలమేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో భారీగా పేలుడు పదార్థాలు పట్టుబడ్డాయి. టాస్క్‌ఫోర్స్ ఎసిపి సతీష్, ఎస్ఐమామిడాల సురేందర్ ఆధ్వర్యంలో మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన గొల్లెన అనిల్ ఇంటిపై దాడి నిర్వహించారు. ఈ సోదాల్లో అతని వద్ద 169 జిలెటిన్ స్టిక్స్, 15 డిటోనేటర్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాయి. ప్రాథమిక విచారణలో ఈ పేలుడు పదార్థాలను సంపంగి శ్రీనివాస్ అనే వ్యక్తి తనకు సరఫరా చేస్తున్నట్లు నిందితుడు అనిల్ అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను నిందితుడిని తదుపరి విచారణ నిమిత్తం మానకొండూర్ పోలీసులకు అప్పగించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ ఎసిపి సతీష్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ సురేందర్ సిబ్బంది శ్రీనివాస్, సురెందర్ పాల్ సింగ్, మల్లేశ్, వెంకట్, విశ్వతేజ పాల్గొన్నారు.

## సిఎం విదేశీ పర్యటనను అడ్డుకోవడం అమానుషం

ప్రజాపక్షం/మెట్‌పల్లి : తెలంగాణ విద్యా వ్యవస్థను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటనకు కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరించడం అమానుషమని కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధికార ప్రతినిధి, కౌన్సిలర్ బత్తుల నరేష్ అన్నారు.ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకుని తెలంగాణలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు సిఎం చేస్తున్న ప్రయత్నాలను కేంద్రం అడ్డుకోవడం సరికాదన్నారు.అమెరికాలోని ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలను సందర్శించేందుకు రాష్ట్ర అధికారుల బృందాన్ని పంపడం సిఎం విద్యారంగంపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. దళిత,బహుజన విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించడంతో పాటు హైదరాబాద్‌ను 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జెట్టి లక్ష్మణ్, మండల అధ్యక్షుడు జంగిటి రాజేందర్,వంగ వేణు,బుర్ర మహేందర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

## భారత్ గ్యాస్ గోదాం, వసతి గదుల ఇఒ ఆకస్మిక తనిఖీ




ప్రజాపక్షం/వేములవాడ : వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎల్. రమాదేవి ఆలయ పరిధిలోని టిటిడి ఎంక్వయిరీ (వసతి బుకింగ్) కార్యాలయం మరియు భారత్ గ్యాస్ గోదాంను ఆకస్మికంగా తనిఖీ చేశారు.టిటిడి ఎంక్వయిరీ కార్యాలయంలో వసతి బుకింగ్‌కు సంబంధించిన నగదు, రికార్డులు, రసీదులు, నిర్వహణ విధానాలను పరిశీలించారు. అనంతరం భారత్ గ్యాస్ గోదాంలో సిలిండర్ల నిల్వ, స్టాక్ రిజిస్టర్లు, పంపిణీ రికార్డులు, కార్యాలయ నిర్వహణను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఇఒ ఎల్. రమాదేవి మాట్లాడుతూ, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నగదు లావాదేవీల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, స్టాక్ రిజిస్టర్లు , కార్యాలయ రికార్డులను నిర్దేశిత విధానంలో నిర్వహించాలని ఆదేశించారు.భక్తులకు వసతి బుకింగ్ సేవలను వేగవంతంగా, మర్యాదపూర్వకంగా అందించాలని, ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ తనిఖీలలో పర్యవేక్షకులు అరుణ్, రాజేందర్, ప్రజాసంబంధాల అధికారి (పిఆర్ఒ) పెరుక శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ తిరుపతి తదితర ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ ముమ్మరం

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా జవాబుదారీతనంతో పోలీసు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్‌పితనిఖీల్లో భాగంగా గంబిరావుపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు,పెట్రోలింగ్ నిర్వహణ, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘా తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కేసుల విచారణలో త్వరగతిన దర్యాప్తు,సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాత దృక్పథం అవసరమని అన్నారు. పోలీస్ స్టేషన్లలో డేటా నమోదు, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత, నేరాల నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించేందుకుసిసిటిఎన్ఎస్‌లో అందుబాటులోకి వస్తున్న అధునాతన సాంకేతిక పద్ధతులను సిబ్బంది అందిపుచ్చుకోవాలని, తెలిపారు. దొంగతనాల నివారణ ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని దొంగతనం కేసుల ఛేదనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నేరస్తులను పట్టుకోవడంలో అవసరమైతే ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని కేసులను ఛేధించడంతో పాటు రికవరీ శాతం పెంచి బాధితులకు వారి సొత్తును తిరిగి అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్‌పి వెంట డిఎస్‌పి నాగేంద్రచారి, సి.ఐ వెంకటేష్, ఎస్.ఐ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

## ప్రధాన రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం



ప్రజాపక్షం/రామగుండం : రామగుండం పట్టణ మజీద్ టర్నింగ్ మూల మలుపు నుండి టెంపుల్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిపై నూతన మురుగు కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. అయితే పాతరోడ్డుకు, కాలువకు మధ్య రహదారిపై కొంత ఖాళీ స్థలం వదిలేయడంతో అది పెద్ద గొయ్యిలాగా ప్రమాదకరంగా మారింది. పైగా ఇక్కడ ఎలాంటి రక్షణ చర్యలు కూడ చేపట్టలేదు. రాత్రివేళ చీకట్లో వాహనదారులు గమనించకపోతే రోడ్డు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ఈ ఖాళీ స్థలంలో రోడ్డు, కాలువ నిర్మాణాలు పూర్తి చేసి తగిన రక్షణ చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు, వాహనదారులు కోరుతున్నట్లు స్థానిక నాయకుడు మాడిశెట్టి రవి తెలిపారు.

## మానసిక వికలాంగుల పాఠశాల
# మానవ సేవయే మాధవసేవ

ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య కేంద్రం డైరెక్టర్స్ డాక్టర్ హరీష్, జచిన్ విలియమ్స్



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మానసిక వికలాంగుల పాఠశాలలో ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల సహకారంతో నిర్వహించిన ఉచిత కంటి పరీక్ష కు విశేష స్పందన వచ్చిందని ట్రస్ట్ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు.శనివారం ఎల్‌ఎండి కాలనీలోని మానసిక వికలాంగుల పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య పరీక్షల శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డి తో కలిసి ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్య కేంద్రం పబ్లిక్ హెల్త్ స్పెషాలిటీ ఎ.ఎస్ ఔట్ డైరెక్టర్స్ డాక్టర్ హరీష్,జచిన్ విలియమ్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్స్ డాక్టర్ హరీష్, జచిన్ విలియమ్స్ మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ అనే సూక్తికి నిదర్శనం స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మానసిక వికలాంగుల పాఠశాల అని,గత సంవత్సరం కూడా నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని, ఆనాడు 500 మందికి పరీక్షలు నిర్వహించి 150 మందికి పైగా కంటి అద్దాలు,మందులు ఇవ్వడం జరిగిందని,50 మందికి కంటి ఆపరేషన్స్ చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం గొప్ప విషయమన్నారు.శనివారం నిర్వహించిన వైద్యశిబిరంలో పాఠశాల విద్యార్థులు ,అధ్యాపకులు , చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు 300 మందికి పైగా వైద్య శిబిరానికి వచ్చారని వారందరికీ కంటి పరీక్షలు చేశామని తెలిపారు. ట్రస్ట్ చైర్మన్ చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎల్వీ ప్రసాద్ కంటి హాస్పిటల్ సహకారంతో మానసిక పాఠశాల విద్యార్థులకు,స్టాఫ్‌కు ,పేద ప్రజలకు ఈ కంటి వైద్య పరీక్షలు చేయడంతో పాటు తిమ్మాపూర్ మండల ప్రైమరీ హెల్త్ సెంటర్ వారు బి. పి.షుగర్ ఇతర వైద్య సేవలు అందించారని శిబిరాన్ని ఉపయోగించుకోవడం మూలంగా ప్రైవేట్ హాస్పిటల్స్ వెళ్ళే బాధ తప్పిందని పేదలకు ఉపయోగ పడే మంచి కార్యక్రమాలకు సహకరిస్తున్న ఎల్‌వి ప్రసాద్ వైద్య శాల వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెంకటరెడ్డి తెలిపారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి షర్మిల, ట్రస్ట్ సభ్యులు కొమురెల్లా రెడ్డి, జె.వి.రమణా రెడ్డి,అశోక్ ముఖర్జీ,తేరాల సత్యనారాయణ,మహాత్మా నగర్ సర్పంచ్ సంపత్,పాఠశాల అడ్మినిస్ట్రేటర్ ఈ. బాల్ రాజ్, ప్రిన్సిపాల్ నాంపల్లి సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనాన్ని అదనపు కలెక్టర్ తనిఖీ



ప్రజాపక్షం/కథలాపూర్ : జగిత్యాల జిల్లా కథలాపూర్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్ శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, పరిశుభ్రత,మెనూ అమలు తదితర అంశాలను పరిశీలించారు.అనంతరం మోడల్ స్కూల్ హాస్టల్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న వసతులు, భోజనం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపిడిఒనరేందర్,మండల విద్యాధికారి లోకిని శ్రీనివాస్,మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

## గ్రామాల వారీగా తాగు నీటి సమస్యల పరిష్కారం

కలెక్టర్ కోయ శ్రీహర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి : జిల్లాలో త్రాగునీటి సరఫరాకు సంబంధించి గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శనివారం ఐడిఓసిలో తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీటి సమస్యలు,అవసరమైన పైప్‌లైన్లు, అదనపు ఓహెచ్ఎస్ఆర్‌ల అవసరం,కొత్త తాగునీటి కనెక్షన్ల వివరాలను గ్రామాల వారీగా వెంటనే గుర్తించి సమగ్ర వివరాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.అందుబాటులో ఉన్న గ్రామ పంచాయతీ నిధులను వినియోగించి అత్యవసరమైన చిన్నతరహా తాగునీటి పనులను చేపట్టాలని సూచించారు.ఆయా పనులను ఎంపిడిఒలు గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో వెంటనే చేపట్టి పూర్తి చేయాలని ఆదేశించారు.గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి)లో ప్రతిపాదించిన త్రాగునీటి పనులకు ప్రభుత్వ స్థాయిలో మంజూర్లు వచ్చేలా జెడ్‌పిసిఇఒ నిరంతరం ఫాలోఅప్ చేయాలని సూచించారు. ప్రతిపాదిత పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన అనుమతులు, మంజూర్లు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని, సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.గ్రామాల్లో త్రాగునీటి అవసరాలను ముందుగానే గుర్తించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో జెడ్‌పిసిఇఒ నరేందర్,మిషన్ భగీరథ ఇంట్రా ఇఇ గంగాధర్ శ్రీనివాస్, అదనపు డిఆర్‌డిఎ అధికారి రవీందర్, సంబంధిత ఎంపిడిఒలు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సంజయ్ వినతి

రెవెన్యూ, హౌసింగ్ శాఖల సమీక్షలో పలు అంశాలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే

ప్రజాపక్షం/మెట్‌పల్లి : కోరుట్ల నియోజకవర్గానికి సంబంధించి న రెవెన్యూ, గృహ నిర్మాణ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రభుత్వాన్ని కోరారు.జగిత్యాల కలెక్టరేట్‌లో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సమక్షంలో ఎమ్మెల్యే సంజయ్ నియోజకవర్గంలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు.మల్లాపూర్ మండలంలోని సర్వే నంబర్ 1040కు సంబంధించిన సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి పూర్తిస్థాయి నివేదిక అందించాలని కోరారు.అలాగే మల్లాపూర్ మండలంలోని సంగెం, శ్రీరాంపూర్, కుస్తాపూర్, రత్నాపూర్, నడికూడ రిహాబిలిటేషన్ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సర్వేలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిబంధనల్లో సవరణ చేయాలి :** ఇటీవల జారీ చేసిన జిఒలో అవసరమైన సవరణలు చేసి, 750 గజాలకు పై గా స్థలంలో స్లాబ్ వేసిన కొంతమంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిబంధనల మేరకు మినహాయింపు, వెసులుబాటు కల్పించాలని ఎమ్మెల్యే కోరారు.గతంలో గృహ లక్ష్మి పథకం కింద ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, చెల్లింపులను త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

**జర్నలిస్టుల ఇళ్ల కేటాయింపును త్వరగా పూర్తి చేయాలి:** జర్నలిస్టులకు ఇళ్ల కేటాయింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎమ్మెల్సీ రమణ,ఎమ్మెల్యే సత్యం,పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ,ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు,డిప్యూటీకలెక్టర్లు,ఆర్‌డిఒలు,తహసీల్దార్లు, రెవెన్యూ,హౌసింగ్‌శాఖలఅధికారులుపాల్గొన్నారు.

## సాంకేతిక విద్యను నిర్వీర్యం చేసే ఆలోచన మానుకోవాలి

ఎఐఎస్ఎఫ్ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్



ప్రజాపక్షం/కరీంనగర్: సాంకేతిక విద్యాను నిర్వీర్యం చేసే నిర్ణయాలను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహిళ పాలిటెక్నిక్ కళాశాల ముందు ఆందోళన నిర్వహించి ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా మచ్చ రమేష్ మాట్లాడుతూ..పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జిఒ నం.97ను రద్దు చేయడంతో పాటు, విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.సాంకేతిక విద్యను బలోపేతం చేసి, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు.ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యార్థులు ఈసెట్ ప్రవేశ పరీక్ష రాసే అర్హత కోల్పోయి, కార్పొరేట్ కంపెనీల్లో తక్కువ వేతనాలకే పనిచేసే పరిస్థితులు దాపురిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. డిప్లొమా విద్యార్థులకు ఎంతో కాలంగా అమల్లో ఉన్న లాటరల్ ఎంట్రీ విధానాన్ని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. 1957 నుంచి ఎంతో మంది సాంకేతిక నిపుణులను తీర్చిదిద్దిన పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను కాపాడుకునేందుకు పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నునావత్ శ్రీనివాస్ నాయక్, నగర సహాయ కార్యదర్శి కసిరెడ్డి సందీప్ రెడ్డి, నగర్ ఉపాధ్యక్షుడు బోయిని విష్ణువర్ధన్, రాహుల్ ,శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు మంచి ఆదాయం

మాజీ మంత్రులు హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్ధిపేట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అనతి కాలం లోనే 60వెల మెట్రిక్ టన్నుల క్రషింగ్ చేసి అద్భుతమైన విజయం సాధించిందని, రైతు లకు మంచి ఫలితాలు రావడం ఎంతో సంతోషం గా ఉందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు , బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిలు అన్నారు.. శనివారం రోజు సిద్దిపేట నియోజకవర్గం నర్మేట గ్రామం లోని ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ను వారు సందర్శించారు.. కాళేశ్వరం జలాలు ఈ ప్రాంతం లో రావడం ఆయిల్ పామ్ సాగుకి నాంది పలికిందన్నారు. అదేవిధంగా ఈ ఫ్యాక్టరీ అనతి కాలం లోనె 60మెట్రిక్ టన్నుల క్రషింగ్ కావడం రైతులకు ఆదాయం రావడం ఎంతో అద్భుతమైన విజయం అని వారు అన్నారు.. ఆయిల్ పామ్ సాగు తో రైతు లకు మంచి ఆదాయం వస్తుందని, రైతులు అయిల్ ఫామ్ సాగు చేయాలాని చెప్పారు.నర్సరీ లో మొక్కలు కూడ అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.. ఇదే ఫ్యాక్టరీ లో రిఫనరి కూడ ఏర్పాటు చేయనునట్లు చెప్పారు రిఫనరి పనులు వెంటనే ప్రారంభించాలని ఆయిల్ ఫెడ్ అధికారులను ఆదేశించారు.

**జివో 97ను రద్దు చేయాలి..**పాలిటెక్నిక్ వ్యవస్థను నిర్వీర్యం చేయద్దు మాజీ మంత్రి హరీష్‌రావు. తాను కూడ ఒక పాలిటెక్నిక్ విద్యార్థినే, ఆ చదువుల ప్రాముఖ్యత, విద్యార్థుల కష్టాలు నాకు బాగా తెలుసునని, పాలిటెక్నిక్ కళాశాలలను ఐఐటిలో కలపవద్దని, సాంకేతిక విద్యాశాఖలో యదాతథంగా కొనసాగించాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు.శనివారం సిద్దిపేట జిల్లా రాజగోపాల్‌పేట విద్యార్థులు సిద్దిపేటహన్మకొండ రోడ్డుపై ధర్నా చేపట్టారు. విద్యార్థులకు ధర్నాకు మాజీ మంత్రి హరీష్‌రావు సంఘీభావం ప్రకటించారు.

## కరీంనగర్ కార్పొరేషన్‌పై 'జెన్–జీ వాచ్‌డాగ్' నిఘా!

22ఏ భూముల సమస్యకు త్వరలో పరిష్కారం.. కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో అవినీతికి అడ్డుకట్ట వేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన పాలన అందించేందుకు కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నారు. నగరంలో తొలిసారిగా యువతను భాగస్వామ్యం చేస్తూ 'జెన్–జీ విజిలెన్స్ వాచ్‌డాగ్ కమిటీ'ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కరీంనగర్ మైత్రి హోటల్‌లో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర్సన్న, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజేందర్‌రావు ఈ కీలక ప్రకటన చేశారు. నగరపాలక సంస్థలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంజనీరింగ్ పనులు, టౌన్ ప్లానింగ్ వ్యవహారాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండేలా 40 నుంచి 50 మందితో ప్రత్యేక విజిలెన్స్ వాచ్‌డాగ్ కమిటీని ఏర్పాటు చేస్తామని రాజేందర్‌రావు తెలిపారు. ఈ కమిటీలో యువ లాయర్లు, ఆర్టీఐ కార్యకర్తలు, ఐటీ ప్రొఫెషనల్స్‌తో పాటు ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న యువతను ఎంపిక చేస్తామని చెప్పారు. అవినీతిని చూస్తూ ఊరుకునే పరిస్థితి ఇక ఉండదని, ప్రజల డబ్బుతో చేపట్టే ప్రతి అభివృద్ధి పనికి లెక్క ఉండాలని, ప్రతి పనిపై ప్రజలకు సమాచారం అందుబాటులో ఉం డాలని రాజేందర్‌రావు స్పష్టం చేశారు. నగరంలో పెద్ద పెద్ద కాంప్లెక్సులు, వాణిజ్య భవనాలు, ఇతర నిర్మాణాలకు సంబంధించిన అనుమతులపై కూడా వాచ్‌డాగ్ కమిటీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని రాజేందర్ రావు తెలిపారు. సాంక్షన్డ్ ప్లాన్, నిర్మాణం జరిగిన తీరు, అనుమతులకు విరుద్ధంగా డివియేషన్లు ఉన్నాయా? తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామని చెప్పారు. ఇటీవల నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎసిబిఅధికారులు తనిఖీలు నిర్వహించిన విషయాన్ని ప్రస్తావిస్తూ రాజేందర్ రావు స్పందించారు. టౌన్ ప్లానింగ్ విభాగం వద్దకు ఎసిబి అధికారులు వచ్చే పరిస్థితి ఏర్పడిందంటే.. అక్కడ సమస్య ఎంత తీవ్రమైనదో ప్రజలు అర్థం చేసుకోవాలి. వాచ్‌డాగ్ కమిటీ సభ్యుల సంప్రదింపు నంబర్లను నగరంలోని ప్రధాన చౌరస్తాల్లో హోర్డింగుల ద్వారా ప్రదర్శిస్తామని చెప్పారు. నగరపాలక సంస్థలో గత బిఆర్ఎస్ పాలకుల కంటే ప్రస్తుతం బిజెపి పాలకుల హయాంలో అవినీతి వ్యవహారాలు మరింత పెరిగినట్లు తమకు సమాచారం వస్తోందని రాజేందర్‌రావు ఆరోపించారు.

**22ఏ భూముల సమస్యపై ప్రభుత్వ చిత్తశుద్ధి**

కరీంనగర్‌లో 22ఏ నిషేధిత భూముల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాజేందర్ రావు తెలిపారు. రేకుర్తి, విద్యానగర్, కొత్తపల్లి ప్రాంతాలకు సంబంధించి దాదాపు 140 సర్వే నంబర్లలో సుమారు వెయ్యి ఎకరాల వరకు భూములు 22ఏ నిషేధిత జాబితాలోకి వెళ్లినట్లు బాధితులు తన దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు గుమ్మడి రాజకుమార్, భాస్కర్ నాయక్, ఆకుల నందిని ఉదయ్, విక్రమ్ సికిందర్, కళ్లేపల్లి శారద బాలరాజు, గంట శ్రీనివాస్, సర్పంచులు కమలాకర్ గౌడ్, తిరుపతిరెడ్డి బోగొండ ఐలయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మీసాల శంకర్,జగ్గానీ కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## వేగవంతంగా 'సర్' ప్రక్రియ

అదనపు కలెక్టర్ రాములు



**ప్రజాపక్షం / నస్పూర్ :** జిల్లాలో చేపట్టిన ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియతో పాటు రెవెన్యూ సంబంధిత పెండింగ్ పనులను నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మంచిర్యాల, నస్పూర్ మండలాల తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తించిన అనామోలీస్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి నిర్ణీత వ్యవధిలో ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ధ్రువపత్రాల దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, క్షేత్రస్థాయి విచారణ అనంతరం సకాలంలో జారీ చేయాలని సూచించారు. సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రికార్డుల ఆధారంగా పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌ను బలోపేతం

డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ



**ప్రజాపక్షం/రెబ్బెన :** కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత పటిష్ఠం చేసి, ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ పిలుపునిచ్చారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్‌లో భాగంగా రెబ్బెన మండల కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక కోసం శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు కిషన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండల కమిటీ ఎన్నికకు సంబంధించి నాయకులు, కార్యకర్తల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పార్టీ నిబంధనల ప్రకారం నూతన కమిటీని ఎన్నుకుంటామని, నాయకులు సమన్వయంతో ఐక్యంగా పనిచేసి సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాలని సూచించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె ప్రకాష్ రావు, జిల్లా అధికార ప్రతినిధి దుర్గం రవీందర్, జిల్లా కార్యదర్శి చిరంజీవి గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు చెన్న సోమశేఖర్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కోఆర్డినేటర్ ఏలగల సాయికుమార్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సుధాకర్ రెడ్డి ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి

సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి పిలుపు



**ప్రజా పక్షం/బెల్లంపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు అమరజీవి సురవరం సుధాకర్ రెడ్డి చూపిన మార్గంలో పయనిస్తూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి అని సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అన్నారు. సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా బెల్లంపల్లి పార్టీ కార్యాలయంలో పట్టణ సమితి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడిగా, జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారని గుర్తుచేశారు. నల్గొండ నుంచి రెండుసార్లు ఎంపిగా ఎన్నికై పార్లమెంటులో ప్రజా సమస్యలపై గళం విప్పారని తెలిపారు. 2012 నుంచి 2019 వరకు పార్టీ జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించి పార్టీని అన్ని రంగాల్లో విస్తరింపజేశారని పేర్కొన్నారు. కమ్యూనిస్టులుగా ప్రతి ఒక్కరూ ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బికెఎంయు జాతీయ సమితి సభ్యుడు అక్కపెల్లి బాబు, జిల్లా సమితి సభ్యుడు మేకల రాజేశం, నాయకులు రాధాకృష్ణ, అందుగుల రాజేందర్, బూర్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటిని కలిసిన సిపి

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ, సమాచార పౌర సంబంధాల శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని శనివారం కృష్ణ హోటల్‌లో మర్యాదపూర్వకంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య కలిసి వరికి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు

**ప్రజాపక్షం / వాంకిడి :** ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా బూత్ స్థాయి ఏజెంట్లు (బిఎల్ఏలు) సహకరించాలని కాంగ్రెస్ పార్టీ వాంకిడి మండల అధ్యక్షుడు గుర్నూలే మేంగాజి కోరారు. శనివారం కోమటిగూడ గ్రామంలో ఓటర్లకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించారు.అన్ని బూత్‌ల పరిధిలో మ్యాపింగ్ కాని ఓటర్ల ఫారాలు తిరిగి వచ్చిన నేపథ్యంలో, సంబంధిత వ్యక్తులు తమ నివాస ధ్రువీకరణ పత్రం లేదా స్టడీ సర్టిఫికెట్‌ను బిఎల్ఓలకు సకాలంలో అందజేయాలని సూచించారు. సర్ ప్రక్రియపై ఓటర్లకు పూర్తి అవగాహన కల్పిస్తూ, బిఎల్ఓలు, బిఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తగిన పరిష్కారం చూపేలా అవసరమైన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## నూతన జూనియర్ సివిల్ కోర్టు ప్రారంభం

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** బెల్లంపల్లి పట్టణంలోని కన్నాల జాతీయ రహదారి సమీపంలో రూ.5.60 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన జూనియర్ సివిల్ కోర్టు భవనాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి నగేష్ భీమపాక శనివారం ప్రారంభించారు. కోర్టు ప్రాంగణానికి చేరుకున్న ఆయనకు న్యాయమూర్తి శాంతి సోనీ, న్యాయవాదులు ఘన స్వాగతం పలికారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, గుస్సాడి గిరిజన కళాకారుల నృత్యాల నడుమ స్వాగత కార్యక్రమం నిర్వహించారు. నూతన భవనాన్ని ప్రారంభించిన అనంతరం న్యాయమూర్తి నగేష్ భీమపాక కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి వీరయ్య, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ఎసిపి కిరణ్‌కుమార్, జిల్లాలోని న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# బహుళ భావాల ప్రతిబింబం ఛాయా చిత్రం

కలెక్టర్ ప్రతీక్‌జైన్




**ప్రజాపక్షం /సంగారెడ్డి :** ఫోటో గ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టర్ గ్రివెన్స్ హాల్లో ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్స వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫోటో గ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అతిథిలు ఫోటో జర్నలిస్టులందరికి ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జైన్ మాట్లాడుతూ తనకు ఫోటో గ్రఫీ అంటే ఎంతో ఇష్టమని తెలిపారు. నేటి కాలంలో వార్తా పత్రికల్లో ఫోటోకు ఎంతో ప్రాధాన్యత ఉందని ఒక వార్తను చదివే ముందు చాలా మంది ముందుగా ఫోటో ను చూసే ఆ వార్త ప్రాదాన్యత ను అంచనా వేస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. అనేక భావాలు ,విషయాలను ఒక్క ఛాయాచిత్రం ద్వారా తెలియజేయవచ్చని తెలిపారు. ఫోటో గ్రఫీ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిందని ప్రతి ఒక్కరు. తమకు నచ్చిన విధంగా ఫోటోలు తీసుకునే అవకాశం ఉందన్నారు.సమాజం పట్ల భాధ్యతతోవ్యవహరిస్తూ ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని ఛాయచిత్రాల ద్వారా అందించాలని కోరారు. జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ మాట్లాడుతూ ఫోటో జర్నలిస్టులు ఏర్పాటు చేసిన పోటో ఎగ్జిబిషన్‌లోని ఫోటోలను చూస్తుంటే గతంలో జరిగిన అనేక సంఘటనలు కళ్ల ముందు ఫ్లాప్ ట్యాక్ కీలా కనిపించాయని అన్నారు. వివిధ అంశాలకు సంబందించిన ఫోటోలు ప్రదర్శనలో ఉన్నాయని వెయ్యి పదాలు చెప్పలేని విషయాన్ని ఒక్క పోటో ఎంతో సులభంగా అర్థమయ్యేలా చెబుతుందని పేర్కొన్నారు. డిసీసీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ ఒక ఫోటో ను చూడగానే దానికి సంబందించిన జ్ఞాపకాలు మనసులు మెదులుతాయని అన్నా రు. చరిత్రలో నిలిచేపోయే విధంగా ఎన్నో ఛాయచిత్రాలను ఎండనక ,వాననక ,నిరంతరం వృత్తి పట్ల అంకితభావంతో ఫోటో జర్నలిస్టులు చిత్రికరిస్తున్నారని సమాజ సేవలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూనవనిత మాట్లాడుతూ మాటలకు అందని భావాలను అద్భుతమైన క్షణాలను ఒక్క ఫోటో ద్వారా తెలియజేయవచ్చని అన్నారు. టీయూడబ్ల్యూ జే రాష్ట్ర ప్రతినిధి ఎంఏకె పైసల్ మాట్లాడుతూ ఫోటో జర్నలిజం రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. కొత్త సవాళ్లను ఎదుర్కొంటే ఫోటో జర్నలిస్టులు తమ వృత్తి నైపుణాలను మరింత మెరుగుపరుచుకుని ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అడిషనల కలెక్టర్ పాండు ,కౌన్సిలర జగన్, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు జావిద్ అలి టీజీఓ జిల్లా అధ్యక్షుడు వైద్యనాథ్, జిల్లా ఫోటో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు మొహమ్మద్ ఆరీప కార్యదర్శి, సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్, మురళీ పోటో జర్నలిస్టులు ,పవన్, పాఠశాల విద్యార్థులు ,ఉపాద్యాయులు,జర్నిస్టులు పాల్గొన్నారు.

## తహసీల్దార్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల శంకుస్థాపనలు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లాలోని వివిధ మండలాలకు మంజూరైన నూతన తహసీల్దార్ కార్యాలయాల భవనాలతో పాటు నిజామాబాద్ రూరల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణాలకు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు భూమిపూ జ చేశారు. అదేవిధంగా గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, సూర్యనారాయయణ, లోకేష్‌కుమార్, రాజీవ్‌గాంధీ హన్మంతు, గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి పోరాటం

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** కరీంనగర్‌లో సెప్టెంబర్ 6 నుంచి 8 వరకు జరిగే ఎఐటియుసి నాలుగో రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ పిలుపునిచ్చారు. శనివారం ఆసిఫాబాద్ ఆర్‌టిసి డిపోలో కార్మికులతో కలిసి మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, పాత 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఇఎస్ఐ, గ్రాట్యుటీ సీలింగ్ ఎత్తివేయాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని స్పష్టం చేశారు. ఈ మహాసభలకు జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ హాజరవుతారని, జిల్లా కార్మికులు భారీగా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు నరేష్, ఆర్‌పి సింగ్, నారాయణ, షఫీ, హైమద్, శేఖర్ పాల్గొన్నారు.

# 'సురవరం' జీవితం ఓ రాజకీయ పాఠం

సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొయిరే ప్రకాష్



**ప్రజాపక్షం/వాంకిడి :** ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడు, మాజీ సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి జీవితం నేటి తరానికి ఒక గొప్ప రాజకీయ పాఠమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొయిరే ప్రకాష్ అన్నారు. వాంకిడి మండల కేంద్రంలో శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో సురవరం తొలి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్మికులు, కర్షకులు, పేద ప్రజల హక్కుల కోసం సురవరం చేసిన పోరాటాలు చిరస్మరణీయమన్నారు. యువతకు రాజకీయ భాగస్వామ్యం కల్పించేందుకు ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు తగ్గించాలనే ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. దేశంలో లౌకికవాదాన్ని పరిరక్షించేందుకు, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడేందుకు నిరంతరం కృషి చేశారని తెలిపారు. సురవరం ఆశయ సాధనకు కట్టుబడి ప్రజా సమస్యలపై పోరాటాలను ఉధృతం చేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. సిపిఐ వాంకిడి మండల కార్యదర్శి కొదురుపాక మహేష్, నాయకులు వర్కోల్ రాకేష్, వినోద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందొద్దు

● జిల్లాలో 3340 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటు ● మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో ప్రస్తుతం 3340 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన మేరకు మాత్రమే ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. గత ఖరీఫ్ ఆగస్టు వరకు 20,758 మెట్రిక్ జన్నుల యూరియాను రైతులకు సరఫరా చేయగా, ప్రస్తుత ఖరీఫ్ ఆగస్టు వరకు ఇప్పటివరకు 19,045 మెట్రిక్ టన్నుల యూరియాను అందించినట్లు కలెక్టర్ వివరించారు.రోజువారీగా 1,000 నుంచి 1,500 బ్యాగుల వరకు ఎ రువులు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు.ప్రవేశపెట్టిన ఎఫ్ఎస్ఎస్ యాఫ్ ప్రారంభ దశలో ఏర్పడిన సాంకేతిక సమస్యలను పరిష్కరించే కొనసాగుతున్నాయని చెప్పారు.అనుగుణంగా యాఫ్‌ను మా రుస్తున్నట్లు తెలిపారు. అందుబాటులో ఉన్న ఎరువుల కంటే ఎక్కువగా రైతులు బుకింగ్ చే యడం వల్లే సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. అవసరాలకు మించి ఎరువులు కొనుగోలు చేయకుండా, వ్యవసాయ శాఖ సూచనలు పాటించి యాఫ్ ద్వారా ఎరువులు పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## కలెక్టరేట్ ఎదుట ఉద్రిక్తత

మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** 22 ఎ భూముల వ్యవహారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి డిమాండ్ చేశారు. రాత్రికి రాత్రే సక్రమమైన అనుమతులున్న భూములు 22 ఎలోకి వెళ్లటంతో సాధారణ ప్రజలు బ్యాంకు లోన్లు తీసుకునే వెసులుబాటు కోల్పోయారన్నారు. దీనికి మంత్రి పొంగులేటి బాధ్యత వహించాలన్నారు. కలెక్టరేట్ దాటనివ్వబోమని భీష్మించారు. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు కలిసి కలెక్టరేట్‌లోని సమావేశంలో హాల్‌లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. మెమోరాండం సమర్పించేందుకు వెళ్లిన బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ పటేల్ కులాచారి నేతృత్వంలోని నాయకుల బృందాన్ని పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేసి మాక్లూర్ పిఎస్‌కు తరలించారు.

## కొండాపూర్‌లో బిఎల్ఒకు ఘనసన్మానం



**ప్రజాపక్షం /కొండాపూర్ :** కొండాపూర్ మండలంలోని 46 పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా గణన పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినందుకు బి.ఎల్.ఓ సూపర్వైజ ర్లు మండల కేంద్రంలో శనివారం ఘనంగా సన్మానించారు. డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయడంలో బి.ఎల్.ఓలు బిఎల్ఏలు ఎంతోకృషి చేశారని అధికారులు అభినందించారు. కొండాపూర్ తహసీల్దార్ అశోక్ ఎంపిడిఓ సౌమ్య శ్రీడిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికల విభాగం) విశ్వేశ్వరతో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై మైనింగ్ అధికారుల కొరడా

రెండు ట్రాక్టర్లు జెసిబి సీజ్



**ప్రజాపక్షం / చెన్నూరు:** అధికార పార్టీ ముసుగులో అక్రమ ఇసుక దందాకు పాల్పడుతున్న వారిపై మైనింగ్ అధికారులు కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుపుతున్న వాహనాలను పట్టుకుని సీజ్ చేశారు. శనివారం కత్తరశాల వాగు నుంచి గ్రామ సర్పంచ్ భర్త జేసీబీ, ట్రాక్టర్లతో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నారన్న సమాచారంతో మైనింగ్ అధికారులు ఆకస్మిక దాడి చేశారు. ఘటనా స్థలంలో ఒక జేసీబీ, రెండు ఇసుక ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు. తవ్వకాలను అడ్డుకున్న సమయంలో అధికారులతో సర్పంచ్ భర్త స్వల్ప వాగ్వాదానికి దిగగా, పోలీసుల సహకారంతో వాహనాలను చెన్నూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్రమార్కులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కత్తరశాల సర్పంచ్ భర్త అక్రమ ఇసుక దందాపై స్థానిక మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మైనింగ్ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

## నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో లో వోల్టేజి కారణంగా రైతులు వేసిన పంటలు పూర్తిగా ఎండిపోయే దశకు చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ నీరుడు తుల్చమ్మ బిక్షపతి స్థానిక ఎమ్మెల్యే సునీత రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే సునీత రెడ్డి నూతనంగా మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు విద్యుత్ అధికారులు అచ్చంపేట గ్రామానికి నూతనంగా విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేశారు. దీంతో సాగు, త్రాగునీరు అందించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. సందర్భంగా నూతన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే సునీత రెడ్డికి, విద్యుత్తు అధికారులకు సర్పంచ్ నిరుడు తుల్చమ్మ బిక్షపతి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఆంజనేయులు, కృష్ణ, భూమయ్య, రాజు, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# భద్రతను విస్మరించి ఉత్పత్తి సాధించలేరు


ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :** ఆర్కేన్యూటెక్ గనిలో కార్మికుల భద్రత, కనీస సౌకర్యాలను పక్కనపెట్టి ఉత్పత్తి లక్ష్యాల కోసం ఒత్తిడి చేయడం సరికాదని ఎఐటియుసి డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య మండిపడ్డారు. శనివారం యూనియన్ నాయకులు గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. 17వ ప్యానెల్‌లో సరైన గాలి ప్రసరణ లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రాణాధారమైన తాగునీరు కూడా అందించకపోవడం శోచనీయమన్నారు. డ్రిల్ బిట్లు, రూఫ్ బోల్టులు, సేఫ్టీ షూస్, హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలను సకాలంలో ఇవ్వడం లేదని, కొత్త కీలకలు ఉన్నా పాతవే వాడాలని చెప్పడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. కంపెనీ వనరులను కాంట్రాక్టర్లకు కేటాయిస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరపాలని, సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు ఎస్కే బాజీ సైదా, కొట్టే కిషన్ రావు, మోత్కూరి కొమురయ్య, సంపత్, ఆకుల లక్ష్మణ్, సందీప్ కుమార్ పాల్గొన్నారు.

# జిఓ 22ఎ భూముల జాబితాపై సమగ్ర విచారణ జరపాలి

బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ముదిరాజ్



**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** జిల్లాలో జిఓ 22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన తప్పిదాలు, అక్రమ చేర్పులు,అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి మల్లేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించినట్లు వారు తెలిపారు.అలాగే శనివారం నత్తి మల్లేష్ ముదిరాజ్ స్థానిక బిజెపి నాయకులతో కలిసి తూప్రాన్ ఆర్‌డిఓకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22ఏ జాబితాలో చేర్చిన,తొలగించిన భూముల వివరాలను గ్రామం ,మండ లం,సర్వే నంబర్ వారీగా ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. ధరణి భూభారతి డిజిటల్ రికార్డులపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించి, తప్పుగా నిషేధిత జాబితాలో చేరిన భూ ములను గుర్తించి రైతులకు,యజమానులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్రమాలకు బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన, అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, మొ త్తం వ్యవహారంపై స్వతంత్ర న్యాయ విచారణ లేదా సిబిఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తూప్రాన్ పట్టణ బిజెపి అధ్యక్షుడు జానకిరామ్, మండల అధ్యక్షుడు పోచయ్య ము దిరాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి సంపత్ గౌడ్, రాజు, మనోహరాబాద్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ ముదిరాజ్ పాల్గొన్నారు.


## రిమాండ్ ఖైదీ ఆత్మహత్యా యత్నం

**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** పోలీసు భద్రతలో ఉన్న రిమాండ్ ఖైదీ ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డ ఘటన నిజామాబాధ్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే బిక్కనూరు పోలీసు స్టేషన్‌లో ఇసుక కేసులో పిడిపిపి యాక్ట్ కింద అరెస్టు అయిన లకావత్ రాజు అనే వ్యక్తి ఈనెల 18న సారంగాపూర్ సెంట్రల్ జైలుకు రావడం జరిగిందని, గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉన్న ఖైదీని శనివారం మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందని, ఈ పరిస్థితులలో ఖైదీ బాగా రికవరి అవుతున్న సందర్భంలో మూడో ఫ్లోర్‌లో ఉన్నటువంటి డాక్టర్లకు చూపించాలన్న కారణం చేత పోలీసుల ఎస్కార్ట్ మధ్య లకావత్ రాజును ప్రభుత్వ ఆసుపత్రి మూడో ఫ్లోర్‌కు చేరిన వీరి నుండి అనూహ్యంగా తప్పించుకుని జిజిహెచ్ మూడో అంతస్తు నుండి కిందికి దూకడం జరిగిందని, దీంతో రిమాండ్ ఖైదీ తలకు, ఛాతిలో బలమైన గాయాలు అయ్యాయని ఈ హఠాత్తు సంఘటన నుండి పోలీసులు తేరుకుని వెంటనే ఖైదీ రాజును ఎమర్జెన్సీ వార్డులోకి మార్చడం జరిగిందని జైలు అధికారులు తెలిపారు.



# ఆయకట్టు లక్షల్లో.. నీరు చుక్కల్లో!

ప్రాజెక్టులున్నా పారేది తక్కువే
తాలిపేరు, కిన్నెరసాని, పెద్దవాగు ద్వారా అందేదెంత
సీతారామాపైనే భారీ ఆశలు?
ఏళ్లుగా సాగునీటి కోసం ఎదురు చూపు
ఇప్పటికైనా ఆయకట్టు లెక్కలు తేల్చాలి



**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం :** ఇది గోదావరి పరివాహక ప్రాంతం, వాగులు వంకలు పొంగి పొర్లే ప్రదేశం, మెండుగా వర్షాలు కురిసే జిల్లా, పలు సాగునీటి ప్రాజెక్టులు, వేలాది చెరువులు ఉన్నప్పటికీ రైతాంగానికి సాగు నీటి భరోసా శూన్యమే. కాగితాలపై లక్షల ఎకరాల ఆకట్టు కనిపిస్తున్నా వాస్తవానికి ప్రతీ సీజన్‌లో ఏ మేరకు ఎన్ని ఎకరాలకు సాగునీరు పారుతుందో ఎంత ఆకట్టు సాగులోకి వస్తుందో అనేది ప్రధాన ప్రశ్నగా మారింది. జిల్లాలో కిన్నెరసాని, తాలిపేరు, పెద్దవాగు వంటి మధ్య తరహా ప్రాజెక్టులతో పాటు వేలాది చిన్నతరహా నీటి పనరులు ఉన్నాయి. వీటి అధికారిక ఆయకట్టు కలిపి 1,66,248 ఎకరాలకు పైగానే ఉంది. కిన్నెరసాని కాల్వల ఆయకట్టు సుమారు 10 వేల ఎకరాలు, తాలిపేరు 24,700 ఎకరాలు, పెద్దవాగు 2,360 ఎకరాలుగా లెక్కలు చెబుతున్నాయి. మరోవైపు 2,369 చిన్నతరహా నీటి వనరుల కింద 1,29,188 ఎకరాల ఆయకట్టు కాగితాల్లో ఉంది. ఇంతటి నీటి వనరులున్నప్పటికీ ఇంకా జిల్లాలో వర్షాధారంపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. ప్రాజెక్టుల నుండి నీరు విడుదలైనప్పుడు మాత్రమే పంటలు సాగవుతున్నాయి. చెరువులు కాలువలు పంపిణీ వ్యవస్థలో లోపాలు తలెత్తితే వేలాది ఎకరాలు సాగుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది.

**సీతారామాపైనే ఆశలు :** జిల్లాలోని గోదావరి నదిపై చేపడుతున్న సీతారామ ప్రాజెక్టుపైనే రెండు జిల్లాల రైతులు అశలు పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోనికి వస్తే ఉమ్మడి జిల్లాలో సాగునీటి సమస్య పరిష్కారంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకునే అవకాశముంది. ఇదిలా ఉండగా అనుమతులు న్యాయపరమైన అంశాలు పెండింగ్ పనులు కాలువల నిర్మాణం వంటి సమస్యలు ప్రాజెక్టు పురోగతిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. చేసిన పనుల్లో నాణ్యత లోపాలు ఎత్తి చూపుతున్నాయి.

**కాగితాల్లోనే ఆయకట్టు :** జిల్లాలో నీటి పారుదల వనరులు, ఆయకట్టు ప్రభుత్వ రికార్డుల కాగితాల్లో స్పష్టంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఎన్ని ఎకరాలకు వాస్తవంగా సాగునీరు అందుతుందో, ఎన్నిఎకరాలు సాగుకు దూరంగా ఉన్నాయో మండలాల వీరీగా సంబంధిత శాఖాధికారులు వెల్లడించాల్సిన అవరం ఉంది. కాగితాల్లో ఉన్న లెక్కలు సాగునీరు పారే ఎరకాలు పొంతన లేదనే వాదన వినవస్తోంది. ఇదిలా ఉండగా ప్రాజెక్టుల వారీగా నిల్వ సామర్థ్యం, ప్రాజెక్టు నిర్మాణం లెక్క కట్టిన ఆయకట్టు, ప్రస్తుతం నీరందుతున్న ఆయకట్టు ఏటా అందుతున్న నీటి పరిమాణం, చెరువులు కుంటల ఆక్రమణలు వంటివి బహిర్గత పర్చాల్సిన అవసరం ఉంది. అప్పుడే వాస్తవ పరిస్థితి స్పష్టంగా తెలిసే అవకాశం ఉంది. జిల్లాలో నీటి వనరులకు కొదవ లేదు. కానీ వాటి సమర్థవంతంగా వినియోగించి ప్రతీ సాగు సీజన్‌లో రైతులకు నీటి భరోసా కల్పించడమే అసలైన సవాల్‌గా మారింది. కాల్వల నిర్వహణ, పూడిక తీతలు చెరువుల పునరుద్ధరణ నీటి నిల్వల సామర్థ్యం పెంపు పంపిణీ వ్యవస్థ బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే రైతులకు నీటి భరోసా దక్కుతుంది.

## ఐఎఎల్ శిక్షణ తరగతులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయవాదుల శిక్షణ తరగతులు విజయవంతమయ్యాయి. ఈ శిక్షణ తరగతుల్లో ఎలక్ట్రానిక్ ఎవిడెన్స్ ఇన్ ప్రాక్టీస్ గురించి న్యాయవాదులకు శిక్షణనిచ్చారు. ఈ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా సివిఎల్ఎన్ మూర్తి హాజరు కాగా అతిథులుగా ఆర్జెసి కృష్ణ, ఉదయ్ భాస్కర్, దుస్సా జనార్దన్, పోట్ల మాధవరావు, షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, పట్వాలి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## సురవరం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి: దూసరి గోపాలరావు



**ప్రజాపక్షం/చింతకాని :** కమ్యూనిస్టు సిద్ధాంతాలపై అచంచల విశ్వాసంతో సామ్రాజ్యవాదం, మతతత్వం, దోపిడీకి వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన యోధుడు కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి అని సిపిఐ జిల్లా మండల కార్యదర్శి దూసరి గోపాలరావు అన్నారు. శనివారం చింతకాని మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో సురవరం సుధాకర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ కార్మిక కర్షక పీడిత జనాల కోసం సుధాకర్‌రెడ్డి త్యాగాలు వెలకట్టలేనివని స్పష్టం చేశారు. విలువలతో కూడిన రాజకీయాలే చేసి విద్యార్థి దశ నుండే ఉద్యమాల వైపు నడిచి ఎఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడిగా, రెండు సార్లు నల్గొండ పార్లమెంటు సభ్యులుగా పని చేసి పోరాటాలు నిర్వహించిన పోరాట యోధుడు సుధాకర్‌రెడ్డి అని అన్నారు. సుధాకర్‌రెడ్డి చూపిన కమ్యూనిస్టు ఉద్యమ పంథాలో ముందుకు సాగడమే ఆయనకు నిజమైన ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోగుల వెంకన్న, సిపిఐ నేరడ శాఖ సహాయ కార్యదర్శి మట్ట రవి, నాగరాజు, రత్నాకర్, వాలి, కందం రాజు, శ్రీరామ సైదులు, కొత్తకొండ మురళి తదితరులు పాల్గొన్నారు.

# యువతను విస్మరిస్తున్న పాలకులు

ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లాఖాద్రి




**ప్రజాపక్షం/ ఖమ్మం :** అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం. శ్రీనాథ్ రెడ్డి, చింతల రమేష్ ఎన్నికయ్యారు. 60 మందితో జిల్లా కౌన్సిల్‌ను, 22 మందితో ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మద్దోజు శ్రవణ్, ఉపాధ్యక్షులుగా మామిడాల కిరణ్ సహ పలువురిని మహాసభలో ఎన్నుకున్నారు. 21న చింతకాని మండలం కొదుమూరులో ఎఐవైఎఫ్ మహాసభలు జరిగాయి. శనివారం సిపిఐ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో ప్రధాన కార్యదర్శి చింతల రమేష్ మాట్లాడుతూ మహాసభలో 17 తీర్మానాలను ఆమోదించడం జరిగిందని ఆ తీర్మానాల అమలు కోసం పోరాట కార్యాచరణ రూపొందించినట్లు ఆయన తెలిపారు. పాలకులు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడతామని స్పష్టం చేశారు.

**ఉన్న జాబ్స్ ఊడగొడుతున్నారు : వలీ**

పాలక వర్గాలు యువతను విస్మరించి పాలన చేస్తున్నాయని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలీ ఉల్లా ఖాద్రి తెలిపారు. యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించిన మోదీ, ఉన్న ఉద్యోగాలను ఊడబీకుతున్నారని, రెండు లక్షల ఉద్యోగాల కల్పన హామీతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి అరకొర నోటిఫికేషన్లు తప్ప భర్తీ చేసింది లేదని ఆయన ఆరోపించారు. మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ అంబానీ, అదానీలకు దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆయన తెలిపారు. ముఖ్యంగా విద్యను కాషాయీకరణ చేస్తూ హిందూ మతోన్మాద చర్యలకు పాల్పడుతున్నారని ఖాద్రి ఆరోపించారు. దేశ వ్యాప్తంగా యువజన సమస్యలపై పోరాడుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఎఐవైఎఫ్ మాత్రమేనని ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో ఎఐవైఎఫ్ మాజీ నాయకులు, జిల్లా నిర్మాణ బాధ్యులు కొండపర్తి గోవిందరావు, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మామిడాల కిరణ్, ఎఐవైఎఫ్ నగర అధ్యక్షుడు దుర్గానాథ్, కార్యదర్శి చిర్రా కృష్ణ ప్రసాద్, తుపాకుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలు మృతి




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ జింకలతండా క్రాస్ రోడ్డు వద్ద జరిగిన కారు ద్విచక్ర వాహనం ఢీకొన్న ప్రమాదంలో అన్నాచెల్లెలు మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గుండెటి శ్రీను (18), గార్లపాటి రిషిక (10)లు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ఖమ్మం రమణగుట్టకు చెందిన గార్లపాటి ముత్తయ్యకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె రిషిక ఖమ్మంలో నాల్గవ తరగతి చదువుతుంది. పాఠశాలకు రెండు రోజులు సెలవులు రావడంతో రఘునాథపాలెంలోని మల్లెపల్లి గ్రీన్ కాలనీలో నివసిస్తున్న తన పెద్దమ్మ ఇంటికి వెళ్లేందుకు పెద్దమ్మ కొడుకు వరుసకు సోదరుడైన శ్రీనుతో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ జింకలతండా క్రాస్ రోడ్డు సమీపంలో ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా ఇల్లందు నుంచి ఖమ్మం వైపు వస్తున్న కారు అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రిషిక అక్కడికక్కడే మృతిచెందింది. శ్రీనుకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి శ్రీను, రిషికలు మృతిచెందినట్లు తెలిపారు. అతివేగంగా, అజాగ్రత్తగా కారు నడపడం వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుందని రిషిక తండ్రి ముత్తయ్య ఫిర్యాదు చేశారు. కారును భూక్యా కోటేశ్వరరావు అనే వ్యక్తి నడుపుతున్నట్లు తమకు తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. శ్రీను, రిషికల మృతితో గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## వర్గ విభేదాలకు తావివ్వొద్దు

చదువుపైనే దృష్టిని సారించాలి: ఐటిడిఎ పిఓ రాహుల్



**ప్రజాపక్షం/గుండాల :** గిరిజన సంక్షేమ శాఖ ఎఐఎఆర్‌ఎస్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీవిద్యార్థులు వర్గవిభేదాలు మనసులో పెట్టుకోకుండా చదువు పైనే దృష్టిని సారించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించిన సందర్భంగా ఇటీవల జరిగిన ఆందోళన నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో విడి విడిగా సమావేశమై పాఠశాలలో జరిగిన సంఘటనలపై వివరాలను సేకరించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు సొంత గ్రామాలను, తల్లి తండ్రులను వదిలి చదువు కోవడానికి వచ్చారని, గురువులనే తల్లి తండ్రులుగా భావించి చదివి వృద్ధిలోకి రావాలని అన్నారు. దేవాలయం లాంటి విద్యాలయాలలో పోలీసులు ప్రవేశించకూడదని, వారు ప్రవేశించారు అంటే కొంత తేడా ఉన్నట్లేనని, ఇటువంటి సంఘటనలు భవిష్యత్తులో జరగకుండా చూడాలని విద్యార్థులు సంఘటనలు జరిగినా క్రమశిక్షణ చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### సిఎం నిర్ణయాలను తప్పుపట్టే వారికి..

# పార్టీలో కొనసాగే హక్కు లేదు

కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలి
ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**ప్రజాపక్షం/కారేపల్లి:** కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాలను బహిరంగంగా తప్పుపట్టే వారికి పార్టీలో కొనసాగే నైతిక హక్కు లేదని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శనివారం సాయంత్రం కారేపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీపై కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు బాధ్యత వహించని మంత్రి కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని రాందాస్ నాయక్ డిమాండ్ చేశారు. పార్టీకి సంబంధించిన అంతర్గత అంశాలను నాయకులు అంతర్గతంగా చర్చించుకోవాలే తప్ప బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం సరి కాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలహీనపర్చేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న కుట్రలను మంత్రి కొండా సురేఖ అమలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూ పార్టీని, ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురి చేసేలా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాల్సిన నాయకులే వారిని అయోమయానికి గురిచేసే విధంగా వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై అధిష్ఠానం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## పిఆర్‌సి, డిఎలు వెంటనే ప్రకటించాలి

పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం పిఆర్‌సిని, డిఎను వెంటనే ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఎటి ) జిల్లా అధ్యక్షుడు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా పెన్షనర్లు, ఉద్యోగుల పట్ల తమ వైఖరిని మార్చుకోవాలని ఆయన సూచించారు. పెన్షనర్ల సంఘం జిల్లా సమావేశం శనివారం కృషి భవన్‌లో జరిగింది. సమావేశంలో పుల్లయ్య మాట్లాడుతూ పిఆర్‌సి, ఆరు డిఎల మంజూరులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన తెలిపారు. మూడు నెలలుగా హెల్త్ ప్రీమియం మినహాయిస్తున్న ప్రభుత్వం నగదు రహిత వైద్యాన్ని అమలు చేయడంలో మాత్రం తీవ్ర తాత్సారం చేస్తుందని ఆయన తెలిపారు. 2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్లకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో బకాయిలు చెల్లించలేదన్నారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయడంలో ప్రభుత్వం కపట నీతిని ప్రదర్శిస్తుందని పుల్లయ్య తెలిపారు. పెన్షనర్లు, ఉద్యోగుల ఉమ్మడిసమస్యల పరిష్కారానికి 27న టిజిఇజెఎసి ఇచ్చిన పిలుపు మేరకు జరిగే మహాధర్నాలో పెన్షనర్లు అందరూ పాల్గొని సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పెన్షనర్ల సంఘం పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్, నాయకులు తాడి అంజలి, వెంకటేశ్వర్లు, రాధాకృష్ణమూర్తి, నాగప్రసాద్, ఊడుగు సుధాకర్‌రావు, ఎండి హుస్సేన్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్ పామ్ సాగు లాభదాయకం



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఆయిల్ పామ్ సాగు లాభదాయకమని వేపకుంట్ల సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా తెలిపారు. శనివారం గ్రామానికి చెందిన ఇలా సుధాకర్ వ్యవసాయ క్షేత్రంలో చేపట్టిన ఆయిల్ పామ్ ప్లాంటేషన్‌లో ఉద్యాన అధికారి జి. నగేష్, సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా పాల్గొని మొక్కలు నాటి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు లాభదాయకమన్నారు. ఆయిల్ పామ్ పంటకు కోతుల బెడద లేదని ఒక్కసారి వేస్తే 30 సంవత్సరాల వరకు ఆదాయం ఇచ్చే పంట అన్నారు. ఉద్యాన అధికారి జి. నగేష్ 2026 సంవత్సరంలో ఇప్పటి వరకు మండలంలో వెయ్యి ఎకరాలలో ప్లాంటేషన్ జరిగిందన్నారు. ప్రభుత్వం నుండి ఎకరాకు రూ. 50వేల రాయితీ కూడా ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయిల్ పామ్‌లో అంతర పంటలుగా వక్క, కోకో, మునగ, సుగంధ పంటలు వేసుకుని అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

# బాలబాలికలకు భద్రమైన బాల్యాన్ని అందించాలి

విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపొందించాలి
'గుడ్‌టచ్', 'బ్యాడ్‌టచ్'పై అవగాహన కల్పించాలి
జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రతి చిన్నారికి సురక్షితమైన, భద్రమైన బాల్యాన్ని అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యత అని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు తెలిపారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ సమావేశ మందిరంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పిల్లలకు అనుకూలమైన న్యాయసేవల పథకం 2024 క్రింద బాలల సంరక్షణ అధికారుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక సదస్సును జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం. నాగరాజు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ తల్లి కోడి తన రెక్కల కింద పిల్లలను పెట్టుకుని ప్రమాదాల నుండి ఎలా అప్యాయంగా కాపాడుకుంటుందో సమాజంలో ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను అదే రీతిలో ప్రేమతో, బాధ్యతతో సంరక్షించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు చిన్ననాటి నుంచే చట్టాలపై, ప్రాథమిక హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. పాఠశాలల్లో చిన్న పిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి సరైన రీతిలో అర్థమయ్యేలా విడమరిచి చెప్పాలన్నారు. అనవసరపు స్పర్శను గుర్తించిన వెంటనే తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలిపేలా వారిలో ధైర్యాన్ని నింపాలన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో ఏమైనా అసాధారణ మార్పులు కనిపిస్తే టీచర్లు వెంటనే గమనించాలన్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే మార్గదర్శకులుగా నిలవాలన్నారు. కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ నేటి డిజిటల్ యుగంలో సమాజం చాలా వేగంగా మారుతుందని దీని వల్ల బాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు కూడా కొత్త రూపును సంతరించుకుంటున్నాయన్నారు. ప్రతి బిడ్డకు సురక్షితమైన వాతావరణం కల్పించేలా జువైనల్ జస్టిస్ యాక్ట్ పొక్సో చట్టం వంటి విధానాలను బాధ్యతాయుతంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు డా॥ పిపి కృష్ణార్జున్, డా॥ జివి మహేష్ నాథ్, వి. శ్రీనయ్య, ఎం. శ్రీనివాస్, ఎం. కల్పన, వి. శివరంజని, టి. మురళిమోహన్, పి. దేవి మానస, షేక్ మీరా ఖాసీంసాహెబ్, కె. జ్యోతిర్మయి, బి. రజని, వై. బిందుప్రియ, ఎ. ప్రవీణ్, బి. నాగలక్ష్మి , జి. అఖిలగౌడ్, వి. దీప్తి, జి. నిష్క, బి. నాగసుమబాల, వి. లావణ్య, జిల్లా బాల సంరక్షణ అధికారిణి విష్ణువందన, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్ హెచ్చరిక




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే పద్ధతులను ప్రభుత్వం వెంటనే మానుకోవాలి ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. శనివారం పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేసి ప్రభుత్వ విధానాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో అనుసంధానం చేసే ఆలోచన సరైంది కాదని, ఇప్పటికైనా విరమించుకోవాలన్నారు. ఈ నిర్ణయం అమలైతే వేలాది మంది విద్యార్థుల విద్య, ఉపాధి అవకాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్‌ను ప్రభావితం చేసే నిర్ణయాలపై ప్రభుత్వం.. విద్యార్థులు, అధ్యాపకులతో చర్చించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే ఆమరణ దీక్షలకు సైతం సిద్ధమని హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్, జిల్లా ఉపాధ్యక్షుడు సంజయ్, నాయకులు జయదీప్, ముదిగొండ నిరీక్షణ, ప్రియాంషి, సాయి కృష్ణ, నీలాద్రి, బండి హని కృష్ణ పాల్గొన్నారు.

## చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జహీర్‌పురా ప్రాంతంలో ఈనెల 12న తాళం వేసిన ఇంటిలోకి చొరబడి బంగారం, వెండి ఆభరణాలు దొంగిలించిన కేసులో ఆదే ప్రాంతానికి చెందిన నిందితుడు తుడుము గోపిని త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ మోహన్‌బాబు తెలిపారు. గాంధీచౌక్‌లోని బంగారం దుకాణాల సమూదాయం వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన గోపిని అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేయగా బంగారు ఆభరణాలు కనిపించడంతో అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా చోరీ విషయం బయటపడిందని తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేసి రూ.7వేల నగదు, లక్షరూపాయల విలువ చేసే 6.25గ్రాముల బంగారు దిద్దులు, చెవి బుట్టలు, 81గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిపై గతంలో పోక్సో, కొట్లాట కేసులు ఉన్నాయని, నిందితుడిని కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించినట్లు తెలిపారు.

## సురవరం పేద, బడుగు బలహీన వర్గాల పక్షపాతి

కమ్యూనిస్టు ఉద్యమాల్లో చెరగని ముద్ర
సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి, వీసంశెట్టి



**ప్రజాపక్షం/పాల్వంచ :** నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించిన , పేద,బడుగు, బలహీన వర్గాల పక్షపాతి సురవరం సుధాకర్‌రెడ్డి అని,ఆయన ఆశయాలను సాధించటానికి మనమంతా కృషి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి పూర్ణచందర్‌రావులు అన్నారు. సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు అమరజీవి సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో శనివారం నిర్వహించారు. ముందుగా సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో పేదలు, కార్మికులు, కర్షకులు, రైతులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్ రెడ్డి అని అన్నారు. సురవరం నేతృత్వంలో పని చేసిన అనేక మంది యువజన, విద్యార్థి నాయకులు తరువాత కాలంలో వివిధ రాష్ట్రాల్లో రాజకీయ నాయకులుగా ఎదిగారని చెప్పారు. సురవరం సుధాకర్‌రెడ్డి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తూ నిత్యం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్మించాలని పార్టీ శ్రేణులను కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాహుల్, జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, రాంబాబు, శ్రీనివాసరావు, డి. చెన్నయ్య, బిక్కులాల్, నామా పండు, ఎస్‌కె. కరీం, రాము, బాబు, వెంకట్, రామక్రిష్ణ, క్రిష్ణ, వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు, కిరణ్, రమేష్, ప్రసాద్, వీరు, సత్యనారాయణ, లాల్‌పాషా, రవి, కుమార్ పాల్గొన్నారు.

## ఖిల్లా రోప్‌వే పనులు వేగవంతం చేయాలి

కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శనివారం కలెక్టర్ దివాకర టిఎస్ ఖిల్లా రోప్‌వే నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తయిన పనులు, జరుగుతున్న నిర్మాణ ప్రక్రియ, పనుల పురోగతి తదితర వివరాలను అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోప్ వే నిర్మాణ పనులు ఆశించిన వేగంతో జరగడం లేదని పనుల్లో వేగం పెంచాలన్నారు. నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను ముందసు ప్రణాళికతో సమకూర్చుకోవాలన్నారు. రోప్‌వే నిర్మాణంలో నాణ్యతకు అత్యధిక ప్రా ధాన్యతనివ్వాలన్నారు. ఖిల్లా ప్రాంతంలో షిట్ రాక్ ఉన్నందున జియాలజిస్టుతో సమన్వయం చేసుకుని భౌగోళిక పరిస్థితులను పూర్తిగా పరిశీలించాలని సూచించారు. పర్యాటకుల వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాన్ని గుర్తించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖాధికారి సుమన్ చక్రవర్తి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, సంబంధిత అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణా ప్రభుత్వము

ఫారం-6

(ప్రాథమిక ప్రకటన)

(చట్టం 30/2013 లోని 11(1) మరియు సబ్ రూల్-1, రూల్ 19 ప్రకారం)

| | |
|---|---|
| ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ ఆర్.సి.నెం. సి/313/2024 | తేది: 31-07-2026 |
| జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు నెం. జి/2353/2026 | తేది: 03-08-2026 |
| భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం. బి3/58/2026 | తేది: 05-08-2026 |

ఈ దిగువ నిర్దిష్ట పరచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం, ఊటుపల్లి గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎ. 25.12 1/2 గుంటలు** ప్రజా ప్రయోజనం నిమ్మిత్తం అనగా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ క్రింద 12L - డిస్ట్రిబ్యూటరీ కెనాల్, ప్యాకజి నెం.1 ఊటుపల్లి గ్రామము, ఈ దిగువ చూపిన భూమి అవసరమై ఉన్నదని భావించినందున భూసేకరణ, పుణరావాస, పునఃనిర్మాణం కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కుచట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారిచేయనైనది.

భూసేకరణ వలన భూ నిర్వాసితులయ్యే కుటుంబాలు ఏమియులేవు. నిర్వాసిత కుటుంబాల పుణరావాస, పునఃనిర్మాణం అంశాలకు అదనపు కలెక్టర్ (రెవిన్యూ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అధికారిగా నియమించబడినారు. కావున ఈ ప్రాజెక్ట్ క్రింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం ఊటుపల్లి గ్రామంలోని విస్తీర్ణం **ఎ. 25.12 1/2 గుంటలు** గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచయనైనది.

షెడ్యూల్

గ్రామం:: ఊటుపల్లి మండలం:: అన్నపురెడ్డిపల్లి జిల్లా :: భద్రాద్రికొత్తగూడెం

| క్ర. సం. | సర్వే నం. (సెట్ల్మెంట్ ప్రకారం) | సర్వే నం. (పహాణీ ప్రకారం) | సర్వే నం. (భూభారతి ప్రకారం) | భూమి (యాజమాన్యం) | భూమి యొక్క రకం (మెట్ట/తరి) | సేకరించవలసిన విస్తీర్ణం | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: భూమి (యాజమాన్యం) | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: అనుభవదారుని పేరు | చెట్లు & కట్టడములు |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 1. | 122/ 2 | 122/EE 121/E | 122/ఈ 121 | పట్టా | మెట్ట | 1.10 | పోల్కంపల్లిసందీప్ త:వెంకటేశ్వరరావు | పోల్కంపల్లిసందీప్ త:వెంకటేశ్వరరావు | యూక లిప్టస్ |
| 2. | 122/ 2 | 128/E | 128/ఇ | పట్టా | మెట్ట | 0-06 | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | యూక లిప్టస్ |
| 3. | 122/ 2 | 122/A A/A | 122/ఆ /అ | పట్టా | మెట్ట | 0-25 | జిల్లెల్లా ఉషారాణి, భర్త : రాంబాబు | జిల్లెల్లాఉషారాణి, భర్త : రాంబాబు | యూక లిప్టస్ |
| 4. | 123/ 2 | 123/U U | 123/ ఊ/3 | పట్టా | మెట్ట | 0-16 | జోలపల్లి సాంబశివరావు త:చందర్ రావు | జోలపల్లి సాంబశివరావు త: చందర్ రావు | యూక లిప్టస్ |
| 5. | 123/ 2 | 123/E E | 123/ఈ | పట్టా | మెట్ట | 0-09 1/2 | జోలపల్లి పిచ్చయ్యతండ్రి: చంద్రయ్య | జోలపల్లి సత్యనారాయణ త:పిచ్చయ్య | యూక లిప్టస్ |
| 6. | 123/ 2 | 123UU /1 | 123/ ఊ/1/1 | పట్టా | మెట్ట | 0-13 | వేముల సుబ్బయ్య త:పిచ్చయ్య | మామిళ్ళపల్లి వెంకటేశ్వరరావు త:పాపారావు | యూక లిప్టస్ |
| 7. | 123/ 2 | 123/U | 123/ఉ/ 1 | పట్టా | మెట్ట | 0-9 1/2 | బోయినపల్లి సుభద్రభ: సాంబయ్య | బోయినపల్లి సుభద్ర భ: సాంబయ్య | యూక లిప్టస్ |
| 8. | 123/ 2 | 123/E | 123/ ఊ/2/3 | పట్టా | మెట్ట | 0-05 | పెనుగొండ జమలయ్య త:వెంకటేశ్వర్లు | పెనుగొండ జమలయ్య త:వెంకటేశ్వర్లు | యూక లిప్టస్ |
| 9. | 123/ 2 | 123/Lu | 123/ ఊ/2/2 | పట్టా | మెట్ట | 0-05 | పెనుగొండ లక్ష్మ య్యతండ్రి: వెంకటేశ్వర్లు | పెనుగొండ లక్ష్మ య్యతండ్రి: వెంకటేశ్వర్లు | యూక లిప్టస్ |
| 10. | 123/ 2 | 123/U U/1 | - | పట్టా | మెట్ట | 0-16 | వేముల సుబ్బయ్యతండ్రి : పిచ్చయ్య | మామిళ్లపల్లి మురళీకృష్ణ త:పాపారావు | యూక లిప్టస్ |
| 11. | 123/ 2 | 123/U U | 123/ ఊ/1/2 | పట్టా | మెట్ట | 0-10 | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | యూక లిప్టస్ |
| 12. | 124/2 | 124/A A | 124/ఆ | పట్టా | మెట్ట | 0-34 | జొల్లపల్లి సాంబశివరావు త:చంద్రరావు | జొల్లపల్లి సాంబశివరావు త: చంద్రరావు | యూక లిప్టస్ |
| 13. | 125/ 2 | 125/A | 125/అ | పట్టా | మెట్ట | 0-16 | బొల్లంపల్లి తిరుపతయ్య త:రాఘవయ్య | బోయినపల్లి రాజేష్ త: జగన్మోహన్రావు | యూక లిప్టస్ |
| 14. | 125/ 2 | 125/E | 125/ఇ | పట్టా | మెట్ట | 0-17 | బత్తుల జమలయ్య త:వెంకటస్వామి | బత్తుల జమలయ్య త:వెంకటస్వామి | యూక లిప్టస్ |
| 15. | 125/ 2 | 125/E E | 125/ఈ | పట్టా | మెట్ట | 0-17 1/2 | వేముల వెంకటేశ్వర్లు త:ముత్యాలు | వేముల వెంకటేశ్వర్లు త:ముత్యాలు | యూక లిప్టస్ |
| 16. | 125/ 2 | 125/A A | 125/ఆ | పట్టా | మెట్ట | 0-18 1/2 | జొల్లపల్లి సాంబశివరావు త:చందారావు | జొల్లపల్లి సాంబశివరావు త:చందారావు | యూక లిప్టస్ |
| 17. | 125/ 2 | 125/U | 125/ఉ | పట్టా | మెట్ట | 0-02 | బత్తుల జమలయ్య త:వెంకటస్వామి | బత్తుల జమలయ్య త:వెంకటస్వామి | యూక లిప్టస్ |
| 18. | 127/ 2 | 127/A | 127/ఆ | పట్టా | మెట్ట | 0-14 | జోలపల్లి సాంబశివరావు త: చంద్రరావు | జోలపల్లి సాంబశివరావు త: చంద్రరావు | యూక లిప్టస్ |
| 19. | 127/ 2 | 127/E E | 127/ఈ | పట్టా | మెట్ట | 0-08 | జోలపల్లి పిచ్చయ్య త: చంద్రయ్య | జోలపలి సత్యనారాయణ త:పిచయ్య | యూక లిప్టస్ |
| 20. | 127/ 2 | 127/U | 127/ఉ/ 1 | పట్టా | మెట్ట | 0-06 1/2 | బోయినపల్లి సుభద్ర త:సాంబయ్య | బోయినపల్లి సుభద్ర త:సాంబయ్య | యూక లిప్టస్ |
| 21. | 127/ 2 | 127/E | 127/ఇ | పట్టా | మెట్ట | 0-02 1/2 | వీరమనేని నాగేశ్వరరావు త:పాపయ్య | పెనుగొండ జమలయ్య త:వెంకటేశ్వర్లు | యూక లిప్టస్ |
| 22. | 127/ 2 | 127/E | 127/ఇ | పట్టా | మెట్ట | 0-02 1/2 | వీరమనేని నాగేశ్వరరావుతండ్రి : పాపయ్య | పెనుగొండ లక్ష్మ య్యతండ్రి: వెంకటేశ్వర్లు | యూక లిప్టస్ |
| 23. | 127/ 2 | 123/U U | 123/ ఊ/1/2 | పట్టా | మెట్ట | 0-03 | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | యూక లిప్టస్ |
| 24. | 128/ 2 | 123/U U | 123/ ఊ/1/2 | పట్టా | మెట్ట | 0-08 | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | పోల్కంపల్లి సందీప్ త: వెంకటేశ్వరరావు | యూక లిప్టస్ |
| 25. | 128/ 2 | 128/E | 128/ఇ | పట్టా | మెట్ట | 0-11 | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | యూక లిప్టస్ |
| 26. | 128/ 2 | 121/A | 121/అ | పట్టా | మెట్ట | 0-20 | జిల్లెల్లా ఉషారాణి భ: రాంబాబు | జిల్లెల్లా ఉషారాణి భ: రాంబాబు | యూక లిప్టస్ |
| 27. | 129/2 | 129/ ఋ/ఉ /1 | 129/ ఋ/ఉ /1/1 | పట్టా | మెట్ట | 1-02 | మామిళ్లపల్లి ఉమామహేశ్వ ర్రావు త:భాస్కర్రావు | మామిళ్లపల్లి ఉమామహేశ్వ ర్రావు త:భాస్కర్రావు | యూక లిప్టస్ |
| 28. | 129/2 | 129/U 129RU /AA/1 | 129/ఉ 129/ ఋ/ ఆ/2 | పట్టా | మెట్ట | 0-19 | పోల్కంపల్లి భద్రారావు త:నర్సయ్య | పోల్కంపల్లి భద్రారావు త:నర్సయ్య | యూక లిప్టస్ |
| 29. | 129/2 | 129/R U/AA | 129/ ఋ/ ఆ/1 | పట్టా | మెట్ట | 0-20 | పోల్కంపల్లి వరలక్ష్మి భ: ప్రకాశరావు | పోల్కంపల్లి ప్రకాశరావు త: వెంకటసుబ్బయ్య | యూక లిప్టస్ |
| 30. | 129/2 | 129Ru /AA/1 142/G ha/A/1 | 129/ ఋ/ ఆ/2 142/ ఘ/అ/ అ1 | పట్టా | మెట్ట | 0.35 | పోల్కంపల్లి భద్రారావు త:నర్సయ్య | పోల్కంపల్లి భద్రారావు త:నర్సయ్య | యూక లిప్టస్ |
| 31. | 129/2 | 133/A | 133/అ | పట్టా | మెట్ట | 0-15 | బోయినపల్లి రాజేశ్వరి భ: పాపారావు | బోయినపల్లి రాజేశ్వరి భ: పాపారావు | యూక లిప్టస్ |
| 32. | 129/2 | 129/R uU | 129/ ఋ/1/ ఊ | పట్టా | మెట్ట | 0-18 1/2 | మామిళ్లపల్లి శ్రీనివాసరావు త:రామారావు | మామిళ్లపల్లి వెంకటేశ్వరరావు, త:కోటేశ్వరావు | యూక లిప్టస్ |
| 33. | 129/2 | 131/A A | 131/ఆ/ 1 | పట్టా | మెట్ట | 0-07 | పోల్కంపల్లి కమల భ:విజయ రామారావు | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | యూక లిప్టస్ |
| 34. | 129/2 | 131/A A | 131/ఆ/ 2 | పట్టా | మెట్ట | 0-07 | ఇమ్మనేని కళావతి భ: మల్లికారున రావు | ఇమ్మనేని కళావతి భ:మల్లికారున రావు | యూక లిప్టస్ |
| 35. | 129/2 | 129/R u/A/2 | 129/ ఋ/2 | పట్టా | మెట్ట | 0-07 1/2 | మొక్కరాల జ్యోతిర్మయి భ: ప్రసాద్ | మొక్కరాల జ్యోతిర్మయి భ: ప్రసాద్ | యూక లిప్టస్ |
| 36. | 129/ 3 | - | - | - | మెట్ట | 0-09 | - | రోడ్డు | యూక లిప్టస్ |
| 37. | 129/ 4 | 128/A A | 128/ఆ 129/ఆ /ఆ | పట్టా | మెట్ట | 0.39 3/4 | మామిళ్లపల్లి నరేంద్రబాబు త:భాస్కర్ | మామిళ్లపల్లి నరేంద్రబాబు త:భాస్కర్ | యూక లిప్టస్ |
| 38. | 129/ 4 | 129/R u | 129/ ఋ/1 | పట్టా | మెట్ట | 0-0 1/4 | మామిళ్లపల్లి ప్రసాద్ త:కృష్ణారావు | మామిళ్లపల్లి ప్రసాద్ త:కృష్ణారావు | యూక లిప్టస్ |
| 39. | 130/ 2 | 130/E E | 130/ఈ | పట్టా | మెట్ట | 0-12 1/2 | మామిళ్లపల్లి నరేంద్రబాబు త:భాస్కర్రావు | మామిళ్లపల్లి నరేంద్రబాబు త:భాస్కర్రావు | యూక లిప్టస్ |
| 40. | 131/ 2 | 131/A A | 131/ఆ/ 1 | పట్టా | మెట్ట | 0-19 1/2 | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | వరి |
| 41. | 131/ 2 | 131/A A | 131/ఆ/ 2 | పట్టా | మెట్ట | 0-19 1/2 | ఇమ్మనేని కళావతి భ:మల్లికార్జున్రావు | ఇమ్మనేని కళావతి భ:మల్లికార్జున్రావు | వరి |
| 42. | 131/ 2 | 131/U/ 2 | 131/ఉ/ 3 | పట్టా | మెట్ట | 0-19 | మొక్కరాల జ్యోతిర్మయి భ: ప్రసాద్ | మొక్కరాల జ్యోతిర్మయి భ: ప్రసాద్ | వరి |
| 43. | 131/ 2 | 131U/1 | 131/ఉ/ 1 | పట్టా | మెట్ట | 0-16 | మామిల్లపల్లి సాయిసుమన్ త:రామారావు | మామిల్లపల్లి సాయిసుమన్ త:రామారావు | వరి యూక లిప్టస్-80 |
| 44. | 131/ 2 | 131/A A | 131/ఆ/ 1 | పట్టా | మెట్ట | 0-05 | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | వరి |
| 45. | 131/ 2 | 131/E | 131/ఇ | పట్టా | మెట్ట | 0-01 | పోల్కంపల్లి ప్రకాశరావు త: వెంకటసుబ్బయ్య | పోల్కంపల్లిప్రకాశ రావు త: వెంకటసుబ్బయ్య | వరి |
| 46. | 132/ 2 | 131/E | 131/ఇ | పట్టా | మెట్ట | 0-0 1/2 | పోల్కంపల్లి ప్రకాశరావు త: వెంకటసుబ్బయ్య | పోల్కంపల్లి ప్రకాశరావు త: వెంకటసుబ్బయ్య | వరి |
| 47. | 132/ 2 | 131/A A | 131/ఆ/ 1 | పట్టా | మెట్ట | 0-04 | పోల్కంపల్లి కమల భ:. విజయ రామారావు | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | వరి |
| 48. | 132/ 2 | 131/A A | 131/ఆ/ 2 | పట్టా | మెట్ట | 0-03 3/4 | ఇమ్మనేని కళావతి భ: మల్లిఖార్జున రావు | ఇమ్మనేనికళావతి భ: మల్లిఖార్జున రావు | వరి |
| 49. | 134/2 | 134/A | 134/అ /2 | పట్టా | మెట్ట | 0-13 1/4 | మామిల్లపల్లి సాయిసుమన్ త:రామారావు | మామిల్లపల్లి సాయిసుమన్ త:రామారావు | వరి |
| 50. | 134/2 | 134/U | 134/ ఊ | పట్టా | మెట్ట | 0-09 1/2 | బోయినపల్లి రామారావు త:. అమ్మయ్యా | పోల్కంపల్లి కమల భ: విజయ రామారావు | వరి |
| 51. | 134/2 | 135/A | 135/ఆ | పట్టా | మెట్ట | 0-06 1/2 | వీరమనేని కృష్ణారావు త:వెంకయ్య. | వీరమనేని కృష్ణారావు త:వెంకయ్య | వరి |
| 52. | 134/2 | 134/E E | 134/ ఈ | పట్టా | మెట్ట | 0-05 | పోల్కంపల్లి మురళీకృష్ణ త: ధనుంజయరావు | పోల్కంపల్లి మురళీకృష్ణ త:. ధనుంజయరావు | వరి |
| 53. | 134/2 | 134/E | 134/ఇ/ 1 | పట్టా | మెట్ట | 0-01 | పోల్కంపల్లి వరలక్ష్మి భ: ప్రకాశరావు | పోల్కంపల్లి వరలక్ష్మి భ: ప్రకాశరావు | వరి |
| 54. | 139/2 | 139/A | 139/అ | పట్టా | మెట్ట | 0-02 | వేముల రంగారావు, తండ్ర: శేషయ్య | పోల్కంపల్లి భద్ధ్రరావు త:నర్సయ్య | వరి |
| 55. | 140/2 | 137 | 137/ఆ | పట్టా | మెట్ట | 0-07 | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | వరి |
| 56. | 140/2 | 140/A A | 140/ఆ | పట్టా | మెట్ట | 1-01 | వీరమనేని కృష్ణఅర్జునరావు త:వెంకయ్య | వీరమనేని కృష్ణఅర్జునరావు త:వెంకయ్య | వరి |
| 57. | 140/2 | 130/A A | 130/అ /2 | పట్టా | మెట్ట | 0-17 | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | పోల్కంపల్లి ధనుంజయరావు త:నర్సయ్య | |
| 58. | 142/1/ 2 | 142/Jn a/E | 142/జ్ఞ/ ఇ | పట్టా | మెట్ట | 0-17 1/2 | పోల్కంపల్లి విజయ కుమారి భ: ధనుంజయరావు | పోల్కంపల్లివిజయ కుమారి భ: ధనుంజయరావు | |
| 59. | 142/1/ 2 | 142/G ha/A/ A/1 | 142/ ఘ/అ/ అ1 | పట్టా | మెట్ట | 0-08 1/2 | పోల్కంపల్లి భద్ద్రరావు త:నర్సయ్య | పోల్కంపల్లి భద్ద్రరావురావు త:నర్సయ్య | |
| 60. | 142/1/ 2 | 142/G na/A | 142/జ/ అ/2- | పట్టా | మెట్ట | 1-31 | పోల్కంపల్లివిజయ కుమారి భ: ధనుంజ్రయావు | పోల్కంపల్లివిజయ కుమారి భ: ధనుంజ్రయావు | |
| 61. | 142/1/ 2 | 142/G na/A | 142/జ్ఞ/ ఆ/1/1/1 | పట్టా | మెట్ట | 0-06 | పోల్కంపల్లి శ్రీనివాసరావు త:ధనుంజ్రయావు | పోల్కంపల్లి శ్రీనివాసరావు త:ధనుంజ్రయావు | |
| 62. | 142/1/ 2 | 142/G na/A | 142/జ్ఞ/ ఆ/1/1/1 | పట్టా | మెట్ట | 0-20 | పోల్కంపల్లి శ్రీనివాసరావు త: ధనుంజయరావు | పోల్కంపల్లి శ్రీనివాసరావు త: ధనుంజయరావు | |
| 63. | 142/1/ 2 | 142/E E | 142/ ఈ/1/3 | పట్టా | మెట్ట | 2-32 | పోల్కంపల్లి సాయిసంతోష్ త:కనకారావు | పోల్కంపల్లి సాయిసంతోష్ త:కనకారావు | పామాయిల్-161 |
| 64. | 142/1/ 2 | 142/G na/A | 142/జ/ అ/2 | పట్టా | మెట్ట | 0-08 3/4 | పోల్కంపల్లివిజయ కుమారి భ: ధనుంజ్రయావు | పోల్కంపల్లివిజయ కుమారి భ: ధనుంజ్రయావు | |
| 65. | 142/1/ 2 | 142/A /U | 142/జ/ అ/1/1/ 2 | పట్టా | మెట్ట | 0-01 /4 | సన్నెపల్లి సత్యనారాయణ త:కృష్ణారావు | సన్నెపల్లి సత్యనారాయణ త:కృష్ణారావు | |
| | | | విస్తీర్ణం : 25.12 1/2 | | | | | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాశితులు పునరావాసం మరియు పునఃనిర్మాణం చట్టం, 2013 (నెం. 30/2013 సెక్షన్ 11(1) ప్రకారం సంబదిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారిచేయనైనది. భూమీయొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I గారి కార్యాలయంలో ఉంచనైనది సంబధిత వ్యక్తులు ఏదైన పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖి చేసుకోవచ్చును.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణ సంబంధిత సెక్షన్12 ప్రకారం పైతెలిపిన భూములలో ఏదైన ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టాడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారిచేసిన తేదినుండి ఆ ప్రకటనలో ఉదాహరింపబడిన భూమి హక్కు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టారాదు.

భూసేకరణ విషయాలో సంబందించిన భూయజమానులు ఏదైన అభ్యంతరములున్న యెడల చట్టం 15వ విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం/భూసేకరణ అధికారి ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ వారికి ఇట్టి ప్రకటన జారీచేసిన (60) దినములలోపల ఏమైనా అభ్యంతరములున్న/ యెడల తమ అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియచేయవలసి ఉన్నది.

| సం/- | సం/- | సం/- |
|---|---|---|
| యం.వి.రవింద్రనాథ్ ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్ సీతరామ ఎత్తిపోతల ప్రాజెక్ట్, యూనిట్-1, పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | డి.వేణుగోపాల్ అదనపు కలెక్టర్ (రెవిన్యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా | అంకిత్ ఐ.ఏ.ఎస్., కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా |

DIPR RO NO. 738/LA/PP/Advt/Pub/2026-27

## పార్లమెంట్‌లో ఒకే సెషన్‌లో..

# బిల్లులు ప్రవేశపెట్టి, ఆమోదించే ధోరణి!

ఎత్తిచూపిన 'పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ డేటా' విశ్లేషణ



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో సమగ్ర చర్చలకు తావులేకుండా ఒకే సెషన్‌లో బిల్లులు ప్రవేశపెట్టి, ఆమోదించే ధోరణిని పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ డేటా విశ్లేషణ ఎత్తిచూపింది. 18వ లోక్‌సభలో ఇప్పటివరకు ప్రవేశపెట్టిన బిల్లులలో సగానికి పైగా బిల్లులను, వాటిని ప్రవేశపెట్టిన అదే సమావేశంలో, ఉభయసభలలో ఆమోదం పొందాయని, గత ఏడాదికాలంగా ఈ ధోరణి విపరీతంగా పెరిగిపోతున్నదని పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ డేటా విశ్లేషణ వెల్లడించింది. పిఆర్ఎస్ సమావేశాల వారీ డేటా విశ్లేషణ ప్రకారం...ఈ లోక్‌సభ ఏర్పడినప్పటి నుంచి ప్రవేశపెట్టిన 64బిల్లులలో 34లేదా 53శాతం బిల్లులు అవి ప్రవేశపెట్టబడిన సమావేశాలలోనే ఉభయ సభలలో ఆమోదించబడ్డాయి. 16వ లోక్‌సభలో ఈ నిష్పత్తి 33శాతంగా ఉంది. అదే సమయంలో ప్రవేశపెట్టబడని 189బిల్లులలో 63బిల్లులు అదే సమావేశంలో ఆమోదం పొందాయి. 17 వలోక్‌సభ హయాంలో ఇది దాదాపు రెట్టింపు అయ్యి 62శాతానికి చేరుకుంది. ఆ సమయంలో ప్రవేశపెట్టిన 190బిల్లుల్లో 117 బిల్లులు అదే సెషన్‌లో ఆమోదం పొందాయని పిఆర్ఎస్ డేటా తెలిపింది. అయితే, పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల పనితీరును పరిశోధించి, పర్యవేక్షించే ఒక స్వతంత్ర, లాభాపేక్షలేని సంస్థ అయిన పిఆర్ఎస్ నిర్వహించే రికార్డుల ప్రకారం 18వ లోక్‌సభ ఈ విషయంలో నిదానంగా ప్రారంభమైంది. 2026 బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టిన 10బిల్లులలో 5బిల్లులు అదే సమావేశంలో ఆమోదం పొందాయని పిఆర్ఎస్ డేటా వెల్లడించింది. ఆగస్టు 13న ముగిసిన వర్షాకాల సమావేశాలలో ఈ ధోరణి అత్యంత స్పష్టంగా కనిపించిందని, ఈ సమావేశాలు ముగియక ముందే ప్రవేశపెట్టిన 12బిల్లుల్లో 11 బిల్లులు ఆమోదం పొందినట్లు పిఆర్ఎస్ విశ్లేషణ వివరించింది. పెండింగ్‌లో ఉన్న బిల్లు కేవలం ఒకే ఒక్క ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ బిల్లు–2026మాత్రమేనని పేర్కొంది. ప్రభుత్వం అసలు లెజిస్లేటివ్ ఎజెండాలో ప్రవేశపెట్టి ఆమోదించడం కోసం 5 బిల్లులు, పరిశీలన, ఆమోదం కోసం పెండింగ్‌లో ఉన్న రెండు బిల్లులు జాబితా చేయబడ్డాయని, కానీ పార్లమెంట్ చివరికి ఆమోదించిన 11 బిల్లులలో ఆరు అసలు ఎజెండాలో ప్రవేశపెట్టడం కోసం జాబితా చేయబడినవే నని వెల్లడించింది.ప్రభుత్వం ఎజెండాలో పరిశీలన, ఆమోదం కోసం జాబితా చేయబడిన రెండు పెండింగ్ బిల్లుల్లో అంటే..వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ (విబిఎస్ఏ)బిల్లు,–2025, ఫారిన్ కంట్రిబ్యూషన్ (రెగ్యులేషన్) అమెండ్‌మెంట్ (ఎఫ్‌సిఆర్ఏ) బిల్లు, 2026 ఏదీ ఆమోదం పొందలేదని పిఆర్ఎస్ డేటా విశ్లేషణ తెలియజేసింది. విబిఎస్ఏ బిల్లును పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీ ఇంకా తన నివేదికను సమర్పించలేదు. కాగా, ఎఫ్‌సిఆర్ఏ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో దానిని పార్లమెంట్ సంయుక్త కమిటీకి నివేదించారు. ఒక బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ, అది ఆమోదం పొందేప్పటికి మధ్య తక్కువ వ్యవధి ఉండటం వల్ల, ప్రతిపాదిత చట్టాన్ని పరిశీలించడానికి ఎంపీలకు సమయం తక్కువగా ఉంటుందని, అలాగే, సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరిపే అవకాశాలు పరిమితం అవుతాయని పిఆర్ఎస్ గతంలోనే ఎత్తిచూపిన విషయం తెలిసిందే. వర్షాకాల సమావేశాలలో పలు బిల్లులపై చర్చించేందుకు వెచ్చించే సమయమే ఈ ఆందోళనకు దారి తీసిందని తెలిపింది. పిఆర్ఎస్ ప్రకారం...బిల్లులను ప్రవేశపెట్టే మంత్రి తప్ప మరే ఎంపీ మాట్లాడకుండానే 9బిల్లులు ఆమోదం పొందాయని, 11బిల్లులలో 7 బిల్లులు 5 నిమిషాలు లేదా అంతకంటే తక్కువ సమయంలోనే ఆమెదం పొందినట్లు వివరించింది. 2024బడ్జెట్ సమావేశాలలో ప్రవేశపెట్టిన 11బిల్లుల్లో ఏ ఒక్కటీ ఆ సమావేశంలో ఉభయ సభల ఆమోదం పొందలేదని, ఆ తర్వాత జరిగిన శీతాకాల సమావేశాలలో ప్రవేశపెట్టిన నాలుగు బిల్లులు సైతం సమావేశాలు ముగిసేనాటికి పెండింగ్‌లోనే ఉన్నాయని పిఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ డేటా విశ్లేషణ తెలియజేసింది. 2024శీతాకాల సమావేశాలలో పార్లమెంట్‌లో ఆమోదం పొందిన ఏకైక బిల్లు, గత బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టిన భారతీయ వాయుయాన్ విధేయక్, 2024 మాత్రమేనని పిఆర్ఎస్ పేర్కొంది. 2025 నుంచి ఈ నమూనా మారింది. జులై 20నుంచి ఆగస్టు 13వరకు జరిగిన ఈ ఏడాది వర్షాకాల సమావేశాలలో 19 సిట్టింగ్‌లు జరిగాయని, నీట్–యుజి పేపర్‌లీక్, జంతర్‌మంతర్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల చర్య, అయోధ్యలోని రామ మందిరం నుంచి విరాళాల చోరీ పదేపదే అంతరాయాలు ఏర్పడటంతో, లోక్‌సభ తన నిర్ణీత సమయంలో కేవలం 15శాతం మాత్రమే పనిచేయగా, రాజ్యసభ 33శాతం పనిచేసిందని పిఆర్ఎస్ డేటా రీసెర్చ్ విశ్లేషించింది.

## వందేమాతరంపై దేశవ్యాప్తంగా కార్యక్రమాలు

కాంగ్రెస్ నిర్ణయాన్ని ఖండిస్తూ బిజెపి తీర్మానం



**న్యూఢిల్లీ :** వందే మాతరం విషయంలో కాంగ్రెస్ 'బుజ్జగింపు రాజకీయాలకు' పాల్పడుతోందని బిజెపి శనివారం ఆరోపించింది. రాజ్యాంగం, పార్లమెంట్ చేసిన చట్టాల కంటే ఏ పార్టీ లేదా వ్యక్తి గొప్పవారు కాదని స్పష్టం చేసింది. వందేమాతరం గేయంలోని కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ బిజెపి ఓ తీర్మానాన్ని ఆమోదించింది. రాజకీయ ప్రయోజనాల కోసం లేదా బుజ్జగింపుల కోసం జాతీయ గేయం గౌరవం విషయంలో ఎలాంటి రాజీని అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఢిల్లీలో బిజెపి అధ్యక్షుడు నితిన్ నబిన్ అధ్యక్షతన జరిగిన పార్టీ నూతన పదాధికారుల సమావేశంలో ఈ మేరకు తీర్మానం ఆమోదించారు. వందేమాతరం ఘనమైన వారసత్వాన్ని దేశం నలుమూలలా వ్యాప్తి చేయడానికి ఒక భారీ ప్రచారాన్ని ప్రారంభిస్తామని బిజెపి పేర్కొంది. ఈ తీర్మానానికి సంబంధించిన వివరాలను నితిన్ నబీన్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. వందేమాతరాన్ని 'స్వచ్ఛమైన జాతీయ భావానికి, సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదంగా అభివర్ణించిన మహాత్మా గాంధీ ప్రకటనను పెద్దఎత్తున ప్రజల్లోకి తీసుకువెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఆరు చరణాలతో కూడిన సంపూర్ణ జాతీయ గేయాన్ని, వందేమాతరంతో ముడిపడిన దేశ స్వాతంత్ర్య పోరాట జ్ఞాపకాలను యువత అర్థం చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని నబీన్ వివరించారు.

## గూర్ఖా సమస్యపై మరో కమిటీ

మధ్యవర్తి పంకజ్ కుమార్ సింగ్ నేతృత్వం



**సిలిగురి :** పశ్చిమ బెంగాల్‌లో దశాబ్దాల కాలంగా కొనసాగుతున్న గూర్ఖా అంశం మరోసారి తెరపైకి వచ్చింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, గూర్ఖా నాయకులు, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం మధ్య శనివారం కీలక సమావేశం జరిగింది. పర్వత ప్రాంత ప్రజల దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత రాజకీయ పరిష్కారం కనుగొనడానికి ఒక కార్యాచరణ ప్రణాళికను రూపొందించడమే లక్ష్యంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి సువేందు అధికారి, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ఈ కొండ ప్రాంతానికి చెందిన ఇతర ముఖ్య ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశం అనంతరం బిజెపి ఎంపి రాజు బిస్తా మీడియాతో మాట్లాడుతూ గూర్ఖా సమస్యపై తుది ఒప్పందాన్ని రూపొందించడానికి కేంద్రం ఒక కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. 'మధ్యవర్తి పంకజ్ కుమార్ సింగ్ నాయకత్వంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక కమిటీ ఏర్పాటు చేశారు. నేటి ఒప్పంద ముసాయిదాను ఖరారు చేయడానికి ఈ కమిటీ కృషి చేస్తుంది' అని బిస్తా చెప్పారు. అక్టోబర్ 2025లో, ఈ సమస్య పరిష్కారం కోసం అధికారిక ప్రభుత్వ మధ్యవర్తిగా పదవీ విరమణ చేసిన ఐపిఎస్ అధికారి, మాజీ డిప్యూటీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ పంకజ్ కుమార్ సింగ్‌ను హోం మంత్రిత్వ శాఖ నియమించింది. రాజకీయ చర్చలకు నాయకత్వం వహించడం, గూర్ఖా వర్గం దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరించడంపై ఆయన పాత్ర కేంద్రీకృతమై ఉంటుంది. 1988లో గూర్ఖా ఒప్పందం కుదిరిన తేదీతో శనివారం నాటి సమావేశం ఏకీభవించడం వల్ల ఇది ఒక చారిత్రాత్మక రోజు అని డార్జిలింగ్ ఎంపి బిస్తా పేర్కొన్నారు. ప్రత్యేక 'గూర్ఖాలాండ్' రాష్ట్రం కోసం జరిగిన హింసాత్మక ఉద్యమం తర్వాత, కేంద్రం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, గూర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ (జిఎన్ఎల్ఎఫ్) మధ్య కుదిరిన ఆ ఒప్పందం 'డార్జిలింగ్ గూర్ఖా హిల్ కౌన్సిల్' (డిజిహెచ్‌సి) ఏర్పాటుకు దారితీసింది. 'పర్వత ప్రాంత ప్రజల పోరాట చరిత్ర నాలుగు దశాబ్దాలకు పైగా సాగింది; ఈ కాలంలో గతంలోని వామపక్ష, టిఎంసి ప్రభుత్వాలు అక్కడి ప్రజల ఆకాంక్షలను అణచివేశాయి. మా ప్రజలు చేసిన త్యాగాలలో దాదాపు 2,000 మంది ప్రాణాలు కోల్పోవడం, 5,000 మందికి పైగా నిరాశ్రయులవ్వడం, మహిళలు హింసకు, అత్యాచారానికి గురికావడం వంటివి ఉన్నాయి' అని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో వివిధ వర్గాల ప్రతినిధులు తమ ఆందోళనలను, అంచనాలను వెల్లడించగా, పర్వత ప్రాంత ప్రజల సమస్యలను ఎలా పరిష్కరించాలని భావిస్తున్నారో అధికారి కూడా వివరించారని బిస్తా తెలిపారు. 'అన్ని వర్గాల వాదనలు విన్న తర్వాత, రాబోయే రోజుల్లో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఎలా కనుగొంటారో వివరిస్తూ షా సమావేశాన్ని ముగించారు' అని ఆ ఎంపి తెలిపారు. డార్జిలింగ్ కొండ ప్రాంత వ్యవహారాలపై ఎన్నికలకు ముందు బిజెపి ఇచ్చిన హామీకి అనుగుణంగా, రాజ్యాంగ పరిధిలో ఉంటూనే అక్కడి దీర్ఘకాలిక సమస్యలకు శాశ్వత రాజకీయ పరిష్కారం కనుగొనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరుగుతుందని భావించారు. అమిత్‌షాతో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి అధికారితో పాటు గూర్ఖా జనముక్తి మోర్చా (జిజెఎం) అధినేత బిమల్ గురుంగ్, ఆ పార్టీ సీనియర్ నేత రోషన్ గిరి, జిఎన్ఎల్ఎఫ్ అధినేత మన్ ఘిసింగ్, కొండ ప్రాంతానికి చెందిన పలువురు రాష్ట్ర మంత్రులు, బిజెపి ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నిరసనల వలయంలో జార్ఖండ్



స్కూళ్లలో మౌలిక సదుపాయాల కోసం విద్యార్థులు, పరీక్షల రద్దు కోసం యువత, ఉపాధి కోల్పోతామన్న భయంతో ఉద్యోగులు నిరసనలు

రాంచి : జార్ఖండ్‌లో విద్యార్థులు, యువత, ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలతో అధికార యంత్రాంగం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. మొన్నటి వరకు నియామక పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, వాటిని రద్దు చేయాలని ఉద్యోగార్థులు నిరసనలు, నిరాహారదీక్షలు చేయగా, నేడు పరీక్షల రద్దు నోటిఫికేషన్లపై హైకోర్టు స్టే విధిస్తుండడంపై మరోసారి ఆందోళనకు దిగారు. ఇంకో వైపు పరీక్షల రద్దుతో భయాందోళనకు గురవుతున్న ఉద్యోగాలు సచివాలయం ఎదుట నిరసనలు చేస్తున్నారు. తాజాగా పాఠశాలల్లో సరైన వసతులు లేవంటూ విద్యార్థులు ర్యాలీలు చేస్తున్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల్లోనూ అసహనం పెల్లుబికింది. కాగా, తమ ప్రధాన డిమాండ్ అయిన పరీక్షల రద్దు నిర్ణయాన్ని హైకోర్టులో సమర్థవంతంగా సమర్థించుకోవడంలో విఫలమై, హేమంత్ సోరెన్ ప్రభుత్వం తమను మోసం చేసిందని నిరసనకారులు ఆరోపించారు. ఈ ఆందోళనకారులకు బిజెపి మద్దతు ప్రకటించింది మరియు విద్యార్థుల సంక్షేమం విషయంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారని విమర్శించింది. మరోవైపు, బిజెపి తన రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను వాడుకుంటోందని అధికార జెఎంఎం ఆరోపించింది. జార్ఖండ్ నియామక పరీక్షలలో అవకతవకలపై 26 రోజుల పాటు సాగిన ఆందోళనను, 22 ఉద్యోగ పరీక్షలను రద్దు చేస్తూ, మరో 23 పరీక్షలపై విచారణకు ఆదేశిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సద్దుమణిగేలా చేసింది. అయితే, ఈ నిర్ణయం పరీక్షల్లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుండి మరో నిరసనకు దారితీసింది. ఉద్యోగం కోల్పోతామనే భయంతో వారిలో చాలామంది హైకోర్టును ఆశ్రయించారు. వారి అభ్యర్థనలను విచారించిన జార్ఖండ్ హైకోర్టు, నియామక పరీక్షలను రద్దు చేస్తూ జారీ చేసిన పలు ప్రభుత్వ నోటిఫికేషన్లపై స్టే విధించింది. దీంతో పరీక్షల రద్దును వ్యతిరేకిస్తున్న వారిలో అసహనం పెరిగింది. ఈ ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న జెపిఎస్‌సి జెఎస్ఎస్‌సి రిఫార్మ్స్ మంచ్ సభ్యులు శుక్రవారం ఇక్కడి జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహించారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. హజారీబాగ్, గిరిడ్డీలలో కూడా ఇలాంటి నిరసనలే జరిగాయి.

**పాఠశాల విద్యార్థుల ర్యాలీ**

ఇదిలా ఉండగా, కోడెర్మాలోని కస్తూర్బా గాంధీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో నెలకొన్న అవకతవకలు, అధ్వాన్నమైన మౌలిక సదుపాయాలకు నిరసనగా, సుమారు 300 మంది విద్యార్థినులు శుక్రవారం బ్లాక్ కార్యాలయాన్ని ముట్టడించారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ విద్యార్థులు సత్గవాన్ బ్లాక్ కార్యాలయం వరకు దాదాపు 8 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్ర సందర్భంగా పలువురు విద్యార్థినులు స్పృహ కోల్పోవడంతో, వారిని వైద్య చికిత్స కోసం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించినట్లు సమాచారం. పాఠశాలలోని వివిధ సమస్యలపై విద్యార్థులు పదేపదే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 15న వారు పాఠశాల ప్రాంగణంలో నిరసన చేపట్టగా, అనంతరం బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (బిడిఒ) మనోజ్ కుమార్ రవి, స్థానిక ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు పాఠశాలను సందర్శించారు. అయితే, వారం గడిచినా ఎలాంటి నిర్దిష్ట చర్యలు తీసుకోకపోవడంతో విద్యార్థులు నిరాశకు గురయ్యారు. దీంతో వారు బ్లాక్ కార్యాలయాన్ని ముట్టడించి తమ నిరసనను పునఃప్రారంభించారు. నాసిరకం ఆహారం, విద్యా వ్యవస్థ దుస్థితిపై ఆగ్రహించిన విద్యార్థులు, 'విద్య మా హక్కు, మా హక్కులను సాధించుకోవాలని పిల్లలం నిశ్చయించుకున్నాం' వంటి నినాదాలు చేస్తూ, ప్లకార్డులు పట్టుకుని బ్లాక్ హెడ్ క్వార్టర్స్ వరకు ర్యాలీగా వెళ్లారు. పాఠశాలలో తగినంత మంది ఉపాధ్యాయులు, పారిశుధ్య సిబ్బంది, తాగునీటి సౌకర్యాలు వంటి ప్రాథమిక సౌకర్యాల కొరత ఉందని విద్యార్థిని రాధికా కుమారి ఎత్తి చూపింది. విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో జిల్లా విద్యాధికారి ముకుల్ రాజ్ బ్లాక్ కార్యాలయానికి చేరుకుని, విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు. పాఠశాలలోని లోపాలను త్వరలో సరిదిద్దుతామని, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఆ హామీతో, విద్యార్థులు తమ పాఠశాలకు తిరిగి వెళ్లారు.

## రాహుల్ నివాసం వద్ద సిక్కులు ఆందోళన

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ నివాసం ముందు హైడ్రామా నడిచింది. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల కుటుంబ సభ్యులు, పలువురు సిక్కు నాయకులు నిరసనకు దిగారు. కాంగ్రెస్ పార్టీ మాజీ నేత సజ్జన్ కుమార్‌ను కొందరు కాంగ్రెస్ నాయకులు హీరో, ఆదర్శప్రాయుడు' (రోల్ మోడల్) అని అభివర్ణించడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన కేసులో దోషిగా తేలిన సజ్జన్ కుమార్ గురువారం మృతి చెందిన విషయం విదితమే. కాగా, ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ (డిఎస్‌జిఎంసి) అధ్యక్షుడు హర్మీత్ సింగ్ కాల్కా, ప్రధాన కార్యదర్శి జగదీప్ సింగ్ కహ్లోన్ నాయకత్వంలో నిరసనకారులు, భారీ పోలీసు బారికేడ్ల మధ్య రాహుల్ గాంధీ నివాసం 5, సునేహ్రి బాగ్ రోడ్ వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసుల్లో దోషిగా తేలిన సజ్జన్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ నిజంగానే 'హీరో'గా భావిస్తోందా లేదా అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిఎస్‌జిఎంసి నాయకుడు ఒకరు డిమాండ్ చేశారు. 'సజ్జన్ కుమార్ మరణం తర్వాత, ఆయన మా హీరో అని కాంగ్రెస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమైనవి. సజ్జన్ కుమార్ తమ హీరోనా కాదా అనే విషయంపై రాహుల్ గాంధీ ఈ రోజే స్పష్టత ఇవ్వాలి' అని ఆ నాయకుడు అన్నారు. కాంగ్రెస్ నాయకుడు దీపేందర్ సింగ్ హుడా చేసిన వ్యాఖ్యను ప్రస్తావిస్తూ, సిక్కు సమాజానికి రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని డిఎస్‌జిఎంసి నాయకుడు డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం నిరసనకారులు భారీగా తరలిరావడంతో పోలీసులు రాహుల్ నివాసం చుట్టూ భారీ బారికేడ్లను ఏర్పాటు చేశారు.

## ఇరాక్ చమురు ట్యాంకర్లకు ఇరాన్ అనుమతి

**టెహ్రాన్:** హోర్ముజ్ జలసంధిలో రాకపోకలను నిలిపివేసినప్పటికీ ఇరాక్ చేసిన అనేక అభ్యర్థనల తర్వాత జలసంధిలో కీలకమైన అనేక చమురు ట్యాంకర్లు ప్రయాణం చేసేందుకు ఇరాన్ పాలకులు అంగీకరించారు. తమ చమురు ట్యాంకర్లను అనుమతించాలని అనేక విధాలుగా ఇరాక్ బ్రతిమిలాడుకున్న తర్వాత ఎట్టకేలకు ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ఆ దేశ చమురు ట్యాంకర్లు జలసంధిలో ప్రయాణించేందుకు ఒప్పుకున్నాయి.ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ గురువారం బాగ్దాద్‌లో పర్యటించి ఆ దేశ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ చమురు ట్యాంకర్లను జలసంధిలో రవాణాకు అనుమతించాలని ఇరాక్ నాయకులు కోరారు. తమ విజ్ఞప్తిని ఇరాన్ నాయకులు అంగీకరించారని ఇరాక్ అధ్యక్షుడు నిజార్ అమిది 'బాగ్దాద్ డైలాగ్ పాలసీ కాన్ఫరెన్స్'లో శనివారంచెప్పారు. టర్కీ,సిరియా,జోర్డాన్ ఓడరేవుల నుండి చమురు ఎగుమతులు చేయడానికి తమ దేశం కృషి చేస్తోందని ఇరాక్ ప్రధానమంత్రి అలీ అల్–జైదీ చెప్పారు.
జలసంధిని గడచిన మార్చి నుండి మూసివేయడంవల్ల ఇరాక్ చమురు ఎగుమతులు తీవ్రస్థాయిలో దెబ్బతిన్నాయి. యుద్ధానికి ముందు రోజుకు 140 నౌకలు హోర్ముజ్ జలసంధిలో ప్రయాణం చేసేవి. కానీ ఈ ఆంక్షలు ఐఆర్‌జిసి అమలు చేయడంవల్ల,అక్రమ మార్గాల్లో వెళుతున్న నౌకలపై క్షిపణి–డ్రోన్ దాడులు చేయడంవల్ల రోజుకు 11 నౌకలు మాత్రమే ప్రయాణం చేసే పరిస్థితి వచ్చింది.

## అమెరికా వైఖరితో విఫలమైన కెనడా చర్చలు

- ఒప్పందం చివరి నిమిషంలో మార్పులు అన్యాయం
- డాలర్‌కి డాలర్ సుంకం విధిస్తాం: కెనడా ప్రధాని కార్నీ

**ఒట్టావా:** కెనడాపై అమెరికా విధించిన భారీ సుంకాల సమస్యపై చర్చలు విఫలమయ్యాయి.దీంతో విస్తారంగా కెనడా నుండి దిగుమతయ్యే అనేక రకాల వస్తువులపై 50 శాతం అమెరికా సుంకాలు శనివారం నుండీ అమలులోకి వచ్చాయి.కెనడా కూడా అమెరికాపై భారీస్థాయిలో ప్రతీకారంగా సుంకాలు విధించేందుకు సిద్ధమైంది. చర్చల చివరి నిమిషంలో ఒప్పందాలలో అమెరికా ప్రతినిధులు చేసిన మార్పులను కెనడా తీవ్రంగా ప్రతిఘటించింది. చివరి నిమిషంలో ఒప్పందంలో మార్పులు అన్యాయం, ఆర్థిక అంశాలకు సంబంధంలేనివి, అంతేకాకుండా ఏ ఒప్పంద విశ్వసనీయతనైనా ఈ నిబంధనలు పశ్నించేవిగా ఉన్నాయని కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నీ విమర్శించడంతో ఆ దేశ ప్రతినిధులు చర్చల నుండి వైదొలగారు. తమ దేశీయ మార్కెట్లలోకి ప్రవేశించే కెనడా వస్తువులకు ఎవ్వరికీ ఇవ్వనంత ప్రాధాన్యత ఇస్తామని ట్రంప్ ప్రభుత్వం భరోసా ఇచ్చినప్పటికీ కెనడా తిరస్కరించింది. 1930 నాటి సుంకాల చట్టం కింద విధించిన ఈ 50 శాతం టారిఫ్‌లతో కెనడాకు తీవ్ర నష్టం వాటిల్లనున్నది.



సుంకాలు తగ్గించాలని కోరుతూ అమెరికాతో కెనడా ప్రతినిధులు చేస్తున్న చర్చలు చివరి నిమిషంలో స్తంభించిపోయాయి. 20 బిలియన్ల విలువైన వస్తువులపై 50 శాతం సుంకాలు అమలులోకి తెస్తున్నట్లు అమెరికా పేర్కొంది. అమెరికా విధించే ప్రతి డాలరు సుంకానికీ ప్రతిగా తాము కూడా ఒక డాలరు సుంకం అమెరికా నుండి కెనడాకు వచ్చే దిగుమతులపై విధిస్తామని మార్క్ కార్నీ ప్రకటించారు. చర్చల్లో ఆ దేశం తరపున పాల్గొన్న ప్రధాన ప్రతినిధి జమైసన్ గ్రీర్ మాట్లాడుతూ, వారంరోజుల క్రితం అంగీకరించిన నిబంధనల ప్రకారం ఒప్పందం ఖరారు చేసుకునేందుకు తిరస్కరించారు. చర్చల నుండి వైదొలగుతున్నట్లు శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత ప్రకటించారు. ఆగస్టు 19వ తేదీ రాత్రి దాటాక 50 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ రెండు నెలలక్రితమే ప్రకటించారు. దీంతో జులై నుండీ ఇరు దేశాల ప్రతినిధులమధ్యా చర్చలు జరుగుతున్నాయి. అమెరికాకు అనుకూలంగా ఒక మంచి వాణిజ్య ఒప్పందానికి ఇరు దేశాల ప్రతినిధులు దగ్గరగా ఉన్నారని ప్రకటించిన ట్రంప్ సుంకాల అమలు తాత్కాలికంగా నిలిపివేశారు. గడువు ముగియడానికి కొద్దిసేపటి ముందు చర్చల్లో పురోగతి కనిపించినప్పటికీ, ఈ ఒప్పందం కెనడా ప్రజల ప్రయోజనాలు నెరవేర్చబోదని మార్క్ కార్నీ చెప్పడంతో ప్రతినిధులు చర్చల నుండి వైదొలగారు.
గత ఏడాది జనవరిలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటికే దశాబ్దాలుగా వివిధ దేశాలతో అమలులో ఉన్న సుంకాల వ్యవస్థను తలక్రిందులు చేశారు. అనేక దేశాలతో వ్యాపారం చేస్తున్నప్పటికీ తమ దేశానికి అన్యాయం జరుగుతోందని, ఇతర దేశాలు భారీఎత్తున తమ డాలర్లు తీసుకుపోతున్నాయని, వారు చాలా చాలా తక్కువ సుంకాలు చెల్లించి ఎక్కువ డాలర్లు తిరిగి తీసుకుంటున్నారని, ప్రతిదేశంతో సమానస్థాయిలో దిగుమతి సుంకాలను అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించిన తర్వాత అమెరికా దిగుమతి సంకాల ఆదాయం గణనీయంగా పెరిగింది.



## ట్యునీషియాలో వామపక్ష ప్రజా ప్రదర్శనలు

### దేశంలో దాహం, అంధకారం, ధరల విపత్తు

**ట్యునీస్:** ఉత్తర ఆఫ్రికా మెఘుర్బా ప్రాంత దేశం ట్యునీసియాలో ప్రజలను తీవ్ర నీటి కొరత వెంటాడుతోంది.దీంతోపాటు విద్యుత్ కోతలు, ధరల పెరుగుదల, గణనీయస్థాయిలో క్షీణించిపోయిన ప్రజల కొనుగోలు శక్తి,నిత్యావసర వస్తువుల కొరత, ఆదాయలేమి వంటి సమస్యలు ట్యునీషియన్లను వెంటాడుతున్నాయి. కొద్ది నెలలుగా ఈ సమస్య ఉద్ధృత రూపం దాల్చింది. దీంతో దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో వందలమంది ప్రజలు వీధులలోకి వచ్చి ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తున్నారు. ప్రతిపక్షంగా ఉన్న వామపక్ష నాయకులు సహా పలు సంస్థలు, సంఘాలు ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నాయి. ట్యునీషియా విపత్కర పరిస్థితుల్లో చిక్కుకుందని, ఈ పరిస్థితుల్లో తాము అండగా నిలబడతామని వామపక్షాలకు చెందిన ప్రతిపక్ష నాయకుడు ఎజెద్దీన్ హాజ్జీ చెప్పారు. దేశాన్ని ఎంతమాత్రం పట్టించుకోని వ్యక్తి పరిపాలన సాగిస్తున్నాడని దేశాధ్యక్షుడు కైస్ సయీద్‌పై మండిపడ్డారు. దేశాధ్యక్షుడు ఇప్పటికే అనేక మందిపై ఉగ్రవాద ముద్ర వేసి జైళ్ళకు తరలించారు.
నీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. దేశ అధ్యక్షుడు కైస్ సయీద్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశంలో విపరీతంగా పెరిగిపోయిన విద్యుత్ కోతలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజలు దాహంతో అల్లాడిపోతున్నారని, విద్యుత్ కోతలవల్ల అంధకారంలో మగ్గిపోతున్నారని వారు నినాదాలు చేశారు. "దాహం–అంధకారం" అంటూ ప్రదర్శకులు సర్వత్రా ప్లకార్డులు ప్రదర్శించారు. ఒకవైపు దేశంలో తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదవుతున్నారు. ఈ స్థితిలో నీటి కొరత ప్రజలను భయపెడుతోంది. "ట్యూనిష్ ప్రజలు అవమానాలమధ్య బ్రతుకుతున్నారు, వారికి నీరు లేదు, విద్యుత్ సరఫరాలేదు, స్వేచ్ఛలేదు..." అని మాజీ ప్రజాప్రతినిధి సమీర్ బెన్ అమోర్ విమర్శించారు.అదేవిధంగా రాజకీయ ఖైదీలను విడుదల చేయాలని కూడా డిమాండ్ చేశారు. ట్యునీషియన్ ఫోరం ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ రైట్స్ చెప్పిన సమాచారం ప్రకారం, ఇటీవలి వారాల్లో ట్యునీషియా దేశవ్యాప్తంగా వందలకొద్దీ నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. వీటిల్లో ఎక్కువగా నీటి కొరత పరిష్కారం, విద్యుత్ సరఫరా కోసమే.

## చర్యలు (మొదటి పేజీ తరువాయి)

చర్చించినట్లు ఆయన వెల్లడించారు. సమావేశం అనంతరం కమిటీ వైస్ చైర్మన్ ఎ.శ్యామ్ మోహన్‌తో కలిసి మల్లు రవి మీడియాతో మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ ఇచ్చిన వివరణను, కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను కమిటీ పరిశీలించిందని, ఈ వ్యవహారంపై చాలా మంది నాయకులు ఫిర్యాదులు చేస్తున్నారని, అందరి ఫిర్యాదులు అందిన తర్వాత పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి వెల్లడించారు. సొంత కూతురు చేసిన వ్యాఖ్యలను కనీసం మంత్రిగా ఖండించాల్సిన బాధ్యత కొండా సురేఖపై ఉందని, అయితే సహజ న్యాయ సూత్రాల ప్రకారం తనకు ఆ వ్యాఖ్యలతో సంబంధంలేదని చెబుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విషయంలో పార్టీ క్రమశిక్షణ కమిటీ నిబంధనల ప్రకారం ముందుకెళ్తుందని మల్లు రవి తెలిపారు. రాజగోపాల్‌రెడ్డిపై ఇప్పటివరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఈ అంశాన్ని సుమోటోగా తీసుకోవాలా? లేదా? అనే విషయాన్ని కమిటీ పరిశీలిస్తున్నదని చెప్పారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను కూడా పరిశీలించామని మల్లు రవి తెలిపారు. ఆయనపై ఎమ్మెల్యే మేగారెడ్డి ఫిర్యాదు చేశారని, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణను కూడా కమిటీ పరిశీలించిందన్నారు. ఫిర్యాదు చేసిన మేగారెడ్డిని మరోసారి పిలిచి వివరణ తీసుకున్న అనంతరం నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. ఆదిలాబాద్‌లో జరిగిన పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి, సంజీవ రెడ్డిల మధ్య జరిగిన వివాదంపై ఇప్పటికే షోకాజ్ నోటీసులు ఇచ్చామని తెలిపారు. జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసిన తర్వాత ఎల్‌బి నగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసిన మధు యాష్కిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు గాంధీ భవన్ వేదికగా తన అనుచరులతో గొడవకు దిగినందుకే ఆయనపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపారు.

## అమెరికా ఆర్థిక ఆంక్షలను దీటుగా ఎదుర్కొంటాం

ఇరాన్ స్పీకర్ ఘాలిబాఫ్
పాతకాలపు వలసవాదం తిరిగొచ్చినటే: బఖాయీ హెచ్చరిక
ఒప్పందానికి వాళ్ళు సిద్ధంగా లేరు: ట్రంప్

**టెహ్రాన్:** అమెరికా ఆర్థిక–వాణిజ్య ఆంక్షలు దీటుగా ఎదుర్కొంటామని ఇరాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బఘేర్ ఘాలిబాఫ్ చెప్పారు. ఇరాన్ పేరు వింటేనే శత్రువులు భయపడేవిధంగా దేశాన్ని తీర్చిదిద్దుతామని ఇరాన్ సర్వాధినేత ప్రధాన సైనిక సలహాదారు మేజర్ జనరల్ యాహ్యా రహీమ్ సఫవి హెచ్చరించారు. ఈ ఆంక్షలు సరిహద్దులకు అతీతంగా ప్రతి సార్వభౌమాధికార దేశాన్నీ సవాలు చేయడమేనన్నారు. ఇరాన్ రక్షణ పరిశ్రమ దినోత్సవం సందర్భంగా పలువురు ఇరాన్ నాయకులు స్పందించారు.
దేశ సైనిక బలాన్ని పెంపొందించుకోవాలన్న జాతీయ సంకల్పానికి ఈ రక్షణ పరిశ్రమ దినోత్సవం ఒక ప్రతీక అని సఫవి చెప్పారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన ఆయుధ సామర్థ్యం ద్వారా సైన్యాన్ని బలోపేతం చేస్తామన్నారు.ఇరాన్ విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ స్పందిస్తూ, ఇరాన్‌పై ట్రంప్ ప్రకటించిన ఆర్థిక ఆంక్షలు ఐక్యరాజ్యసమితి ఛార్టర్ 2(1)లోని సార్వభౌమాధికార సమానత్వ సూత్రాలను ఉల్లంఘించడమేనన్నారు.ప్రపంచంలో అన్నిదేశాలను సరిహద్దులకు అతీతంగా సవాలు చేయడమేనని విమర్శించారు.ఈ ఉల్లంఘనతో పాతకాలపు వలసవాదాన్ని తిరిగి ప్రవేశపెట్టినట్టేనని విమర్శించారు. ఎక్స్‌వేదికగా పోస్టింగ్ పెడుతూ, ట్రంప్ ఆర్థిక ఆంక్షలు ఐక్యరాజ్యసమితిలో సభ్యులుగా ఉన్న ప్రతిదేశంపైనా అమెరికా తన సార్వభౌమాధికారాన్ని ప్రకటించినట్లే కాగలదని పేర్కొన్నారు.ప్రతి సార్వభౌమాధికార దేశానికీ ప్రత్యేక అధికార పరిధి ఉంటుందని, వాటి బ్యాంకులు,విమానాశ్రయాలు,సంస్థలపై మూడోదేశం ఒత్తిడి తీసుకురాకూడదన్నారు. ఈ విధమైన ఆంక్షలకు అంతర్జాతీయ చట్టాలలో ఎలాంటి అధికారాలు లేవన్నారు.ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ స్పందిస్తూ, అమెరికాపై ఇరాన్ ఆధిపత్యస్థానంలో ఉన్నందువల్ల యుద్ధం ముగించేందుకు ఇదే సరైన తరుణమని అన్నారు. యావత్ ప్రపంచం ఇరాన్ విజయాన్ని ఆమోదించిందన్నారు.



అదేసమయంలో డోనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ, అమెరికాకు అనుకూలంగా 'సరైన ఒప్పందం' చేసుకోవడానికి ఇప్పటికీ ఇరాన్ సిద్ధంగా లేదన్నారు. చరిత్రలో ఏ దేశంమీదా ఇంతవరకూ ప్రయోగించని కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నామని, దీంతోపాటే సైనిక చర్యల ప్రత్యామ్నాయాన్ని కూడా తాము వదులుకోలేదని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఏం పరిణామాలు సంభవిస్తున్నాయో అమెరికా జాగ్రత్తగా గమనిస్తోందని అన్నారు. ''ప్రస్తుతం మేం అన్నీ గమనిస్తున్నాం, అంతే'' అన్నారు. ఇరాన్‌కు ఏ విధమైన జీవనాధారాన్ని అందించకూడదని ట్రంప్ ఆంక్షలు విధించారు. ఏదో ఒక మార్గంలో ఇరాన్‌కు జీవనాధారం అందించే, ఆ దేశంతో సంబంధాలు కొనసాగించే దేశాలు కూడా తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటాయని కూడా ఆయన మూడు రోజులక్రితం హెచ్చరించారు. ఈ ఆంక్షలకు సంబంధించిన ప్రణాళికాబద్ధమైన నిబంధనలను సోమవారం (ఆగస్టు 24) ప్రకటిస్తామని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ చెప్పారు. హోర్ముజ్ జలసంధికి సంబంధించిన మొత్తం ప్రాంతంపైన,దాని లోపలి భాగాలపైన కూడా అమెరికా సైనిక బలగాలు సెంట్‌కామ్‌కు నియంత్రణ ఉందని, అందువల్ల ఇరాన్ అనివార్యంగా తమతో ఒక ఒప్పందం చేసుకోవడానికి ముందుకు రావాల్సి ఉందని, కానీ వారు అందుకు సిద్ధంగా లేరని అన్నారు.
ఇదే సమయంలో హోర్ముజ్ జలసంధిలో అమెరికా ఆధిపత్యాన్ని తిరస్కరిస్తూ ప్రాంతీయ దేశాల సహకారాన్ని కూడగడుతోంది. ఒమన్‌తో మధ్యలో ఆగిపోయిన చర్చలు పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. హోర్ముజ్ జలసంధిని ఒమన్‌తో కలిసి నిర్వహించాలని, కొత్తగా ప్రధాన జలమార్గాలను ఏర్పాటు చేయాలని ఇరాన్–ఒమన్‌లు ఇంతకుముందు జరిపిన చర్చల్లో నిర్ణయించాయి. ఈ ప్రయత్నాలను ముందుకు తీసుకువెళ్ళేందుకు ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీ శనివారం ఒమన్ విదేశాంగమంత్రి సయ్యద్ బద్ర్ అల్–బుసైదీతో ఫోన్‌లో సంభాషించారు. హోర్ముజ్ జలసంధిలో పరిస్థితి, ప్రాంతీయ పరిణామాలు, చర్చలు పునఃప్రారంభానికి అనువైన సమయం గురించి చర్చించారు. హోర్ముజ్ జలసంధి నిర్వహణలో ఇరాన్‌తో చేతులు కలిపితే మిత్రదేశమని కూడా చూడకుండా దాడులు చేస్తామని అమెరికా ఇప్పటికే ఒమన్‌కు ఒక హెచ్చరిక చేసింది.

## 'నిర్మల్' పర్యాటకం!

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధి హామీలు కేవలం నీటిమూటలవుతున్నాయి. అపారమైన పర్యాటక అవకాశాలు ఉన్నప్పటికీ, వాటిని సద్వినియోగం చేసుకుని జిల్లాకు ఆదాయం, నిరుద్యోగులకు ఉపాధి కల్పించడంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.
దక్షిణ భారతదేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ ఆలయం. నిత్యం వేలాది మంది భక్తులు తమ చిన్నారుల అక్షరాభ్యాసం కోసం ఇతర రాష్ట్రాల నుంచి సైతం ఇక్కడికి తరలివస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న క్షేత్రంలో భక్తులకు కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. స్వచ్ఛమైన తాగునీరు, తగినన్ని విశ్రాంతి గదులు, పరిశుభ్రమైన శౌచాలయాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి నది తీరంలో స్నానఘట్టాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. మాస్టర్ ప్లాన్ పేరుతో ఎన్నో ఏళ్లుగా ఆర్భాటపు ప్రకటనలు చేస్తున్నా, క్షేత్రస్థాయిలో జరిగిన అభివృద్ధి శూన్యం.
నిర్మల్ పట్టణానికి తలమానికంగా నిలిచే చారిత్రక నిర్మల్ కోట (శ్యామ్‌గఢ్) పరిస్థితి దయనీయంగా మారింది. ఫ్రెంచ్ ఇంజనీర్ల సహకారంతో ఎంతో వ్యూహాత్మకంగా నిర్మించిన ఈ కోట నేడు పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి శిథిలావస్థకు చేరుకుంది. పర్యాటకులకు కనీస భద్రత, రాత్రివేళ లైటింగ్, గైడ్ల సదుపాయం లేకపోవడంతో ఈ అరుదైన చారిత్రక సంపద ఆకతాయిలకు అడ్డాగా మారుతోంది. స్వాతంత్ర్య సమరంలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచిన నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ 'వెయ్యిగూడల మర్రి' ప్రాంతం నేడు పాలకుల ఘోర నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారింది. బ్రిటిష్ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాట బాట పట్టిన వీరుడు రాంజీ గోండ్ తో పాటు ఆయనతో పోరాడిన 1,000 మంది విప్లవకారులను ఆంగ్లేయులు ఒకే మర్రిచెట్టుకు ఉరి తీసిన అత్యంత వీరోచిత, విషాదభరితమైన పోరాట చరిత్ర ఈ నేలకు ఉంది. దేశ చరిత్రలోనే మరే ప్రాంతంలోనూ లేని ఇటువంటి వీర గాథలు ఉన్నప్పటికీ, ఈ ప్రాంతాన్ని కనీసం ఒక ప్రాధాన్య పర్యాటక స్మారక కేంద్రంగా అభివృద్ధి చేయకపోవడం అధికారుల, పాలకుల అలసత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. మరో వైపు, వందల ఏళ్ల ఘన చరిత్ర కలిగిన, అంతర్జాతీయ ఖ్యాతి గడించిన నిర్మల్ కొయ్య బొమ్మలు, నమూనా పెయింటింగ్స్ కళ కూడా ప్రభుత్వ ప్రోత్సాహం లేక మరుగున పడుతోంది. కళాకారులకు ముడిసరుకైన పొనికి కర్రల కొరత, సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో వారు ఉపాధి కోల్పోయి ఆర్థికంగా చితికిపోతున్నారు. క్రాఫ్ట్ విలేజ్ ఏర్పాటు హామీ ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైంది.

### ప్రకృతి రమణీయతకు గ్రహణం..

జిల్లాలోని కడెం ప్రాజెక్ట్, పురాతన సదర్మత్ ఆనకట్ట వంటివి ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామా లు. దట్టమైన అటవీ ప్రాంతం, కొండల నడుమ ఉండే కడెం ప్రాజెక్టు వద్ద గతంలో సందడిగా ఉండే పర్యాటక శాఖ బోటింగ్ సౌకర్యం ఇప్పుడు పూర్తిగా నిలిచిపోయింది. అక్కడ ప ర్యాటకుల కోసం నిర్మించిన కాటేజీలు నిర్వహ ణ లేక పాడైపోయాయి. అద్దాలు పగిలి, తలుపులు విరిగిపోయి భూత్‌బంగ్లాలను తలపిస్తున్నాయి. పర్యాటకులు బస చేయడానికి కనీస వసతులు లేవు. ఇంజనీరింగ్ అద్భుతమైన పురాతన సదర్మత్ ఆనకట్ట వద్ద కూడా ఎలాంటి సుందరీకరణ పనులు చేపట్టలేదు. ఇక మమడ మండలంలోని ప్రకృతి రమణీయమైన వాస్తవపూర్ జలపాతానికి వెళ్లేందుకు కనీసం సరైన అప్రోచ్ రోడ్డు కూడా లేదు. సరైన రవాణా మార్గం లేక పర్యాటకులు అష్టకష్టాలు పడి ఆ ప్రాంతానికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.
ఏటా బడ్జెట్‌లో పర్యాటక రంగానికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నా, నిర్మల్ జిల్లాకు మాత్రం ఆ నిధులు కానరావడం లేదు. జిల్లాకు మంజూరైన పర్యాటక నిధులు దారి మళ్లుతున్నాయా లేక అధికారుల నిర్లక్ష్యంతో వెనక్కి పోతున్నాయా అన్నది స్పష్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు. పర్యాటక రంగానికి గత ఐదేళ్లలో విడుదలైన నిధులు, జరిగిన ఖర్చులపై తక్షణమే పారదర్శకంగా శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. బాసర ఆలయం, కడెం ప్రాజెక్ట్, వాస్తవపూర్ జలపాతం వద్ద యుద్ధప్రాతిపదికన మౌలిక వసతులు, అప్రోచ్ రోడ్లు నిర్మించాలని, కడెంలో బోటింగ్ పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే శ్యామ్‌గఢ్ కోటతో పాటు వెయ్యిగూడల మర్రి ప్రాంతాన్ని పురావస్తు శాఖ ఆధ్వర్యంలో పటిష్టంగా సంరక్షించి, పర్యాటకులను ఆకట్టుకునేలా సుందరీకరించాలని, నిర్మల్ కొయ్య బొమ్మల కళాకారులను ఆదుకునేందుకు వెంటనే క్రాఫ్ట్ విలేజ్ ఏర్పాటు చేసి వారికి ఆర్థిక భరోసా కల్పించాలని జిల్లా ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

## కుప్పకూలింది

(మొదటి పేజీ తరువాయి)

స్థానికులు, హాస్టల్ విద్యార్థులు భయాందోళనతో పరుగులు తీశారు. అంజయ్య నగర్‌లోని అత్యంత ఇరుకైన 50 గజాల స్థలంలో నాలాను ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా ఈ భారీ భవనాన్ని నిర్మిస్తున్నారు. శనివారం పనులు జరుగుతుండగా భవనం ఒక్కసారిగా పక్కకు వాలి కూలిపోయింది. ఈ ప్రమాదంలో మధ్యప్రదేశ్‌కు చెందిన ఉమేశ్ కారె, మోపత్ అనే ఇద్దరు కార్మికులు మృతిచెందగా, రమణారెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పక్కనున్న అపార్ట్‌మెంట్‌పై శిథిలాలు పడటంతో అందులోని ఇద్దరు వృద్ధుల కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న తెలంగాణ ఫైర్ అండ్ డిజాస్టర్ రెస్పాన్స్, హైడ్రా, డిఆర్‌ఎఫ్, పోలీస్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. విక్టిమ్ లొకేషన్ కెమెరా సాయంతో శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించి, ఇద్దరి మృతదేహాలను వెలికితీసి పోలీసులకు అప్పగించారు. మరింత మంది శిథిలాల కింద ఉన్నారేమోనని తనిఖీలు కొనసాగించారు. ప్రభావిత భవనాల్లో నివాసితులు రాత్రి సమయంలో ఉండవద్దని, సిఎంసి స్థిరత్వ పరీక్ష అనంతరమే తిరిగి వెళ్లాలని అధికారులు సూచించారు.

### అక్రమ నిర్మాణంపై ఆగ్రహం

ఘటనా స్థలిని పరిశీలించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ మీడియాతో మాట్లాడుతూ 50 గజాల్లో ఏడు అంతస్తులతో పాటు పెంట్‌హౌస్ కూడా నిర్మిస్తున్నారని, సెట్‌బ్యాక్‌లు వదలలేదని తెలిపారు. నాలాను ఆక్రమించి యథేచ్ఛగా భవనాలు కడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంజయ్యనగర్‌లో ఇలాంటి అక్రమ నిర్మాణాలు అనేకం ఉన్నాయని, వాటన్నింటిని తొలగిస్తామని, ప్రత్యేక డ్రైవ్ చేపడతామని ప్రకటించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన మాట్లాడుతూ ఈ నిర్మాణంపై గతంలోనే ఫిర్యాదులు అందాయని, నాలుగు నెలల క్రితమే పనులను సీజ్ చేశామని, అయితే బిల్డర్ శుక్రవారం మళ్లీ పని ప్రారంభించాడని చెప్పారు. శనివారం నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతుండగానే ప్రమాదం జరిగిందని తెలిపారు. హాస్టల్ కోసం ఈ భవనాన్ని నిర్మిస్తున్నారని, భవన యజమాని ఇంకా అందుబాటులోకి రాలేదన్నారు. ఈ నిర్మాణం చేపట్టిన బిల్డర్ సాజిద్ (స్థానికులు ఖాజాగా కూడా పేర్కొంటున్నారు) కోసం పోలీసులు గాలిస్తున్నారు.

### పునరావృతమవుతున్న ప్రమాదాలు

ఇదే అంజయ్యనగర్‌లో రెండేళ్ల క్రితం ఐదంతస్తుల భవనం ఒరిగిన సంఘటన ఉంది. సమీపంలోని సిద్ధిఖి నగర్‌లో ఏడాదిన్నర క్రితం జి ప్లస్ 4 భవనం వంగిపోవడంతో అధికారులు దానిని పూర్తిగా కూల్చివేశారు. అంతకుముందు మార్చిలో టోలిచౌకిలో నిర్మాణంలో ఉన్న భవనం స్లాబ్ కూలి ఇద్దరు మృతిచెందిన ఘటన కూడా తాజాగా చర్చకు దారితీస్తోంది.

## లండన్ వర్సిటీ

(మొదటి పేజీ తరువాయి)

సమావేశం నిర్వహించింది. తెలంగాణ ప్రతినిధి బృందం రాష్ట్రంలో విద్య, పరిశోధన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో విస్తృతంగా చర్చించింది. ఈ సమావేశం సందర్భంగా తెలంగాణ అధికారుల బృందం హైదరాబాద్‌లో ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలకు అందుబాటులో ఉన్న అవకాశాల గురించి వివరించింది. ఈ సందర్భంగా కేంబ్రిడ్జ్ జడ్జ్ బిజినెస్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ జైదీప్ ప్రభు, వెంకట్ సిరీష్ గండికోట తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలపై వారు సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో విద్యా కార్యక్రమాలు, సంయుక్త పరిశోధన, యువ పారిశ్రామికవేత్తల ఇన్క్యుబేషన్, స్టార్టప్ల అభివృద్ధిలో సహకారం కోసం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంతో తెలంగాణ భాగస్వామ్యానికి ఈ చర్చలు కొత్త మార్గాన్ని చూపనున్నాయి. హైదరాబాద్ను అంతర్జాతీయ విద్య, పరిశోధన, ఆవిష్కరణల కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న తెలంగాణ రైజింగ్ లక్ష్యానికి దీనితో మరింత బలం చే కూరుతుంది. ఈ సమావేశంలో ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు రామకృష్ణ రావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొన్నారు.

### సిఎంను కలిసిన పలువురు ప్రముఖులు

లండన్ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లివర్పూల్ సిటీ డెవలప్‌మెంట్ విభాగానికి చెందిన సుసాన్ ఫిన్నెగాన్, నూలా గల్లాఘర్, లివర్పూల్ ఫుట్బాల్ క్లబ్‌కు చెందిన పలువురు నేడు మర్యాదపూర్వకంగా కలిశారు. లివర్పూల్ ప్రతినిధులు లైఫ్ సైన్సెస్, టెక్నాలజీ, క్రీడలు, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు సంబంధించి తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఆసక్తి చూపించారు. ఈ భాగస్వామ్యాన్ని అధికారికంగా ఖరారు చేసేందుకు లివర్పూల్ ప్రతినిధి బృందం వచ్చే అక్టోబర్లో హైదరాబాద్ను సందర్శించనుంది.

### ఇంపీరియల్ కాలేజీని సందర్శించిన రామకృష్ణ రావు బృందం

సిఎం సలహాదారు రామకృష్ణ రావు శుక్రవారం లండన్‌లోని ప్రతిష్ఠాత్మక ఇంపీరియల్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇంపీరియల్ కాలేజీ అధ్యక్షుడి చీఫ్ ఆఫ్ స్టాఫ్, స్ట్రాటజిక్ ఎంగేజ్మెంట్ విభాగం వైస్ ప్రెసిడెంట్ అమాండా వోల్తుయిజెన్, దక్షిణాసియా, ఆస్ట్రేలియా ప్రాంతాల సీనియర్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ మేనేజర్ రోసాన్నా గిల్లెస్పీని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారికి తెలంగాణ ప్రత్యేకతలు, విద్యా రంగంలో అందుబాటులో ఉన్న అవకాశాల గురించి వివరించారు. తెలంగాణతో కలిసి పనిచేయడానికి అందుబాటులో ఉన్న సహకార అవకాశాలపై కూడా చర్చించారు.ఈ చర్చ సందర్భంగా హైదరాబాద్లో షార్ట్ టర్మ్ కోర్సులు, ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు నిర్వహించే అవకాశాలను పరిశీలిస్తామని అమాండా తెలిపారు. అలాగే పరిశోధన రంగంలో భాగస్వామ్యం, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలపై కూడా తెలంగాణతో కలిసి పనిచేయడంలో ఆసక్తి ఉందన్నారు. తెలిపారు. ఈ సందర్భంగా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్'కు రావాలని రామకృష్ణా రావు ఇంపీరియల్ కాలేజీ ప్రతినిధులను ఆహ్వానించారు.

## పత్రికా స్వేచ్ఛను స్వాగతిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు గడుస్తున్నా ఒక దళిత నాయకుడి పట్ల ఇలాంటి సంఘటన జరగడం దేశంలో సమానత్వం, గౌరవం ఏ స్థాయిలో ఉన్నాయో ప్రశ్నిస్తోందని, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చూపిన మార్గంలో దేశం ఇంకా ఎంత దూరం ప్రయాణించాల్సి ఉందో ఈ ఘటన తెలియజేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

### స్వాతంత్ర్యోద్యమంలో పత్రికల చెరగని ముద్ర

భారతదేశ నిర్మాణంలో జర్నలిజం ఒక అంతర్భాగమని, అది కేవలం వార్తలు రాయడం కాకుండా పౌరులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దిందని భట్టి గుర్తుచేశారు. మహాత్మా గాంధీ 'యంగ్ ఇండియా', 'నవజీవన్', 'హరిజన్' పత్రికల ద్వారా, బాబాసాహెబ్ అంబేద్కర్ 'మూక్ నాయక్', 'బహిష్కృత భారత్' పత్రికల ద్వారా అణగారిన వర్గాలకు గొంతుక ఇచ్చారని, లోకమాన్య బాలగంగాధర్ తిలక్ 'కేసరి', 'మరాఠా' పత్రికల ద్వారా వలస పాలనను సవాలు చేశారని తెలిపారు. దాదాభాయ్ నౌరోజీ, మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ వంటి నేతలు కూడా పత్రికలను సామాజిక, రాజకీయ సంస్కరణలకు వేదికలుగా మలిచారని, అమృత బజార్ పత్రిక, 'ది హిందూ' వంటివి ఆనాడు ప్రజాగొంతుకలుగా నిలిచాయని కొనియాడారు. ఒకప్పుడు సంపాదకుడి స్థానానికి ఎంతో ప్రాధాన్యం ఉండేదని, రా మ్‌నాథ్ గోయెంకా వంటి యజమానులు ప్రభుత్వాలను సైతం ధై ర్యంగా ప్రశ్నించేవారని గుర్తుచేశారు. నేటి వార్తా సంస్థలు కేవలం బ్యాలెన్స్ షీట్లకు, వాణిజ్య ప్రయోజనాలకు పరిమితం కాకుండా ఆనాటి విశ్వసనీయతను నిలబెట్టుకోవాలని సూచించారు.

### డిజిటల్ యుగంలో 'విశ్వసనీయతే' ఆయుధం

కృత్రిమ మేధ (ఎఐ), వాయిస్ క్లోనింగ్ వంటి సాంకేతికతల వల్ల తప్పుడు సమాచారం, పుకార్లు వేగంగా వ్యాపిస్తున్న ఈ కాలంలో జర్నలిస్టులకు 'విశ్వసనీయత' మాత్రమే అసలైన ఆస్తి అని డిప్యూటీ సిఎం ఉద్ఘాటించారు. నేడు సమాచార కొరత లేదని, నమ్మకం కొరత మాత్రమే ఉందన్నారు. 'నా పిడికిలిని ఊపే హక్కు, అది నీ ముక్కు వద్దకు చేరే వరకు మాత్రమే' అన్న సూక్తిని ఉదహరిస్తూ, భావప్రకటనా స్వేచ్ఛ ఇతరుల ప్రతిష్ఠను దెబ్బతీసే లైసెన్స్‌గా మారకూడదన్నారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌కు భూమి కేటాయింపు ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని, సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. 'అధికారంలో ఉన్న మమ్మల్ని జవాబుదారీగా ఉంచండి, మీ వృత్తి ప్రమాణాలకు మీరు జవాబుదారీగా ఉండండి.. ఈ రెండింటి ప్రయోజనం అంతిమంగా పౌరుడికే దక్కాలి' అని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.



### సమైక్య పోరాటంతోనే హక్కుల పరిరక్షణ : ఎన్.రామ్

జర్నలిస్టులపై చట్టపరమైన వేధింపులు, డిజిటల్ పరికరాల జప్తు వంటి చర్యలు పెరిగిపోతున్న నేపథ్యంలో జర్నలిస్టు సంఘాలు, ప్రెస్ క్లబ్‌లు ఒక్కటిగా నిలవడం అత్యవసరమని ఎన్. రామ్ అన్నారు. 1988లో రాజీవ్ గాంధీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివాదాస్పద 'పరువు నష్టం బిల్లు'ను జర్నలిస్టుల ఐక్య పోరాటం ద్వారానే ఉపసంహరించుకునేలా చేశామని గుర్తు చేశారు. ఇటీవలి బ్రాడ్‌కాస్ట్ బిల్లు వెనక్కి తగ్గడం, డిజిటల్ డేటా ప్రైవసీ చట్టంలో సవరణల హామీలు సాధించడంలో కూడా ఐక్య పోరాటాల ప్రభావం ఉందన్నారు.

### స్వేచ్ఛ రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పనిచేయాలి కె.శ్రీనివాస్ రెడ్డి

రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) పరిరక్షణే ఈ సమాఖ్య ప్రధాన లక్ష్యమని తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. స్థానికంగా జరిగే ఏ దాడినైనా జాతీయ స్థాయి అంశంగా మార్చడం, ఐటి చట్టాలు సహా ఇతర చట్టాల్లో పత్రికా స్వేచ్ఛకు అడ్డుగా ఉన్న నిబంధనలను సమీక్షించడం, వేధింపులకు గురవుతున్న విలేకరులకు ఉమ్మడి న్యాయ సహాయం అందించడం వంటి లక్ష్యాలతో ఫెడరేషన్ పనిచేస్తుందని తెలిపారు. పత్రికా స్వేచ్ఛపై సంకేతాలు కనిపిస్తున్నా, ఎమర్జెన్సీ తరహా పూర్తి సెన్సార్‌షిప్ పరిస్థితి లేదని, దేశంలోని బహుళత్వం కారణంగా మీడియాపై పూర్తి నియంత్రణ సాధించడం రాజ్యానికి అసాధ్యమని అన్నారు. దేశవ్యాప్తంగా విలేకరులు ఎదుర్కొంటున్న సవాళ్లను జాతీయ వేదికపై ఉమ్మడిగా పరిష్కరించడానికి ఈ ఫెడరేషన్ తోడ్పడుతుందని సంగీత బారోచ్ పిషారోటి తెలిపారు.

# కుల్దీప్ యాదవ్ ఔట్.. గంభీర్ హింట్

## రెండో టెస్ట్‌కు భారత తుది జట్టు ఇదే!





శ్రీలంక పర్యటనలో టీమిండియా ఆఖరి పోరుకు సిద్ధమైంది. రెండు టెస్ట్ సిరీస్‌లో భాగంగా కొలంబో వేదికగా జరిగే ఆదివారం ప్రారంభమయ్యే మ్యాచ్లో ఆతిథ్య శ్రీలంకతో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. తొలి టెస్ట్లో 165 పరుగుల భారీతేడాతో శ్రీలంకను చిత్తుచేసిన టీమిండియా 1-0తో ఆధిక్యంలో ఉంది. అదే జోరులో ఆ జట్టును ఓడించి సిరీస్ను 2-0తో క్లీన్ స్వీప్ చేయాలనే పట్టుదలతో భారత్ ఉంది. మరో వైపు ఆఖరి మ్యాచ్ గెలిచి సిరీస్ సమం చేయాలనే లక్ష్యంతో శ్రీలంక బరిలోకి దిగుతోంది.

**కుల్దీప్ యాద్వ వేటు..** రెండో టెస్ట్కు టీమిండియా కాంబినేషన్లో మార్పు జరిగే అవకాశం ఉంది. తొలి టెస్ట్లో దారుణంగా విఫలమైన కుల్దీప్ యాద్వ వేటు పడే ఛాన్స్ ఉంది. తొలి టెస్ట్లో రెండో ఇన్నింగ్స్లో కలిపి కుల్దీప్ యాదవ్ ఒకే ఒక్క వికెట్ తీసాడు. అంతేకాకుండా దారళంగా పరుగులిచ్చాడు. దాంతోనే అతన్ని పక్కనపెట్టి 33 ఏళ్ల సారాన్ష్ జైన్కు అవకాశం ఇస్తారనే ప్రచారం జరుగుతోంది.

**గంభీర్ హింట్..** శనివారం జరిగిన మీడియా సమావేశంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కూడా కుల్దీప్ యాదవ్ వేటుపై హింట్ ఇచ్చాడు. కుల్దీప్ గురించి ప్రశ్నించగా.. 20 వికెట్లు తీయగల బౌలింగ్ కాంబినేష్పనే భారత తుది జట్టు ఎంపిక ఆధారపడి ఉందని స్పష్టం చేశాడు. కొన్నిసార్లు కెప్టెన్ నిర్ణయంపై కూడా ఆటగాళ్ల ఎంపిక ఆధారపడి ఉంటుందని బదులిచ్చాడు. అయితే కుల్దీప్ యాదవ్కు శుభ్మన్ గిల్ ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదు. తొలి టెస్ట్లో అతనికి తగిన ఓవర్లు బౌలింగ్ ఇవ్వలేదు. ఈ లెక్కనే కుల్దీప్ను పక్కనపెట్టి బ్యాటింగ్ సామర్థ్యం ఉన్న సారాన్ష్ జైన్ను ఆడించే అవకాశం ఉంది. మిగతా కాంబినేషన్లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. ధ్రువ్ జురెల ఫిట్నెస్ సాధించకపోతే సర్ఫరాజ్ ఖాన్ బరిలోకి దిగుతాడు. యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ ఓపెనర్లుగా ఆడనుండగా.. దేవదత్ పడిక్కల్, శుభ్మన్ గిల్, రిషభ్ పంత్ మిడిలార్డర్లో బరిలోకి దిగనున్నారు. స్పెషలిస్ట్ పేసర్లుగా మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ ఆడనున్నారు. ఈ ఇద్దరిలో ఒకరికి విశ్రాంతినిస్తే గుర్నూర్ బ్రార్ జట్టులోకి వస్తాడు.

**శ్రీలంకతో రెండో టెస్ట్కు భారత తుది జట్టు(అంచనా)...** యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్మన్ గిల్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్/ సర్ఫరాజ్ ఖాన్, రవీంద్ర జడేజా, మానవ్ సుతార్, కుల్దీప్ యాదవ్/సారాన్ష్ జైన్, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ.

## నాకు లైక్స్, వ్యూస్ కంటే ట్రోఫీలు గెలువడమే ముఖ్యం : గౌతమ్ గంభీర్



భారత టెస్టు జట్టు కష్టాల్లో ఉందన్న వాదనను హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తోసిపుచ్చారు. ఇటీవల ఎదురైన పరాజయాలను పతనంగా చూడవద్దన్నారు. జట్టు ప్రస్తుతం మార్పుల దశలో ఉందని స్పష్టంచేశారు. తనకు ర్యాంకింగ్స్, సోషల్ మీడియాలో లైక్స్, వ్యూస్ హడావుడి కంటే ట్రోఫీలు గెలువడమే ముఖ్యమని చెప్పారు. శ్రీలంకతో రెండో టెస్టుకు భారత్ సిద్ధమవుతోందని, గాలేలో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో విజయం సాధించిందని గంభీర్ గుర్తుచేశారు. రెండు టెస్టుల సిరీస్లో భారత్ 1-0 ఆధిక్యంలో ఉందని, కొలంబో టెస్టుతో సిరీస్ విజేత ఎవరో తేలనుందని చెప్పారు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, రవిచంద్రన్ అశ్విన్ టెస్టు క్రికెట్కు వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టు భారీ మార్పులకు లోనైందన్నారు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో స్వదేశీ సిరీస్లో ఓటములు ఎదురయ్యాయని, ఆస్ట్రేలియా పర్యటనలోనూ భారత్‌కు నిరాశే ఎదురైందని, అయినా జట్టు గాడి తప్పిందని అనుకోవద్దని గంభీర్ చెప్పారు. తాము టెస్టు క్రికెట్లో ఇబ్బంది పడటం లేదని, ఇంగ్లండ్ పర్యటన తర్వాత సహేతుకమైన క్రికెట్ ఆడుతున్నామని అన్నారు. తనకు ట్రోఫీలు గెలువడమే ముఖ్యమని, తాను పట్టించుకునేది అదేనని గంభీర్ స్పష్టంచేశారు. అదేవిధంగా కొత్త తరం ఆటగాళ్లపై గంభీర్ నమ్మకం వ్యక్తంచేశారు. కొలంబోలో 20వికెట్లు తీసే అత్యుత్తమ బౌలింగ్ కూర్పుతో బరిలోకి దిగుతామని చెప్పారు. కుల్దీప్ యాదవ్ మంచి బౌలర్ అని పేర్కొన్నారు. ఒకటి రెండు మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఆటగాళ్లను పక్కన పెట్టకూడదన్నారు.



## ఈ సీజన్‌లో నీరజ్ అత్యుత్తమ ప్రదర్శన అయినా రెండో స్థానంతోనే సరి

క్రీడల్లో రజతంతో మెరిసిన నీరజ్ చోప్రా ఆసియా క్రీడల ముందు మెరుగైన ప్రదర్శన చేశాడు. ఈ సీజన్లోనే అత్యుత్తమంగా 88.05 మీటర్ల దూరం ఈటెను విసిరిన భారత బడిసె వీరుడు లసానే డైమండ్ లీగ్లో విజేతగా నిలుస్తాడనిపించింది. కానీ, ఊహించినట్టుగానే శ్రీలంక స్టార్ రుమేశ్ థరంగ పథిరంగే నీరజ్ను దాటేసి టైటిల్ను ఎగరేసుకుపోయాడు. రెండో స్థానంలో నిలిచిన నీరజ్.. ఆసియా క్రీడలపై దృష్టి సారించనున్నాడు. ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా వరసగా రెండో ఈవెంట్లోనూ రెండో స్థానంతోనే సరిపెట్టుకున్నాడు. కామన్వెల్త్ క్రీడల్లో వెండి వెలుగులు విరజిమ్మిన అతడు.. లసానే డైమండ్ లీగ్లో మెరుగైన ప్రదర్శన చేసినా సరిపోలేదు. ఈ సీజన్లోనే అత్యుత్తమంగా నీరజ్ 88.05 మీటర్ల దూరం విసిరాడు. రెండో ప్రయత్నంలో ఈ మార్క్ అందుకున్న అతడికి శ్రీలంక అథ్లెట్ షాకిచ్చాడు. కామన్వెల్త్లో పసిడి విజేత అయిన రుమేశ్ థరంగ పథిరంగే ఏకంగా 88.14 మీటర్ల దూరంతో ఇక్కడా మొదటి స్థానం సాధించాడు. దాంతో, భారత బడిసె వీరుడు టైటిల్ చేజార్చుకున్నాడు. 2022, 2023లో ఇక్కడ విజేతగా నిలిచిన నీరజ్.. 2024లో, ఈసారి కూడా రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

## బిజినెస్

### బులియన్ మార్కెట్

10 గ్రాముల బంగారం ధర (సుమారుగా)
24 క్యారెట్లు: రూ. 1,60,480
22 క్యారెట్లు: రూ. 1,47,100
18 క్యారెట్లు: రూ. 1,20,360

(స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో వారం కూడా నష్టాలను ఎదుర్కొంటే, అందుకు భిన్నంగా బులియన్ మార్కెట్ వరుసగా రెండో వారం-లోనూ లాభాల బాటలో కొనసాగింది. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో, స్టాక్ మార్కెట్ల కంటే బంగారం, వెండిని ఉత్తమ పెట్టుబడిగా మదుపరులు భావించడమే ఇందుకు కారణం. దీనికి తోడు మన దేశంలో పండుగ సీజన్ ప్రారంభమైన కారణంగా, బంగారం ధర పెరుగుతునే ఉంది).

### ఈ వారం స్టాక్ మార్కెట్లు

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో సెన్సెక్స్: ప్రారంభం 78,009.25 పాయింట్లు. ముగింపు 77,540.83 పాయింట్లు. నష్టం 468.42పాయింట్లు.
జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ: ప్రారంభం 24,366.00 పాయింట్లు. ముగింపు 24,252.00 పాయింట్లు. నష్టం 114.00 పాయింట్లు.



(స్టాక్ మార్కెట్లలో వరుసగా రెండో వారం కూడా 'బేర్' జోరు కొనసాగింది. జాతీయంగానేకాక, అంతర్జాతీయంగానూ నెలకొన్న అనిశ్చితి ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. ఫలితంగా భారత్‌లోనూ స్టాక్ మార్కెట్లు కూడా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి)

## మొబైల్ ఫోన్ తయారీ సంస్థలకు ప్రోత్సాహకాలు



కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన, రూ.62,500 కోట్ల విలువైన మొబైల్ ఫోన్ తయారీ పథకం అధిక టర్నోవర్‌గల కంపెనీలకు లాభాలను అందించనుంది. ఈ ఏడాది ఏప్రిల్‌నుంచి అమల్లోకి వచ్చిన ఈ పథకం ద్వారా, 2025-26 ఆర్థికసంవత్సరంలో రూ. 10,000కోట్ల టర్నోవర్ సాధించిన మొబైల్ ఫోన్ తయారీ సంస్థలు, ఎలక్ట్రానిక్స్ కాంట్రాక్ట్ తయారీదారులకు వివిధ రకాల ప్రయోజనాలు అందుతాయి. కనీసం 51శాతం భారతీయ యాజమాన్యం ఉన్న ఎలక్ట్రానిక్స్ తయారీ సేవల సంస్థలకు రూ.1,000 కోట్ల టర్నోవర్ అర్హతగా నిర్ణయించారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల ద్వారా దేశీయ మొబైల్ తయారీని పెంచడం పథకం లక్ష్యం. కొత్త భారత్‌లో రూ.10వేల కోట్ల వార్షిక అమ్మకాలు సాధించిన తర్వాతే ప్రయోజనాలు పొందుతాయి. దేశీయంగా డిస్‌ప్లేలు, బ్యాటరీలు, యుఎస్‌బి కేబుళ్ల వంటి విడిభాగాలను కొనుగోలు చేస్తే అదనంగా 1.5 శాతం వరకు ప్రోత్సాహకం లభిస్తుంది.

## వాతావరణానికి అనుగుణంగా ఇంటెలిజెంట్ లూవర్ల వ్యవస్థ

పెద్ద గాజు ఫలకాలతో నిర్మిస్తున్న ఆధునిక భవనాల్లో అధిక ఉష్ణోగ్రత, సూర్యకాంతి, కాంతి ప్రతిఫలనం, విద్యుత్ వినియోగం వంటి అంశాలు కీలకంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో భవన ముఖభాగాన్ని స్థిరమైన నిర్మాణ అంశంగా కాకుండా, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా స్పందించే వ్యవస్థగా మార్చే సాంకేతికతకు ప్రాధాన్యం పెరుగుతోంది. ఈ అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని అల్యూమినియం కాంపోజిట్ ప్యానెల్స్, ఫసాడ్ ఉత్పత్తుల రంగంలో పనిచేస్తున్న అల్యూడెకర్ సంస్థ 'అల్యూబ్రీజ్ ఇంటెలిజెంట్ లూవర్స్' పేరుతో ఒక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. ఈ వ్యవస్థలో అమర్చిన మోటరైజ్డ్ మెటల్ లూవర్లు సూర్యకాంతి, వర్షం, గాలి వంటి పర్యావరణ పరిస్థితులను గుర్తించి తమ కోణాన్ని స్వయంచాలకంగా మార్చుకుంటాయి. దీంతో గాజు ముఖభాగంపై పడే సౌర ఉష్ణం, కాంతి తీవ్రత, వాతావరణ ప్రభావాన్ని నియంత్రించవచ్చు. భవన యజమానులు, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ బృందాలు మొబైల్ యాప్, వెబ్ డ్యాష్‌బోర్డ్ ద్వారా ప్రపంచంలో ఎక్కడి నుంచైనా వ్యవస్థను పర్యవేక్షించి నియంత్రించవచ్చు. ఈ సాంకేతికతలో కంట్రోలర్, '24 వి' లీనియర్ యాక్చుయేటర్, పర్యావరణ సెన్సర్లు, 'అల్యూసింక్ క్లౌడ్' వంటి భాగాలు పనిచేస్తాయి. 'బిల్డింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (బిఎంఎస్),



ఎపిఐలతో అనుసంధానం చేసుకునే అవకాశం కూడా ఉంది. హాల్‌సెన్సర్ ద్వారా లూవర్ వాస్తవ స్థానం తెలుసుకుని, ఆదేశించిన స్థానంలోనే ఉందో లేదో వ్యవస్థ నిర్ధారిస్తుంది. సూర్యకాంతి అధికంగా ఉన్న సమయంలో లూవర్లు సౌర ఉష్ణం, గ్లేర్‌ను తగ్గించేలా పనిచేస్తాయి. వర్షం, బలమైన గాలుల సమయంలో రక్షణాత్మక స్థానానికి మారేలా ప్రోగ్రామ్ చేయవచ్చు. స్వతంత్ర అధ్యయనాల ప్రకారం, భారతదేశంతో సమానమైన వాతావరణ పరిస్థితుల్లో శీతలీకరణకు అవసరమైన విద్యుత్‌ను 18-40 శాతం వరకు తగ్గించే అవకాశం ఉంది. కార్యాలయాలు, ఆసుపత్రులు, హోటళ్లు, విమానాశ్రయాలు, రవాణా కేంద్రాలు, పార్కింగ్ భవనాలు, ఆవరణలు, ప్రజా భవనాల్లో ఈ వ్యవస్థను ఉపయోగించవచ్చు. 30, 45, 90 డిగ్రీల కోణాల్లో, 100 నుంచి 600 మిల్లీమీటర్ల వరకు వివిధ ప్రొఫైళ్లలో లభించే ఈ లూవర్లు భవనాల శక్తి సామర్థ్యంతో పాటు నిర్మాణ రూపకల్పనకు కూడా అనుగుణంగా పనిచేస్తాయి.

## పెరుగుతున్న పెట్టుబడి ప్రతిపాదనలు




చైనా వాటాదారుల పరిమితికి సంబంధించిన 'విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు' (ఎఫ్‌డిఐ) నిబంధనలను సడలించిన తర్వాత భారత్‌కు విదేశీ పెట్టుబడుల ప్రతిపాదనలు పెరుగుతున్నాయి. మే 2026లో నిబంధనలు మార్చినప్పటి నుంచి ఆగస్టు 20 వరకు 29 ఎఫ్‌డిఐ ప్రతిపాదనలు నమోదయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.4,895.65 కోట్లు. చైనా లేదా హాంకాంగ్ సంస్థల వాటా 10 శాతానికి మించకుండా ఉంటే, ఎఫ్‌డిఐకి అనుమతించిన రంగాల్లో ఆటోమేటిక్ రూట్ ద్వారా పెట్టుబడులు పెట్టేందుకు కొత్త నిబంధనలు అవకాశం కల్పించాయి. తాజా పెట్టుబడులు ఐటి, కృత్రిమ మేధ (ఎఐ), తయారీ, ఔషధాలు, డేటా సెంటర్లు, రవాణా వంటి రంగాల్లో నమోదయ్యాయి. మారిషస్, అమెరికా, జపాన్, దక్షిణ కొరియా, సింగపూర్ తదితర ప్రాంతాల నుంచి పెట్టుబడులు వచ్చాయి

# ప్రజా ఉద్యమాలకు పోరాట స్ఫూర్తి 'సురవరం'

## వర్ధంతి కార్యక్రమంలో సిపిఐ నేతలు





**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యుడు సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలోని సిపిఐ గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ హాజరై మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు పోరాట స్ఫూర్తి సురవరం సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. విద్యార్థి దశ నుంచే ఉద్యమాలను అలవర్చుకొన్న గొప్పనేత సురవరం అన్నారు. ఆయన స్ఫూర్తితో పార్టీ బలోపేతానికి, ప్రజల మధ్య ఉండి ప్రజల కోసం పోరాడతామని ఈ సందర్భంగా వారు తెలిపారు. సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ సూర్య, సిపిఐ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** కులమత భేదాలు, సామాజిక ఆర్థిక అసమానతలు లేని సమాజం కోసం జీవితాంతం పోరాడిన మహానేత సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి.ఫయాజ్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌తో కలిసి సురవరం చిత్రపటానికి నివాళులర్పించారు. అగ్రకులంలో పుట్టినా పీడిత, తాడిత ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మీ పతి, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేశమోని ఆంజనేయులు, సిపిఐ నాయకులు వంకేశ్వరం శ్రీనివాసులు, కొత్త రామస్వామి, శివకృష్ణ, శేఖర్, ఎఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షులు కొత్త సంతోష్, ఆంజనేయులు, విజయ్, చెన్నయ్య, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

**యాదగిరిగుట్ట :** అణగారినవర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గొప్ప నాయకుడు సురవరం సుధాకర్‌రెడ్డి అని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి విద్యార్థుల సమస్యలు, విద్యా సౌకర్యాలు, ఉపాధి, యువత హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాలను నిర్మించడంలో ముఖ్యపాత్ర పోషించారు. సురవరం సుధాకర్‌రెడ్డి నిరాడంబర జీవితం, ప్రజలతో మమేకమైన తీరు, కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల అచంచలమైన నిబద్ధత, ప్రజా ఉద్యమాల పట్ల అంకిత భావం నేటి తరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, పేరబోయిన మహేందర్, ఎండి ఇమ్రాన్, మండల కార్యదర్శి కళ్లేపల్లి మహేందర్, పట్టణ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, మత్రిగుడెం సర్పంచ్ బోధాసు స్వప్న జగన్, నాయకులు పేరబోయిన పెంటయ్య, పేర బోయిన బంగారు, గోపగాని రాజు, మునుకుంట్ల నరసమ్మ, ఆరే పుష్ప, ముక్కెర్ల పెంటయ్య మద్దూరి భాగ్యమ్మ, తొటకుర్ శేఖర్, చందు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**రంగారెడ్డి:** సురవరం సుధాకర్‌రెడ్డి జీవితం ప్రతి కమ్యూనిస్టుకి ఆదర్శప్రాయం అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. సురవరం సుధాకర్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు రావి నారాయణరెడ్డి కాలనీ ఫేజ్ 3 భూ పోరాట కేంద్రం వేదికలో సిపిఐ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అధ్యక్షతన జరిగిన నివాళి కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బతి లక్ష్మణ్ సామిడి శేఖర్‌రెడ్డి, ఏశాలి నరసింహ, కాటి అరుణ, సిపిఐ అనుబంధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.





# కొత్త లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

## ఎఐటియుసి కార్యదర్శి ఎస్.విలాస్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొస్తున్న కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్‌విలాస్ డిమాండ్ చేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఎండి. ఫయాజ్ అధ్యక్షతన శనివారం ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై విలాస్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి అనుసరిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, అలాగే కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీలో ఈ కోడ్‌లను అమలు చేయబోమని తీర్మానం చేస్తేనే కార్మికుల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుందని పేర్కొన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు రూ.18,900, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10,000 వేతనం ఇవ్వాలని, ఇఎస్ఐ, గ్రాట్యుటీ సీలింగ్ ఎత్తివేయాలని, ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని, అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. విలాస్ డిమాండ్ చేశారు. 2026 సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో కరీంనగర్‌లో జరగబోయే ఎఐటియుసి రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అందరి సహకారంతో జిల్లా మహాసభలు ఘనంగా విజయవంతమయ్యాయని తెలిపారు. మహాసభలో ఆమోదించిన తీర్మానాల సాధన కోసం రాబోయే రోజుల్లో పోరాట కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. కె.శ్రీనివాస చారి మాట్లాడుతూ సభ్యత్వ రుసుము చెల్లించని యూనియన్లకు రాష్ట్ర మహాసభల్లో ప్రాతినిధ్యం ఉండదని, వెంటనే సభ్యత్వాన్ని చెల్లించాలని కోరారు. సెప్టెంబర్ 6న నిర్వహించే ర్యాలీ, బహిరంగ సభకు కార్మికులు వందలాదిగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను నాయకులు విడుదల చేశారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు ఎస్ఎన్.రెడ్డి, పద్మకుమారి, రాజేందర్, మధు, సతీష్, భూషణం, తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు

## ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాల్సిందేనని, అందుకు జిల్లాలో జరిగే ఎఐటియుసి జిల్లా మహాసభల్లో కార్యాచరణ రూపొందిస్తామని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు వెల్లడించారు. శనివారం పట్టణంలోని స్థానిక వినాయక గ్రాండ్ హోటల్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణ కేంద్రంలో సిద్దారం రోడ్‌లోని లక్ష్మీ ప్రసన్న గార్డెన్స్‌లో ఈనెల 23, 24 తేదీలలో ఎఐటియుసి జిల్లా 17వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. 23న అంబేద్కర్ చౌరస్తా నుండి ఫంక్షన్ హాల్ వరకు కార్మిక ప్రదర్శన అనంతరం కార్మిక చట్టాలపై దాడి లేబర్ కోడ్‌ల ప్రభావం అనే అంశంపై సెమినార్ నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ సెమినార్‌కు ఎఐటియుసి రాష్ట్ర నాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. 24న జిల్లా నలుమూలల నుంచి ఎంపిక చేయబడిన 500 మంది ప్రతినిధులతో మహాసభను నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. మహాసభకు సిపిఐ శాసనసభ పక్ష నేత, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతో పాటు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండి.యూసఫ్, సొంటి బాలరాజు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి హాజరుకానున్నట్లు వివరించారు. ఈ మహాసభలలో మున్సిపల్, గ్రామపంచాయతీ, అంగనవాడీ, మధ్యాహ్న భోజనం, ఆశ , నేషనల్ హెల్త్ మిషన్, తదితర కార్మికుల కనీస వేతనాల అమలు కోసం ఉద్యమ రూపకల్పన, సంఘటితంగా కార్మికులు అయినా ఆర్టీసీ, సింగరేణి, సంస్థల పరిరక్షణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు కార్మిక చట్టాలు లేబర్ కోడులపై సుదీర్ఘమైన చర్చలు చేసి తీర్మానాలను ప్రవేశపెట్టనున్నట్లు, రెండు రోజులపాటు జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కార్మిక శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, బికెఎంయు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ, డిహెచ్‌పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తడికమళ్ళ యోబు తదితరులు పాల్గొన్నారు.

# రియాక్టర్ పేలి భారీ విధ్వంసం

హెజెలో ఫార్మా కంపెనీ తాత్కాలికంగా సీజ్

ముగ్గురు దుర్మరణం,ఒకరి పరిస్థితి విషమం,8మందికి తీవ్ర గాయాలు

మృతుని కుటుంబానికి రూ.2.80 కోట్ల పరిహారం

గాయపడ్డ వారికి మెరుగైన చికిత్సకు పూర్తి బాధ్యత

కంపెనీ తెరిచే వరకు కార్మికులకు వేతనాలు చెల్లింపు

బాధితులకు అండగా ఉంటామని అదనపు కలెక్టర్ భాస్కరరావు వెల్లడి









**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : హెజెలో ఫార్మా కంపెనీలో ప్రమాదవశాత్తు రియాక్టర్ పేలి భారీ విధ్వంసంలో ముగ్గురు దుర్మరణం 9 మంది తీవ్రంగా గాయపడ్డ నేపథ్యంలో కార్మికుల భద్రత ప్రమాణాల దృష్ట్యా కంపెనీని తాత్కాలికంగా సీజ్ చేస్తున్నట్టు అదనపు జిల్లా కలెక్టర్ భాస్కరరావు ప్రకటించారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు నోటీస్ జారీ చేశారు. వివరాల్లోకి వెళితే హెజెలో బల్క్ డ్రగ్ కంపెనీలో రియాక్టర్ పేలి భారీ విధ్వంసం సృష్టించిన సంఘటన శుక్రవారం రాత్రి సుమారు గం 10.20ని.లకు యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు జరిగిన పేలుడు ధాటికి కంపెనీలో మూడవ షిఫ్ట్ లో పనిచేస్తున్న 18 మంది కార్మికుల్లో ఇద్దరు కార్మికులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.9మంది తీవ్ర గాయాల పాలైన క్షతగాత్రులను పోలీసులు హుటాహుటిన మెరుగైన చికిత్స కోసం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కు తరలించారు. ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న రసాయన పరిశ్రమ సంఘటన స్థలాన్ని శనివారం కలెక్టర్ సందర్శించి బాధిత కుటుంబాలకు కంపెనీ పూర్తి బాధ్యత వహిస్తుందని డిమాండ్లను యాజమాన్యం ఒప్పుకుందని మీడియా సమక్షంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదానికి గల ముఖ్యమైన కారణాలను వివరించారు. థర్డ్ షిఫ్ట్ పై విధులు నిర్వర్తిస్తున్న మృతులు లిక్విడ్ అమోనియం, హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో అబ్నార్మల్ మిశ్రమం కారణంగా రియాక్టర్ లో ఒక్కసారిగా పేలుడు సంభవించిందని తెలిపారు. ప్రమాదంలో నల్లగొండ జిల్లా వాసి చెన్ను నాగిరెడ్డి(31), ఖమ్మం జిల్లా వాసి నాగనబోయిన నరేష్ కుమార్(29)లో స్పాట్ లోనే మృతి చెందగా సూర్యాపేట జిల్లాకు చెందిన రానబోతు రాజశేఖర్(38) చికిత్స పొందుతూ శనివారం మరణించారు. క్షతగాత్రులైన ఎనిమిది మందిలో మేద శ్రీహరి,వేదుల చెన్నకేశవులు పరిస్థితి విషమంగా ఉంది. చెన్నారెడ్డి శివకుమార్, మరెళ్ళ యోహాను, వేదుల చిన్న, కంభంపాటి ఏసుదాసు, దూడల శివశంకర్, సాకేటి గణేష్ పెంట్యాల రవిలు యశోద, సన్‌షైన్ హాస్పిటల్స్‌లో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేసి నివేదిక అందజేయాలని పోలీసులను ఆదేశించినట్లు చెప్పారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2.80 కోట్ల పరిహారం అందజేస్తుందని, బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు మెరుగైన వైద్యం కోసం పూర్తి ఖర్చులు చెల్లించేందుకూ, వైద్యం చేసినా గాయాల నుండి కోలుకోలేని కార్మికులకు నెలవారి జీతం చొప్పున జీతభత్యాలు చెల్లించేందుకు యాజమాన్యం పూర్తి బాధ్యత వహించేందుకు ఒప్పుకుందనీ వెల్లడించారు. కంపెనీని తిరిగి తెరిచే వరకు 360మంది కార్మికులకు యాజమాన్యం జీతాలు చెల్లిస్తుందని చెప్పారు. బాధిత కుటుంబాలకు యాజమాన్యం పూర్తిగా న్యాయం చేయడానికి సిద్ధంగా ఉందని భరోసా ఇచ్చారు. అదనపు ఆర్డీవో శేఖర్ రెడ్డి, తాసిల్దారు శ్రీనివాస్ రెడ్డి, డిఎస్పి మధుసూదన్ రెడ్డి, ఉమ్మడి నల్గొండ జిల్లా పరిశ్రమల డిప్యూటీ కమిషనర్ చంద్ర శేఖర్, పొల్యూషన్ బోర్డ్ ఈఈ వెంకన్న, సీఐలు సతీష్, మన్మధ రెడ్డి, ఎస్సైలు జగన్ భాస్కర్ రెడ్డి, శ్రీకాంత రెడ్డి, డిఎంహెచ్వో మనోహర్, ఇండస్ట్రీస్ ఇన్స్పెక్టర్ శ్రీదేవి ఉన్నారు.

## అక్రమ పిడిఎస్ బియ్యం పట్టివేత


ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు



**ప్రజాపక్షం/సూర్యాపేట (నూతనకల్)** : అక్రమంగా పిడిఎస్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు నూతనకల్ ఎస్ఐ నాగరాజు తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఆత్మకూర్(ఎస్) మండలం, రామన్నగూడెం గ్రామానికి చెందిన చలమల్ల వీరస్వామి అతని కుమారుడు చలమల్ల లెనిన్, మిర్యాల గ్రామానికి చెందిన పిడిఎస్ బియ్యం డీలర్ కృష్ణారెడ్డి వద్ద నుండి సుమారు 25 క్వింటాళ్ల బియ్యాన్ని కిలోకు రూ.15 చొప్పున కొనుగోలు చేశారు. అనంతరం ఆ బియ్యాన్ని అశోక్ లేలాండ్ మిని గూడ్స్ వాహనం నంబర్ టిఎస్07 యుజె 0634లో లోడ్ చేసుకొని మామిళ్లమడవ గ్రామ శివారులోని కోళ్లఫారానికి తరలిస్తుండగా నమ్మదగిన సమాచారం మేరకు నూతనకల్ పోలీసులు మిర్యాల గ్రామ శివారులో వాహనాన్ని తనిఖీ చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వాహనంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 25 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు చేపట్టినట్లు వివరించారు. ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, విక్రయించడం లేదా తరలించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## పాఠశాలల అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, విద్యార్థుల ఆరోగ్య రక్షణకు దాతలు ముందుకు వచ్చి సహకారం అందించడం ఎంతో అభినందనీయమని శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సురక్షితమైన నీరు అందించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. గార్లపాటి రాఘవ రెడ్డి, గార్లపాటి కరుణాకర్‌రెడ్డి, కంచర్ల లక్ష్మి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఈ ప్లాంట్‌ను పాఠశాలకు బహుకరించారు. ఈ సందర్భంగా ప్లాంట్‌ను ప్రారంభించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం ఆర్ వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన దాత గార్లపాటి శేఖర్‌రెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లావూరి బాలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ పెద్ద గాయం ఉపేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు, దాతలు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లావూరి బాలు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి సమన్వయ సమావేశం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాలులోజాతీయ లోక్ అదాలత్ నిర్వహణకు సంబంధించి సమన్వయ సమావేశం నిర్వహించారు. 2026 సెప్టెంబర్ 12వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో, అధిక సంఖ్యలో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించి, కక్షిదారులకు త్వరితగతిన న్యాయం అందించాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జి.సబిత, సీనియర్ సివిల్ జడ్జి కమ్ చైర్మన్, మండల న్యాయ సేవా కమిటీ, రామన్నపేట అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఎస్.శిరీష,అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీమతి వి.రత్నకుమారి,సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జడ్జి డి.సత్యయ్య పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్లో రాజీపడదగిన కేసులను గుర్తించి, సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకొని వీలైనన్ని ఎక్కువ కేసులను స్నేహపూర్వకంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి రామన్నపేట సబ్ఇన్స్పెక్టర్, మోత్కూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్తో పాటు కోర్టు కానిస్టేబుళ్లు హాజరయ్యారు.జాతీయ లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించేందుకు న్యాయశాఖ, పోలీసు శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్కల స్వైరవిహారం భయాందోళనలో రోగులు

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వీధి కుక్కల సంచారం తీవ్రంగా పెరగడంతో రోగులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.ఆసుపత్రి ప్రధాన గేటు నుండి లోపలి వరకు,వరండాలో,రోగులు వైద్యులను సంప్రదించే ఓపీ గదుల్లోకి, వార్డుల్లోకి సైతం కుక్కలు యథేచ్ఛగా ప్రవేశిస్తున్నాయని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఆసుపత్రి ఆవరణలో చెత్తాచెదారం,ఆహార వ్యర్థాలు పేరుకుపోవడంతో కుక్కలు గుంపులుగా చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చికిత్స కోసం వచ్చే గర్భిణీలు,బాలింతలు,చిన్నారులు, వృద్ధులు కుక్కలను చూసి భయంతో వణికిపోతున్నారు.రాత్రి వేళల్లో ఆసుపత్రిలో ఉండే రోగులకు కుక్కలు మరింత ఇబ్బందిగా మారాయని, కొన్నిసార్లు రోగుల మంచాల కిందే పడుకుంటున్నాయని తెలిపారు.దీనివల్ల అంటు వ్యాధులు, ఇన్ఫెక్షన్లు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే సమస్యపై పలుమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రిని సురక్షితంగా మార్చాలని రోగులు, ప్రజలు కోరుతున్నారు.





## న్యాయ,పోలీసు వ్యవస్థల సమన్వయంతోనే సత్వర న్యాయం

**ప్రజాపక్షం/నల్లగొండ** : వివిధ కేసులలో సత్వర న్యాయం అందించడంలో న్యాయ, పోలీసు వ్యవస్థల మధ్య సమన్వయం, సహకారం ఎంతో అవసరమని ప్రిన్సిపల్ జిల్లా జడ్జ్ పి.వసంత్ అన్నారు. శనివారం ఉదయాదిత్య భవన్‌లో కేసుల పరిష్కారంలో పై నిర్వహించిన జిల్లా స్థాయి కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఒక నాణేనికి ఇరువైపులా ఉన్నట్లుగానే వివిధ కేసుల పరిష్కారంలో న్యాయ,పోలీస్ వ్యవస్థలు ఉంటాయని అన్నారు. కేసుల పరిష్కారంలో సమర్థవంతంగా పనిచేసేందుకు రెండు వ్యవస్థల మధ్య సరైన సమన్వయం అవసరమని, వివిధ కేసుల పరిష్కారంలో ప్రత్యేకించి కష్టతరమైన కేసుల్లో ప్రాక్టికల్ సమస్యలను గుర్తించడంలో పోలీసు సహకారం అవసరమని తెలిపారు. ఇటీవల జరిగిన ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసును జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ నేతృత్వంలో జిల్లా పోలీసులు సమర్థవంతంగా ఛేదించి నిందితులను త్వరగా పట్టుకోవడాన్ని జిల్లా జడ్జి అభినందించారు. జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ క్రిమినల్,అండర్ ట్రయల్, ఎన్‌బీడబ్ల్యూ కేసుల సత్వర పరిష్కారంలో సమన్వయం ఎంతో అవసరమన్నారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని శాఖల సమన్వయంతో కేసుల పరిష్కారానికి పోలీస్ శాఖ తరపున అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సమావేశంలోఅదనపు జడ్జి కె. కవిత, పోలీస్, న్యాయ, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ బిఎల్ఏల కృషి అభినందనీయం

దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్2026 రెండో విడత ప్రక్రియపై దేవరకొండ పట్టణంలోని వైష్ణవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన శిక్షణ శిభిరంలో దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొని బూత్ లెవెల్ ఏజెంట్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బాలు నాయక్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సర్ ప్రక్రియలో భాగంగా రెవెన్యూ అధికారులు, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు ఎన్యూమరేష్ ఫారాలను అందించారని తెలిపారు. సర్‌కు ముందు దేవరకొండ అసెంబ్లీ నియోజకవర్గంలో 2,69,098 మంది ఓటర్లు ఉండగా, ఆగస్టు 17న ప్రచురించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో 2.32,283 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మొత్తం 36,815 మంది ఓటర్లను వివిధ కారణాలతో తొలగించినట్లు తెలిపారు. తొలగించిన ఓటర్లలో 7,451 మంది మరణించిన వారు, 7629 మంది డూప్లికేట్ ఓటర్లు, 395 మంది ఆయా చిరునామాల్లో లేనివారు ఉన్నారని, మరో 21,313 మంది ఓటర్లు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినట్లు గుర్తించినట్లు ఎంఎల్ఏ వివరించారు. ప్రస్తుత ఓటరు జాబితాలో 51,427 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు ఎంఎల్ఏ తెలిపారు. ఇందులో 4,784 మంది నో వ్యాపింగ్, 46,643 మంది లాజికల్ ఎర్రర్స్ కింద ఉన్నారని పేర్కొన్నారు. వీరికి సంబంధించి ఆగస్టు 27 నుండి సెప్టెంబర్ 27 వరకు ఆయా గ్రామాల్లోనే గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద రెవెన్యూ అధికారులు విచారణ నిర్వహిస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో నల్గొండ జిల్లా అధ్యక్షులు పున్న కైలాష్‌నేత, సర్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, ఉపా ధ్యక్షులు వెంకటయ్యగౌడ్, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శులు, కార్య దర్శులు, నియోజకవర్గ అన్ని మండలాల అధ్యక్షులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## ప్రజల మనిషి సురవరం సుధాకర్ రెడ్డి

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి ,లొడంగి శ్రావణ్ కుమార్

**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రజల కోసం నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నడిపిన ప్రజల మనిషి సురవరం సుధాకర్ రెడ్డి అని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి ,లొడంగి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు.అమరజీవి కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా నల్లగొండ మ గ్దూమ్ భవన్ లో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమం నాయకుడిగా మొదలైన రాజకీయ ప్రస్థానం,సిపిఐ ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శి గా నల్లగొండ పార్లమెంటు సభ్యులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా,జీవితమంతా రైతులు, కూలీలు, కార్మికుల మధ్యతరగతి ప్రజల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి సురవరం సుధాకర్ రెడ్డి అని అన్నారు. అణగారిన వర్గ ప్రజల హక్కులకై నిరంతరం పోరాటాలు సాగించారు. నల్లగొండ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల కోసం డిండి నుండి నల్లగొండ వరకు పాదయాత్ర నిర్వహించి ఫ్లోరైడ్ సమస్యలపై పార్లమెంట్లో సుధీర్ఘ ఉపన్యాసం చేసి దేశ ప్రజల ను నల్గొండ వైపు తిప్పిన వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి,పట్టణ కార్యదర్శి కె ఎస్ రెడ్డి, నాయకులు ముండ్ల ముత్యాలు ఎం నందం ,కె నారాయణ,కొమటిరెడ్డి ప్రద్యుమ్న రెడ్డి,యూసుఫ్, బాసాని వెంకటయ్య,సీతారాములు కౌసల్య,విజయ వీరయ్య పాల్గొన్నారు.

### ఉద్యమ కెరటం కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/మోటకొండూర్** :మోటకొండూరు మండల కేంద్రంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలాగాని సత్యనారాయణ, మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం ఆద్వర్యంలో కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, మండల కార్యవర్గ సభ్యులు పల్లె వెంకన్న బోళ్ల శీను, బీరకాయల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ మోటకొండూరు మండల నాయకులు బుగ్గ శ్రీశైలం, లక్ష్మీనారాయణ, సిపిఐ మండల సమితి సభ్యులు పల్లె శీను, ఎండి.శంషుద్దీన్, సూదగాని వెంకన్నపాల్గొన్నారు.

### సురవరం ఆశయాలే మార్గం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకరెడ్డి ఆశయాలే మా మార్గమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో స్వర్గీయ సురవరం సుధాకర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక న్యాయం, సమానత్వం హక్కుల కోసం కార్మికుల, రైతుల పక్షాన ఆయన చేసిన పోరాటాలు మరువలేనివని అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేస్తూ ప్రజాస్వామ్య విలువలను కాపాడటంలో సురవరం కృషి వామపక్ష ఉద్యమాలకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కొప్పోజు సూర్యనారాయణ, దొంతగాని సత్యనారాయణ, ఇందిరాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ చెనగాని సైదులు, సుందరి పద్మ, యల్లావుల రమేష్, ఉమ, జక్కుల రమేష్, జడ వెంకన్న, చక్రాల స్టాలిన్, రవీందర్‌రెడ్డి, బత్తిని మల్లయ్య, రమణ పాల్గొన్నారు.



## చిన్నారుల రక్షణ అందరి బాధ్యత : లక్ష్మి శారద



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : సమాజంలో చిన్నారులకు సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన వాతావరణాన్ని కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) చైర్‌పర్సన్ పి. లక్ష్మి శారద స్పష్టం చేశారు. శనివారం సూర్యాపేట సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం సమావేశ మందిరంలో డిఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు (జిల్లా బాలల పరిరక్షణ అధికారులు) నిర్వహించిన ఒకరోజు అవగాహన సదస్సును జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పి కె. నరసింహతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం అత్యంత కీలకమైన దశ అన్నారు. ఈ దశలో పిల్లలకు కేవలం తిండి, నిద్ర, చదువు మాత్రమే సరిపోవన్నారు. వారి మానసిక, భావోద్వేగ ఎదుగుదలకు తగిన ప్రేమ, సంరక్షణ, సమాన అవకాశాలు అందించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన విద్యాహక్కు, ఆరోగ్యం, రక్షణను ప్రతి బాలుడికి అందేలా చూడాలన్నారు. చిన్న వయసులోనే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని కోరారు. అదే సమయంలో మగ పిల్లలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వారి సమస్యలను తెలుసుకుని తగిన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. బడులు, వసతి గృహాల్లో పిల్లల భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. ముఖ్యంగా 7వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థుల ఆలోచనా విధానం రూపుదిద్దుకునే దశ అన్నారు. పోలీసు శాఖ ద్వారా మహిళలు, చిన్నారుల రక్షణ కోసం పోలీస్ భరోసా, పోలీస్ అక్క, షీ టీమ్స్ వంటి అనేక కార్యక్రమాలు విజయవంతంగా నడుస్తున్నాయని జిల్లా ఎస్పి కె. నరసింహ తెలిపారు. ఈ సదస్సులో సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఏ సెక్రటరీ ఫార్హీన్ కౌసర్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి మమత, జువైనల్ జస్టిస్ బోర్డ్ ప్రిన్సిపాల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ అపూర్వ రవళి, జిల్లా అదనపు కలెక్టర్ బి. హరిసింగ్ పాల్గొన్నారు.

## ఎండిపోతున్న వరినార్లు...

# దు:ఖ 'సాగరం'లో అన్నదాతలు!



**ప్రజాపక్షం/హాలియా:** ఎల్‌నినో ప్రభావం రైతులను అతలాకుతలం చేస్తుంది. శ్రీశైలం ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం డ్యాం నీటితో కళకళలాడుతుంది. కానీ దిగువన ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్టు నీరు లేక వెలవెలబోతుంది. రెండు నెలలు వర్షాలు పడకపోతే అప్పుడే కరువు చాయలు అలముకున్నట్లుగా అనిపిస్తున్న తీరు ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తుంది. కనీసం కడుపు నింపుకునేందుకు నాలుగు తిండిగింజలు పండించుకునే పరిస్థితి లేకపోవడంతో రానున్న రోజులు మరింత కఠినంగా ఉండబోతున్నాయనే హెచ్చరికలు ప్రస్తుత వాతావరణం తెలియజేస్తుంది. సాగర్ ఆయకట్టుకు ఒక్క పంటకు నీరురాని పరిస్థితి ఏర్పడితే దీని ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో ప్ర స్తుత పరిస్థితులు చెబుతున్నాయి. సాగర్ ప్రా జెక్టుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆయకట్టు రైతు లు ఆగస్టు నాటికైనా సాగునీరు వస్తుందని నమ్మకంతో ముమ్మరంగా వరినార్లు పోశారు. కానీ రైతుల ఆశలపై వాతావరణం నీళ్లు చల్లడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారు.నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతంలో ప్రతి ఏడు పది లక్షల ఎకరాలకు పైనే వరి సాగు చేస్తుంటారు. కానీ ఈ ఖరీఫ్ సీజన్లో వర్షభావ పరిస్థితులు ఏర్పడి ఉమ్మడి నల్గొండ జిల్లాలో సుమారుగా వ్యవసాయ బావులు, బోర్ల కింద ఒక లక్ష ఎకరాలలో వరి సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఆగస్టు నెల వచ్చినా వర్షాలు పడకపోవడంతో ఇక ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకున్నట్లే అని చెప్పాలి. ఎగువ శ్రీశైలం డ్యాం నిండాలంటే మరో 25 టిఎంసిల నీరు అవసరం ఉంది. ఒక వేళ శ్రీశైలం డ్యాం నుండి దిగువ సాగర్ డ్యాంకు నీటిని వదిలినా ఈ ఖరీఫ్ సాగు ముందుకు సాగే పరిస్థితి లేకుండా పోయింది. ఎందుకంటే వరి నార్లు పోసిన రైతులకు కొద్ది గొప్పో నీటి అవకాశం ఉండడం వలన దానిని కాపాడుకోగలిగారు. ఏ అవకాశం లేని రైతులు ఇప్పటివరకు వరి నార్లు కూడా పోయకుండా ఆకాశం వైపే వరుణి రాక కోసం ఎదురుచూస్తున్నారు.

## సమస్యల నిలయంగా గిరిజన యూనివర్సిటీ: ఏఐఎస్ఎఫ్




**ప్రజాపక్షం/ములుగు:** తెలంగాణ విభజన హామీల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమ్మక్క సారక్క గిరిజన యూనివర్సిటీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర యూనివర్సిటీల ఇన్‌చార్జి రెహమాన్ విమర్శించారు. యూనివర్సిటీలో పూర్తి స్థాయిలో కోర్సులు అందుబాటులో లేకపోవడంతో పాటు మౌలిక వసతుల కొరత వేధిస్తుందని అన్నారు. ఏఐఎస్ఎఫ్ ములుగు జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం యూనివర్సిటీ వద్ద సంఘం 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రెహమాన్ మాట్లాడుతూ విభజన చట్టంలో ఇచ్చిన గిరిజన యూనివర్సిటీ హామీనీ పూర్తి స్థాయిలో అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. కాంట్రాక్టు ప్రొఫెసర్లతో బోధన కొనసాగించడం వలన విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. యూనివర్సిటీలో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

**దీర్ఘకాలిక ఉద్యమాలు...**

గిరిజన యూనివర్సిటీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం దీర్ఘకాలిక ఉద్యమాలు చేపడతామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్ తెలిపారు. విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రాజకుమార్, ప్రవీణ్, కుమార్, నవీన్, రాజు, రమేష్, నరేష్, శరత్, పాల్గొన్నారు.

## సురవరం సుధాకర్ రెడ్డికి సిపిఐ ఘన నివాళి




**ప్రజాపక్షం/మహబూబాబాద్:** భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి మాజీ పార్లమెంటు సభ్యుడు కమ్యూనిస్టు మేధావి అమరజీవి సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయం వీరభవన్ లో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే ఉద్యమాలను అలవర్చుకొని కమ్యూనిస్టు ఉద్యమాన్ని ముందుకు నడిపించిన గొప్ప నేత సురవరం సుధాకర్ రెడ్డి అని కొనియాడారు. అనేక భూ పోరాటాల ద్వారా రాష్ట్రంలో ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా లక్షలాదిమంది నిరుపేదలకు ఇంటి స్థలాలు పంచిన గొప్ప చరిత్ర సురవరం గారిది అని, తన మాటల ద్వారా ఎంతోమందిని ఉద్యమంలోకి తీసుకువచ్చి పార్టీని తెలంగాణలో బలోపేతం చేసిన గొప్ప ఉద్యమాల నేత అని అన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శిగా తెలంగాణ నుండి ఎన్నికై దేశ కమ్యూనిస్టు మేధావిగా పేరు తెచ్చుకున్న ఎర్రజండా నేత సురవరంఅని, నాడు నల్లగొండ ఎంపీగా గెలిచి ఎన్నో అభివృద్ధి పనులు తన హయాంలో జరిపారని అన్నారు. సిపిఐ ప్రభుత్వంలో జాతీయ హామీ పథకం రావడంలో సురవరం కీలకపాత్ర పోషించారని, నాడు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున నడుస్తున్న కాలంలో ఉద్యమానికి ఊపిరి పోసి జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉండి కీలకపాత్ర పోషించారని అజయ్‌సారథిరెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెరుగు కుమార్, 18 వ వార్డు కౌన్సిలర్ రేశపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, తండా సందీప్, వీరవెల్లి రవి, కేదాసు రమేష్, కూరాకుల పాల్, అల్లి వేణు, నక్క నాగార్జున, గాదం శ్యాంప్రసాద్ యాదవ్, నీలం వెంకటేశ్వర్లు, మంద రవి, ప్రదీప్ రెడ్డి పాల్గొన్నారు.

## మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/గణపురం:** యంగ్ ఇండియా మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యత విషయంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. గణపురం మండలం మైలారం గ్రామంలో నిర్మిస్తున్న పాఠశాల భవన నిర్మాణ పనులను శనివారం కలెక్టర్ పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పనుల పురోగతిని తనిఖీ చేశారు. నాలుగు అకాడమిక్ బ్లాకులు, సీనియర్, జూనియర్ డార్మిటరీలు, కిచెన్, డైనింగ్ హాళ్లు, పరిపాలనా భవనాల నిర్మాణ ప్రణాళికను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ఫుటింగ్, బైస్ కాంక్రీట్ పనులను తనిఖీ చేసి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. కాంక్రీట్ గోడల నిర్మాణంలో షియర్ వాల్ టెక్నాలజీని వినియోగించాలని ఆదేశించారు. నిర్మాణ ప్రాంతంలో చెట్లను తొలగించవద్దని, అనివార్యంగా తొలగించాల్సి వస్తే అటవీశాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. పాఠశాలలో 2640 మంది విద్యార్థులు, 300 మంది సిబ్బందికి వసతి కల్పించనున్న నేపథ్యంలో తాగునీటి వసతిపై ప్రత్యేక దృష్టిం సారించాలని తెలిపారు. ఆరు లక్షల లీటర్ల సామర్థ్యంతో అండర్‌గ్రౌడ్ ట్యాంక్, రెండు లక్షల లీటర్ల సామర్థ్యంతో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణాన్ని ప్రణాళికబద్ధంగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమలో టిజిఈడబ్ల్యూఐడిసి ఈఈ అరుణ్ కుమార్, తహసీల్దారు రాజేశ్వరరావు, ఏఈ జీవన్, మైలారం సర్పంచ్ సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిపై అనుచిత వాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు




**ప్రజాపక్షం/జనగామ :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి లక్ష్మినారాయణ నాయక్ డిమాండ్ చేశారు. కొండా సుస్మిత చేసిన వాఖ్యల్ని ఖండిస్తూ కొండా సురేఖపై చర్య తీసుకోవాలని జనగామ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ 48 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. శనివారం మధ్యాహ్నం జిల్లా అధ్యక్షురాలు ధన్వంతి నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ సందర్భంగా ధన్వంతి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో లబ్ధి పొందుతూ పార్టీ నాయకులు, ముఖ్యమంత్రిపైనే విమర్శలు చేయడం సరియైంది కాదన్నారు. కొండా సుస్మిత చర్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ వేమల్ల సత్యనారాయణరెడ్డి, రాజమౌళి,ప్రవీణ్, మల్లేష్, మల్లేష్, ఇస్మాయిల్, మేకల సమ్మయ్య, మోతే మల్లేశం, శ్రీశైలం పాల్గొన్నారు.

## దేశంలోనే తొలిసారిగా స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ



### మానవీయ కోణంలో అమలు చేస్తున్న గొప్ప పథకం సన్న బియ్యం పంపిణీ

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/వేలేరు:** ఎన్నికలు ఏవైనా నిజాయితీగా ఉండే వారిని, ప్రజల కోసం పని చేసే వారిని ఎన్నుకుంటేనే గ్రామంలో అయినా, నియోజకవర్గంలో అయినా అభివృద్ధి జరుగుతుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు.వేలేరు మండల కేంద్రంలోని రైతు వేదికలో, ధర్మసాగర్ మండల కేంద్రంలోని సుస్మిత గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన వేలేరు, ధర్మసాగర్ మండలాలకు సంబంధించిన కొత్త డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అత్యంత భద్రతా ప్రమాణాలతో జారీ చేసిన డిజిటల్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణి చేశారు. అనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ..... కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టే ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి ఓర్వలేక బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుర్మార్గంగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆరోపించారు. రెండు రోజుల క్రితం ఎక్కడో ఆదిలాబాద్ లో సంజీవ రెడ్డి అనే వ్యక్తికి ఇతర కాంగ్రెస్ నాయకులకు గొడవ జరిగితే అది కడియం శ్రీహరి గారిపైనే జరిగింది అని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఇంత దుర్మార్గంగా అబద్దపు వార్తలు చేయడం బిఆర్ఎస్ నాయకుల దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం అని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కొన్ని యూట్యూబ్ ఛానల్స్ కొని నెల జీతాలు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, నాయకులపై సంబంధంలేని, సబ్జెక్ట్ లేని వార్తలతో విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజా స్వామ్య వ్యవస్థలో ఇది సరైన పద్ధతి కాదని సూచించారు. నా 35ఏళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ ఎవరి దగ్గర రూపాయి అవినీతికి పాల్పడలేదని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం, పేద ప్రజల సంక్షేమం కోసమే నిరంతరం కృషి చేస్తున్నాని తెలిపారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా సన్న బియ్యంతో పాటు స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులు పంపిణి చేసిన రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం మాత్రమే అని చెప్పారు. తెలంగాణ చేపట్టిన సన్న బియ్యం పంపిణి కార్యక్రమం ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని తెలిపారు. ఏడాదికి 13వేల 800కోట్ల ఖర్చుతో కోటి 06లక్షల రేషన్ కార్డుల ద్వారా 3కోట్ల 10లక్షల మందికి ఒక్కరికి 6కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం పంపిణి చెస్తున్నట్లు పేర్కొన్నారు. అత్యున్నత భద్రతా ప్రమాణాలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా డిజిటల్ రేషన్ కార్డులను పంపిణి చేస్తుందని అన్నారు. ఈ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోడీ ఫోటో పెట్టాలని బీజేపీ వాళ్ళు అంటున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డు బియ్యం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సన్న బియ్యం పంపిణి చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల ఖర్చుతో చేపట్టే కార్యక్రమానికి మోడీ ఫోటో ఎలా పెడతారని ప్రశ్నించారు. పేద ప్రజల కడుపు నింపాలనే ఆలోచన కేంద్ర ప్రభుత్వానికి ఉంటే దేశ వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణి చేయాలని డిమాండ్ చేశారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. పేద ప్రజల పక్షాన, రైతుల పక్షాన, మహిళల పక్షాన నిలబడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు.కొత్తగా ఏర్పడిన వేలేరు మండలంలో మూడు ప్రధాన సమస్యలు ఉన్నాయని అన్నారు. అందులో మొదటిది మల్లన్న గండి రిజర్వాయర్ నుండి సాగు నీరు అందించాలని చెప్పారు. మల్లన్న గండి లిఫ్ట్1 పనులు వేగంగా జరుగుతున్నాయని అతి త్వరలోనే వేలేరుకు గోదావరి జలాలు తీసుకువస్తానని తెలిపారు. కొత్త మండలంలో మండల కార్యాలయాలు నిర్మాణం చేయాల్సి ఉందని ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయం నిర్మాణానికి 2కోట్ల 25లక్షలు మంజూరు అయ్యాయని, రెండు మూడు రోజుల్లో ఎంపిడివో కార్యాలయానికి మరో 2కోట్లు మంజూరు కానున్నాయని అన్నారు. నెల రోజులలోపు మండల కార్యాలయాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తానని వెల్లడించారు. వేలేరు నుండి కొమ్ము గుట్ట వరకు రోడ్డు అభివృద్ధికి పంచాయతీ రాజ్ హ్యామ్ పథకం ద్వారా 14కోట్లు మంజూరు అయ్యాయని త్వరలోనే పనులు పూర్తి చేయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేలేరు, ధర్మసాగర్ మండలాల సర్పంచులు, తహసీల్దార్ కోమి, ఎ ఒ కవిత, సర్పంచ్ లు బిల్ల యాదగిరి, కూరపాటి అశోక్, బత్తుల శ్రీనివాస్,ఎంపిడివోలు, మండల నాయకులు, ఇతర ప్రజా ప్రతినిధులు, రేషన్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సురవరం ఆశయ సాధనకు కృషి

### సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రవీణ్ కుమార్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ నల్లగొండ పార్లమెంట్ సభ్యులు, పార్టీ అగ్రనేత కామ్రేడ్ సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి, జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో కొమురయ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సోతుకు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, సురవరం సుధాకర్‌రెడ్డి జీవితాంతం కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడారని అన్నారు. ఆయన ఆశయ సాధనతో పాటు సీపీఐని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు వేముల శ్రీకాంత్, యాదగిరి, పీక రవి కాంత్, జనార్ధన్, జంపాల పవన్, నర్సయ్య, గడ్డం స్వరూప, పల్లెర్ల రజిత, మట్టి నాగమణి, వాసం రజిత, పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ప్రజా ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రానికి చెందిన దానం మేఘన అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గండ్ర సత్యనారాయణ రావు ఎల్.ఓ.సి (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా రూ.3లక్షల 50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పథకంలో కవర్ కాని వ్యాధుల చికిత్స కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్.ఓ.సి ద్వారా ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లాలో ఘనంగా ఎఐవైఎఫ్ జిల్లా మహాసభలు

### విద్యార్థులు, యువత సమస్యలపై ఐక్యంగా పోరాడాలి

### ఎఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలీ ఉల్లాహ్ ఖాద్రి




**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ జిల్లాలో అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా మహాసభలు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రలోని థామెర భవన్‌లో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ మహాసభలకు ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు సాంబమూర్తి అధ్యక్షత వహించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వలి ఉల్లాహ్ ఖాద్రి జెండా ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. అనంతరం మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ వలి ఉల్లాహ్ ఖాద్రి మాట్లాడుతూ దేశంలో యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగ, విద్యారంగ సమస్యలు, ఉద్యోగాల కొరత, సామాజిక అసమానతలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. యువత తమ హక్కుల కోసం ప్రశ్నిస్తే వారిని అణిచివేసే ప్రయత్నాలు చేయడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. ప్రగతి శీల, ప్రజాస్వామ్యవాద శక్తులను లక్ష్యంగా చేసుకునేందుకు దిమాగీ నక్సల్స్ వంటి ముద్రలను ఉపయోగించే కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించేందుకు యువత సంఘటితంగా ఉద్యమించాలని కోరారు. విద్యార్థులు, యువత తమ సమస్యలపై ఐక్యంగా పోరాడాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని డాక్టర్ వలి ఉల్లాహ్ ఖాద్రి పిలుపునిచ్చారు. మహాసభలో ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మాస్కొ షుదీర్ జిల్లా కార్యవర్గ నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో షేక్ బాషుమియా, ప్రసాద్, రవి, లక్ష్మణ్, మాస్కొ సుధీర్, జగదీష్, ఎండి అబ్బు, గణేష్, ఎండి ఫయాజ్, తదితరులతో పాటు కార్యకర్తలు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సుధాకర్ రెడ్డి ఆశయ సాధన కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి




### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు మేకల రవి

**ప్రజాపక్షం/వరంగల్:** సురవరం సుధాకర్ రెడ్డి కలలు కన్న సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి అన్నారు. శనివారం సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్లో సురవరం సుధాకర్ రెడ్డి ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించిన సందర్భంగా మేకల రవి మాట్లాడుతూ సురవరం సుధాకర్ రెడ్డి విద్యార్థి దశ నుండే పోరాటాలను ప్రారంభించి అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారం కావాలంటే దోపిడి పిడన లేని సమాజం రావాలని, అది కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోనే సాధ్యమని విశ్వసించి ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలను నిర్వహించి, మనిషిని మనిషి దోపిడీ చేయలేని కులరహిత, మతరహిత, వర్గ రహిత సమాజం కోసం సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం కోసం జీవితాంతం అనేక ఉద్యమాలను నిర్మించి స్వయంగా పాల్గొని తన ఆస్తులను సైతం పార్టీ కోసం ఖర్చు చేసిన త్యాగధనుడని కొనియాడారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్ లు మాట్లాడుతూ ప్రస్తుత పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాటాలను తీవ్రం చేసి సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేయడమే సురవరం సుధాకర్ రెడ్డికి మనమిచ్చే నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, గుండె బద్రి, సంగీ ఏలేంధర్, నాయకులు పరికిరాల రమేష్, రాజేంధర్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సాంబమూర్తి, మనోహర్, సాల్మన్, తోట రాజు, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు

## అభివృద్ధి చేశాకే ప్రజలను ఓటు అడుగుతా!

### త్వరలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభం

### రూ.530 కోట్లతో నగరంలో శాశ్వత నీటి సమస్యకు పరిష్కారం

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ:** వరంగల్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు అన్నారు. అభివృద్ధి పనులతోనే ప్రజల ముందుకు వెళ్తామని, పనులు చేసి ఓటు అడుగుతామని స్పష్టం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 49వ డివిజన్‌లో లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్నతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్లలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో పెద్ద ఎత్తున రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గతంలో ఒక డివిజన్‌కు రూ.50 లక్షలు కేటాయించడం గొప్పగా చెప్పుకునే పరిస్థితి ఉండేదని, ప్రస్తుతం ఒక్కో డివిజన్‌కు రూ.10 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకు అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని వివరించారు. శాయంపేట ప్రాంతానికి సుమారు రూ.20 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని, నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం, అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని తెలిపారు. వనమహోత్సవ కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా ముఖ్యమన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దాని బాధ్యత తీసుకోవాలని పి లుపునిచ్చారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ మాట్లాడుతూ లెక్చరర్స్ కాలనీ, సాయి బృందావన్ కాలనీలలో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించేందుకు నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమం అభినందనీయమన్నారు. కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలను నాటడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాలనీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## 90 మంది కాంట్రాక్ట్ ఆర్‌టిసి కండక్టర్లు, ఉద్యోగుల తొలగింపు

### ఆర్‌టిసి ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ఆందోళన



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ: వరంగల్ రీజియన్ ఆర్టీసీలో గత ఏడాది కాలంగా విధులు నిర్వహిస్తున్న సుమారు 90 మంది ఆర్టీసీ కండక్టర్లు కాంట్రాక్ట్ ఉద్యోగులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా రాత్రికి రాత్రే విధుల నుంచి తొలగించారని ఆరోపిస్తూ ఉద్యోగులు శనివారం హనుమకొండలోని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.గత సంవత్సరం కాలంగా తమతో విధులు చేయించుకుని, ఇప్పుడు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీకి సంబంధించిన పలు కీలక కార్యక్రమాల్లో, ముఖ్యంగా మేడారం మహాజాతరను విజయవంతం చేయడంలో తమ పాత్ర ఎంతో కీలకంగా ఉందని వారు తెలిపారు.తమ సేవలను వినియోగించుకున్న తర్వాత అకస్మాత్తుగా ఉద్యోగాల నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు తీవ్ర ఇబ్బందుల్లో పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, తమ కుటుంబాలను రోడ్డున పడకుండా ప్రభుత్వం, ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



**ప్రజాపక్షం/ములుగు:** ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకోకుండా ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, సహాయ ఎన్నికల నమోదు అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను క్రమం తప్పకుండా సందర్శిస్తూ క్షేత్రస్థాయి పరిస్తితులను పరిశీలించాలని భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించేందుకు తెలంగాణ రాష్ట్ర పర్యటనలో భాగంగా భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్ శనివారం ములుగు జిల్లాలో పర్యటించారు. జిల్లా పర్యటనలో భాగంగా ముందుగా వెంకటాపూర్ మండల పాలంపేట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను నవీన్‌కుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల పరిస్థితి, ఓటర్లకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, బిఎల్‌ఓల పనితీరు తదితర అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న బూత్ స్థాయి అధికారులతో మాట్లాడి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో చేపడుతున్న క్షేత్రస్థాయి కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిఎల్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని నవీన్ కుమార్ స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు, లోటుపాట్లు ఉంటే ముందుగానే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి, ఆర్‌డిఓ కృష్ణవేణి, తహసీల్దార్లు, సలీం, డిటి నితీష్ కుమార్, సిబ్బంది, పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమం సర్కార్‌కు రెండు కళ్ళు

**ప్రజాపక్షం/పరకాల :** అభివృద్ధి సంక్షేమం తెలంగాణ ప్రభుత్వం రెండు కళ్ళని పరకాల ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం పరకాల పట్టణ కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పరకాల నడి కూడా ఆత్మకూరు దామెర గ్రామాలలోని రేషన్ కార్డు అర్హులైన వారికి ఆయన పంపిణీ చేశారు. తెలంగాణ ప్రభుత్వం రెండు సంవత్సరాల కుపైగా సంక్షేమాన్ని ఎక్కడ కుంటు పడకుండా ముందుకు సాగిస్తున్న ప్రభుత్వం అని ఎమ్మెల్యే అన్నారు. 16 వేల కోట్లతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ 8 లక్షల కోట్ల అప్పుగా ఎందుకు మిగిలిందో సమాధానం చెప్పాలని రేవూరి ప్రకాష్ రెడ్డి అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరకాల నియోజకవర్గం లో మీ అన్ని గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకుపోతూ ప్రజల మద్దతును పొందుతున్నానని ఎమ్మెల్యే రేవూరి అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో మంచి పేరును సంపాదించుకుంటుందని, దాన్ని అందరం ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. గత ప్రభుత్వం డబ్బులు పోగు చేసుకోవడమే కానీ ప్రజలకు ఇండ్లు రేషన్ కార్డులు ఒకనాడు అయినా పంపిణీ చేసిందా అని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి తోపాటు దామెర, నడి కూడ, తాసిల్దార్‌లు, రేషన్ కార్డు లబ్ధిదారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జి స్టూడియోస్ సమర్పిస్తున్నాయి.

# రీల్


## 'కకా' పుట్టిస్తున్న చిరంజీవి
### * టైటిల్ గ్లింప్స్ రిలీజ్



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న చిరంజీవి 158వ సినిమాకు నామకరణం చేశారు. వెంకట్ కే నారాయణ నిర్మాణ సారథ్యంలో కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ ను చిరంజీవి వేడుకల సందర్భంగా శనివారం రిలీజ్ చేశారు.ఈ టైటిల్ గ్లింప్స్ స్టైల్, యాక్షన్, రా మాస్ అప్పీల్‌తో ఆ అంచనాలను మరింత పెంచింది. కె. సత్యం, సూపర్‌వైజర్‌గా చిరంజీవి ఆక్వా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడంతో గ్లింప్స్ ప్రారంభమవుతుంది. సినిమాటోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ తన డైనమిక్ విజువల్ లాంగ్వేజ్‌తో గ్లింప్స్‌ను మరింత ఆసక్తికరంగా మలిచారు. ప్రారంభ సన్నివేశాల్లో కెమెరా దాదాపు చిరంజీవి పాత్రతో పాటు ప్రయాణిస్తున్నట్టుగా ఇమ్మర్సివ్ ఫీల్‌ను కలిగిస్తుంది. ఆ తర్వాత గ్లింప్స్ ముందుకు వెళ్లే కొద్దీ హై ఎనర్జీ ఫ్రేమ్స్, మాస్ ఎలివేషన్స్‌తో విజువల్స్ ఆకట్టుకున్నాయి. ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ స్కోర్ గ్లింప్స్ ఇంటెన్సిటీని మరింత పెంచింది. 'గ్యాంగ్ లీడర్'లోని ఐకానిక్ 'గ్యాంగ్ గ్యాంగ్' పాటను రీమిక్స్ చేసి ఉపయోగించడం నోస్టాల్జియాతో పాటు చిరంజీవి స్టైల్‌కు మరింత స్వాగ్‌ను జోడించింది. ఈ చిత్రంలో అనస్వర రాజన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాష్ కొల్లా, ఎడిటర్‌గా ఆంటోనీ ఎల్ రూబెన్, రచయితలుగా కోన వెంకట్, కె. చక్రవర్తి రెడ్డి, హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి పనిచేస్తున్నారు. భాను–నందు డైలాగ్స్ అందిస్తున్నారు.2027 జనవరి 13న సంక్రాంతి సందర్భంగా ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

మెగాస్టార్ చిరంజీవి, అనస్వర రాజన్, నివేదా పేతురాజ్, సునీల్, గెటప్ శ్రీను తదితరులు నటిస్తున్న **ఈ చిత్రానికి క్రియేటివ్ ప్రొడ్యూసర్:** లోహిత్,
**ఎడిటర్:** ఆంటోనీ రూబెన్, **ప్రొడక్షన్ డిజైన్:** అవినాష్ కొల్లా,
**స్క్రీన్ ప్లే రైటర్స్:** కోన వెంకట్, కె చక్రవర్తి రెడ్డి, **ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్:** శరణ్య పోట్ల, **యాక్షన్:** రామ్ లక్ష్మణ్,
**నబకాంత్ డైలాగ్స్:** భానునందు,
**అడిషినల్ స్క్రీన్ ప్లే రైటర్స్:** హరి మోహన కృష్ణ, వినీత్ పొట్లూరి.

## సెప్టెంబర్ 4న 'సహా' విడుదల



నిశాంత్ దోటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఎమోషనల్ డ్రామా 'సహా (లైఫ్ ఆఫ్ సంజు)'. శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ప్రేమ, అనుబంధాలు, జ్ఞాపకాలు, జీవితంలో ఎదురయ్యే భావోద్వేగ సంఘర్షణల చుట్టూ సాగనుంది. సుమైరా స్టూడియోస్ బ్యానర్‌పై తేజ వెల్పుచర్ల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'సహా' సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో శివ కుమార్ కాసారం, శ్వేతా లక్ష్మణ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ జర్నీలో ఆత్మీయంగా కనిపించారు. ఈ విజువల్ ఇద్దరి మధ్య ప్రేమ, అనుబంధాన్ని సహజంగా చూపిస్తూ సినిమా నేపథ్యంపై ఆసక్తిని పెంచుతోంది. సంజు జీవితంలోని వివిధ దశలను ఈ సినిమా ప్రజెంట్ చేస్తోంది. ప్రేమ, విడిపోవడం, మధురమైన జ్ఞాపకాలు, కష్టాలను అధిగమించేందుకు అవసరమైన మనోధైర్యం వంటి అంశాలను కథలో చూపించనున్నారు. పాత్రలు, వాటి మధ్య ఉండే అనుబంధాల ద్వారా ఒక మనసుకు దగ్గరయ్యే ఎమోషనల్ జర్నీగా అందించనున్నాయి. ఈ చిత్రంలో వ్రజనా పాండ్యా, మహిపాల్, అప్పాజీ, భారతి, మేఘన సునీల్, బాంబే పద్మ, కొండారెడ్డి, హర్షవర్ధన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్‌గా కరుణాకర్ కె, ఎడిటర్‌గా దినేష్ పెద్ది, సంగీత దర్శకుడిగా శేఖర్ చంద్ర పనిచేస్తున్నారు.

## 'కామ్రేడ్ కళ్యాణ్' లో సరస్వతమ్మగా రాధిక



శ్రీ విష్ణు హీరోగా 'కామ్రేడ్ కళ్యాణ్'తో అలరించబోతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆసక్తికరమైన పీరియడ బ్యాక్‌డ్రాప్‌తో పాటు రొమాన్స్, ఎమోషన్స్ తో రూపొందిస్తున్నారు. జానకిరామ్ మారెళ్ల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కోన వెంకట్ సమర్పిస్తున్నారు. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ ఎల్ ఎల్ పీ బ్యానర్‌పై వెంకట కృష్ణ కర్నాటి, సీత కర్నాటి నిర్మిస్తున్నారు. 1992లో ఆంధ్ర– ఒడిశా సరిహద్దు ప్రాంతం నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. మహిమా నంబియార్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో రాధికా శరత్‌కుమార్ కీలక పాత్రలో నటిస్తున్నారు. ఆమె 'సరస్వతమ్మ'గా ఆమె ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. 'జై బాలయ్య' హెడ్‌బ్యాండ కట్టుకుని, సీరియస్ లుక్‌లో కనిపిస్తున్న రాధికా శరత్‌కుమార్ పాత్రపై ఆసక్తిని పెంచుతోంది. ఆమె బాడీ లాంగ్వేజ్ సరస్వతమ్మ పాత్రకు కథలో మంచి ప్రాధాన్యత ఉన్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా బాలయ్య అభిమానిగా పాత్రను డిజైన్ చేయడం ఆసక్తికరంగా ఉంది. సరస్వతమ్మగా రాధికా శరత్‌కుమార్ ఫస్ట్ లుక్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచుతోంది. ఈ చిత్రంలో షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తుండగా, సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.
'కామ్రేడ్ కళ్యాణ్' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. **ఈ చిత్రానికి సంగీతం:** విజయ్ బుల్గానిన్,
**సినిమాటోగ్రఫీ:** సాయి శ్రీరామ్,
**ఎడిటర్:** చోటా కె. ప్రసాద్.

## అలాంటి పాత్రలు చెయ్యొద్దని నాఅన్న బిడ్డ చెప్పింది
### 'నేను సినిమా చూడను' అని మా ఆవిడ అన్నది
### 'ప్రజాపక్షం' స్పెషల్ ఇంటర్వ్యూలో 'బలగం' సుధాకర్ రెడ్డి



**'బలగం' సినిమా తెలుగు సినిమా చరిత్రను తిరిగి రాసింది. వందేళ్ల తెలుగు సినిమా చరిత్రలో ఒక సినిమా రిలీజ్ తరువాత కూడా గ్రామాల్లో ప్రజలందరూ ఒకచోట కూర్చొని ఎల్ ఈ డీ లో సినిమా వేసుకుని చూసిన చరిత్ర 'బలగం' సినిమా సొంతం. బలగం సినిమా చూసి విడిపోయిన బంధాలు, బంధుత్వాలు కలసిపోయాయి. బలగం సినిమా కథ మొత్తం ఒక ఇంటి పెద్ద చుట్టూ తిరుగుతుంది. ఆ ఇంటి పెద్ద పాత్రను పోషించాడు నటుడు కేతిరి సుధాకర్ రెడ్డి. ఈ ఇంటి పెద్ద మనిషి పాత్ర చనిపోవడంతోనే కథ మొదలవుతుంది. ఆ తరువాత బలగం కథ ఎలా సాగింది అనేది సినిమా చూసిన ప్రతి ఒక్కరికి తెలిసిందే. బలగం సినిమాలో ఇంటి పెద్ద పాత్రను పోషించిన సుధాకర్ రెడ్డిని 'ప్రజాపక్షం' పలకరించింది. ఈ సందర్భంగా ఆయన అనేక ఆసక్తికర విషయాలను ప్రజాపక్షంతో పంచుకున్నారు. ఆ విశేషాలు పాఠకుల కోసం....**

**ప్రశ్న : మీ నేపథ్యం ఏమిటి ?**
**సుధాకర్ రెడ్డి :** మాది కరీం నగర్ జిల్లా. తండ్రి కేతిరి రాజి రెడ్డి, అమ్మ సుశీలమ్మ.జూపాక గ్రామంలో బాల్యం గడిచింది ప్రాథమిక విద్య మొత్తం జూపాక లోనే. నాలుగవ తరగతి వరకు జూపాక లో చదువుకున్న. తరువాత చిలుపూరు గ్రామంలో అయిదవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు చదుకున్న.ఎనిమిదవ తరగతి నుంచి కాలేజీ చదువుల వరకు వరకు హుజురాబాద్ సాగింది. కాకతీయ యూనివర్సిటీ వరంగల్ లో డిగ్రీ చేసిన. ఆ తరువాత బీఈడీ చదువుకోసం తిరుపతికి వెళ్లిన. శ్రీ వెంకటేశ్వరా స్వామి యూనివర్సిటీలో బీఈడీ పట్టా సాధించిన. బీఈడీ పూర్తి అయినాక సరస్వతి శిశు మందిర్ లో టీచర్ గా ఉద్యోగంలో చేరిన. రిటైర్మెంట్ అయ్యేవరకు ఉపాధ్యాయుడిగా పని చేసిన. పదవి విరమణ తరువాతే సినిమా రంగానికి వచ్చిన.
**ప్రశ్న : మీరు చదువుకునే రోజుల్లో నాటకాలు ఆడేవారా?**
**సుధాకర్ రెడ్డి :** అవును నాటకాలు ఆడేవాన్ని. కొన్ని బహుమతులు కూడా వచ్చాయి. కానీ అవి ఇప్పుడు గుర్తుకు రావడం లేదు. పౌరాణిక నాటకాలు, యక్ష గానం, చిడతల రామాయణం హరికథలు, బుర్ర కథలు, వీధి భాగోతాలు, ఏకపాత్ర నాటికలు..., నటించడమే కాదు కొన్ని రాసిన కూడా. నాటకాల పోటీలకు వెళ్తుండేవాణ్ణి. నంది నాటకోత్సవాలకు కూడా జడ్జిగా వెళ్లిన. స్కూల్ లో పిల్లలకు పిల్లలకు నాటకాలు నేర్పించేవాన్ని. శిశుమందిర్ లో ఐచ్చిక రంగస్థల అనే ప్రత్యేక కార్యక్రమం ఉండేది. దీంట్లో నేను ప్రముఖంగా పని చేసిన.
**ప్రశ్న : మీకు రచన ఎలా అలవాటు అయింది ?**
**సుధాకర్ రెడ్డి :** ఆరుట్ల రంగాచార్య అని ఉపాధ్యుడు ఉండేవారు. వారు మాకు సంస్కృతం భోదిస్తుండేవారు. ఆయన రచనలు చెయ్యమని ప్రోత్సహించారు. దీంతో మొట్ట మొదలు ఇందిరా గాంధీ గురించి ఒక పాట రాసిన. ఆ తర్వాత ఆమెకు వ్యతిరేకంగా కూడా పాట రాసిన. పాట ఎలా రాయాలో చెప్పిండు. అట్లా రచయితనైనా.
**ప్రశ్న : తొలిసారిగా కెమెరా ముందుకు ఎప్పుడు వచ్చారు?**
**సుధాకర్ రెడ్డి :** నిజానికి సినిమాలంటే దూరమే. మైకేల్ అన్వేష్ అనే దర్శకుడు 'కొత్త పోరడు' అనే వెబ్ సిరీస్ చేశారు. దాంట్లో ఫస్ట్ టైం నటించిన. అప్పుడే మొట్ట మొదటిసారి కెమెరా ముందుకు వచ్చిన. సినిమాగా చెప్పుకుంటే 'మల్లేశం' నాతొలి సినిమాగా చెప్పవచ్చు.
**ప్రశ్న : బలగం సినిమాలో ఎలా అవకాశం వచ్చింది ?**
**సుధాకర్ రెడ్డి :** 'కొత్త పోరడు' సినిమా దర్శకుడు అన్వేష్ కు బలగం వేణు స్నేహితుడు. నా గురించి వేణుకు చెప్పాడట. వెబ్ సిరీస్, నాటకాలు చాలా బాగా యాక్టింగ్ చేస్తాడు అని ఇలా నాగురించి వేణుకు తెలిసింది. దీంతో ఆయన పిలిపించి బలగం సినిమాకు సెలక్ట్ చేశాడు.
**ప్రశ్న : బలగం సినిమాలో మీరు చనిపోయే పాత్ర ? ఎలా ? ఒప్పుకున్నారు**
**సుధాకర్ రెడ్డి :** మనం నిజంగానే చనిపోతాం కదా... సినిమాలో చనిపోయే పాత్ర చేస్తే ఏమైతది అనుకున్న. మా అన్నయ్య బిడ్డ ఇటువంటి పాత్ర చేయొద్దని. మా ఆవిడా ఇటువంటి పాత్ర అయితే సినిమా చూడను అన్నది. మనం నిజంగా కూడా చచ్చిపోతాం.. ఏమైతది ఈ క్యారెక్టర్ చేస్తే అని చేసేసిన.
**ప్రశ్న : నటుడిగా మీరు ఎవరిని స్ఫూర్తిగా తీసుకుంటారు ?**
**సుధాకర్ రెడ్డి :** నేను ఎవరిని అనుకరణ చేసేవాన్ని కాదు. అలా అని ఎవరిని స్ఫూర్తిగా కూడా ఎవరిని స్వీకరించలేదు. ఎందుకంటే సినిమా అంటేనే మాకు దూరం. కానీ సినిమాల్లోకి వచ్చాను. నాకు ఉన్న పరిధిలో నేను ఎలా చెయ్యగలను,ఎలా ఉన్నాను అనేది చూసుకుంటా. నాకు కొన్ని నియమాలు ఉన్నాయి. అందుకని నాకు ఏం తెలుసో అది చెప్తా. అదే చేస్తా. కాబట్టి ఎవరిని స్ఫూర్తిగా స్వీకరించలేదు. ఎవరిని జ్ఞ్యాపకం కూడా పెట్టుకోలేదు.
**ప్రశ్న : ఇప్పుడు చేస్తున్న సినిమాలు ఏంటి?**
**సుధాకర్ రెడ్డి :** ఇప్పుడు కొంచెం బిజీగానే ఉన్న 'పళ్ళబురుసు' అనే సినిమా చేసిన . ఇందులో చాలా మంచి పాత్ర. తండ్రి కొడుకుల మధ్య సాగే డ్రామా ఈ సినిమా కథ. నాగార్జున సార్ వాళ్ళు ఈ సినిమాను తీశారు. 'ఎల్లమ్మ' సినిమాలో కూడా నటిస్తున్న. ఇందులో కూడా చాలా మంచి పాత్ర. ఇది దిల్ రాజు నిర్మిస్తున్నారు. ఇది బలగం లాగానే సూపర్ అవుతుంది. ఇంకా కొన్ని సినిమాలు చర్చల దశలో ఉన్నాయి.

## సెప్టెంబర్ 3న 'రోమాంచకం'




డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో భద్రకాళీ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్న సినిమా 'రోమాంచకం'. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపిన ఇంట్రెస్టింగ్ యూత్ ఫుల్ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు ఈ సినిమా సెప్టెంబర్ 3న విడుదలకు ముస్తాబవుతోంది. ఏషియన్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని సునీల్ నారంగ్ ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటకలో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో నిర్వహించిన ప్రెస్ మీట్ లో డిస్ట్రిబ్యూటర్, ప్రొడ్యూసర్ సునీల్ నారంగ్ మాట్లాడుతూ రోమాంచకం సక్సెస్ పై మాకు పూర్తి నమ్మకం ఉంది. ఈ సినిమా డెఫినెట్ గా హిట్ అవుతుంది అన్నారు.హీరోయిన్ అనంతిక సనిల్ కుమార్ మాట్లాడుతూ 8 వసంతాలు సినిమా తర్వాత అనేక స్క్రిప్టట్స్ విన్నాను. కానీ వేణుగోపాల్ చెప్పిన ఈ కథకు కనెక్ట్ అయ్యాను. ఇదొక బ్యూటిఫుల్ స్క్రిప్ట్. నేను వివిధ తరహా చిత్రాల్లో నటించాలని అనుకుంటున్నా. అలా నేను కోరుకున్న జానర్స్ లో రోమాంచకం కూడా ఉంది. ఇది నా టైప్ మూవీ అని చెప్పొచ్చు అన్నారు.ప్రొడ్యూసర్ ప్రణయ్ రెడ్డి వంగా మాట్లాడుతూ డైరెక్టర్ వేణుగోపాల్ పదిహేను నెలల క్రితం ఈ కథ చెప్పారు. స్క్రిప్ట్ మొత్తం హిలేరియస్ గా నెరెట్ చేశారు. అన్ని క్యారెక్టర్స్ ను తనే పర్ ఫార్మ్ చేసి చూపించారు. మూడు నెలలు ఆర్టిస్టులతో రిహార్సల్స్ చేయించి మంచి పర్ ఫార్మెన్స్ వారి దగ్గర నుంచి తీసుకున్నారు. ఆ పర్ ఫార్మెన్స్ లను మీరు కొత్తగా ఫ్రెష్ గా ఫీలవుతారని నమ్ముతున్నాం. పేపర్ మీద ఏ బడ్జెట్ అనుకున్నామో ఆ బడ్జెట్ లోనే సినిమా చేశాడు. చిన్న సినిమా అనే ఫీల్ మీకు ఎక్కడా రాదు. నేను నమ్మిన కథ అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం అన్నారు.నటి కీర్తన ,ప్రొడక్షన్ డిజైనర్ ఖుషి, డీవోపీ పవన్ పప్పుల, నటుడు నరేంద్ర ,నటుడు మణి, నటుడు సోహన్ , హీరో సుమంత్ ప్రభాస్ , డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.






# జీవితం స్ఫూర్తిదాయకం

(మొదటి పేజీ తరువాయి)

ఆవిష్కరించారు. సురవరం సుధాకర రెడ్డిపై ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ రచించిన పాటను నాయకులు ఆవిష్కరించారు. అంతకు ముందు సురవరం సుధాకర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి సిపిఐ శ్రేణులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా, ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు, తక్కళ్లపల్లి శ్రీనివాస్, ఈ.టి.నరసింహా, కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, కలవేన శంకర్, ఎం.బాల నరసింహ, వి.ఎస్.బోస్, బాగం హేమంత్ రావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం వేదికపై ఆశీనులయ్యారు.

### సురవరం సుధాకర రెడ్డి గొప్ప కమ్యూనిస్టు : ఘంటా చక్రపాణి

సురవరం సుధాకర రెడ్డి ఓ గొప్ప ఉద్యమకారుడు, రచయిత, వ్యాసకర్త, ఓ గొప్ప విద్యార్థి, యువజన, రాజకీయ నాయకుడు అయినప్పటికీ ఆయన ఎప్పుడూ నిరాడంబరుడిగా జీవించిన మహానేత అని ఘంటా చక్రపాణి కొనియాడారు. ఒక వ్యక్తి తన జీవిత కాలంలో ఒక్కడినైనా మార్చగలిగితే ఆయన గొప్ప కమ్యూనిస్టు అవుతాడని, అందుకు ప్రత్యక్ష ఉదారణ సురవరం సుధాకర రెడ్డి అని అన్నారు. అయన ఆదర్శాల ప్రభావం గ్రామీణ ప్రాంత యువతపై ఎంతో ఉందని, ఇందుకు ఉదహరణ కల్వకుర్తిలో ఓ దళిత యువకుడి గాథ నిదర్శమని చెప్పారు. సురవరం ప్రయాణం, ఆయన జీవితం నేర్పిన విషయాలు చాలా మందికి స్ఫూర్తిదాయకమైనవని పేర్కొన్నారు. అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిన సురవరం సుధాకర రెడ్డి ప్రస్తుతం జరుగుతున్న జన్ జీ ఉద్యమ సమయంలో ఆయన లేకపోవడం తీరని లోటు అన్నారు. సుధాకర రెడ్డి బతికి ఉంటే జన్‌జీల ఉద్యమానికి ఓ వ్యూహం, ధైర్యం ఇవ్వడంతో పాటు దిశా నిర్దేశం చేసేవారని అన్నారు.

### సుధాకర రెడ్డి ఆశయాల బాటలో నడవాలి : పల్లా వెంకట రెడ్డి

సురవరం సుధాకర రెడ్డి జీవితాన్ని, పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతను ఆదర్శంగా తీసుకుని సిపిఐ శ్రేణులు ముందుకు సాగాలని పల్లా వెంకట రెడ్డి అన్నారు. కమ్యూనిస్టు భావజాలం ఒక వ్యక్తి మాటల్లో కాకుండా వారి ప్రవర్తనలో ప్రతిబింబించాలని, కమ్యూనిస్టు సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో మానవత్వం, ప్రజా సంక్షేమం దెబ్బతింటున్న పరిస్థితుల్లో కమ్యూనిస్టులు మరింత నిబద్ధతతో ఉద్యమించాలని, ఇందుకు సురవరం సుధాకర రెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సుధాకర రెడ్డి తుది శ్వాస వరకు ప్రజా సంఘాల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని, ప్రజా సంఘాలు బలంగా ఉంటేనే పార్టీ నిర్మాణం కూడా బలపడుతుందని ఆయన పదే పదే చెప్పేవారని వెంకట రెడ్డి పేర్కొన్నారు. బాధ్యత ఏదైనా సరే వ్యక్తిగత నిర్ణయాలకు కాకుండా సమిష్టి నిర్ణయాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సుధాకర రెడ్డి సూచించేవారని చెప్పారు. సురవరం ఎప్పుడు కూడా తన ప్రసంగంలో సమస్యల గురించే తప్ప ఏ ఒక్కరి వ్యకిగతం గురించి మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. ఆ మహానేత సుధాకర రెడ్డి రచనలు, వ్యాసాలను సేకరించి ఇప్పటికే నవ చేతన పబ్లిషింగ్ హౌజ్ ద్వారా పలు పుస్తకాలు తీసురావడం జరిగిందని, మరిన్ని పుస్తకాలను కూడా తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని పల్లా వెంకట రెడ్డి చెప్పారు.

### నాయకత్వం లక్షణాలను గుర్తించడంలో సురవరం దిట్ట : డాక్టర్ నారాయణ

కమ్యూనిస్టు ఉద్యమంలో దూరదృష్టి, నిబద్ధత, కార్యకర్తల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన నాయకుడు సురవరం సుధకర రెడ్డి అని డాక్టర్ కె.నారాయణ కొనియాడారు. అపారమైన మేధస్సు, సహనం కలిగిన సుధాకర రెడ్డి భూమి కంటే ఎక్కువ ఓర్పు ఉన్న వ్యకి అని అన్నారు. రాజకీయ జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ఆవేశానికి లోనుకాకుండా, ఎంతో సంయమనంతో వ్యవహరించడం ఆయన ప్రత్యేకత అని, అందుకే ఆయనను 'అపొలిటికల్ అండ్ పొలిటికల్ మ్యాన్'గా అభివర్ణించేవారని గుర్తు చేశారు.

### కమ్యూనిస్టు భావజాలాన్ని ఎవరూ ఏమి చేయలేరు : కూనంనేని సాంబశివరావు

కమ్యూనిస్టులను ఏరివేయవచ్చని, కానీ ఆ భావజాలాన్ని ఏమి చేయలేమని ప్రధాని మోదీకి అర్థమయ్యే దిమాగి నక్సల్స్ పదాన్ని అందుకున్నారని కూనంనేని సాంబశివ రావు తెలిపారు. కమ్యూనిస్టు భావజాలం సమాజంలో ఇంకా బలంగా ఉందని, మేధోపరమైన ఉద్యమాలు, వాటి ప్రభావంతో ఏర్పడిన భావజాల పునాదులే ఉద్యమాలకు నాంది పలుకుతున్నాయని చెప్పారు. విద్యావంతులు, ప్రొఫెసర్లు, న్యాయవ్యవస్థ, ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల్లోనూ కొంతమందిలో కమ్యూనిస్టు భావజాలం ఉందని, ఆ భావజాల ప్రభావాన్ని పూర్తిగా తొలగించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో మేధావులు, విద్యావంతులు, అధ్యాపకులు, విద్యార్థులను కలుపుకొని సురవరం సుధాకర రెడ్డి స్ఫూర్తితో మేధో ఉద్యమాన్ని విస్తరించాలని సాంబశివ రావు పిలుపునిచ్చారు. సుధాకర రెడ్డి స్ఫూర్తితో మేధోరంగంలో మరింత విస్తృతంగా పనిచేయాలని, ఇందుకు సుధాకర్‌రెడ్డి పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేసి, ఆయన ఆలోచనలు, అధ్యయన పద్ధతి, భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.



### అసంఘటిత రంగం కోసం సుధాకర్‌రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయం : బి.వి. విజయలక్ష్మి

కార్మికులు, అసంఘటిత రంగం కోసం సురవరం సుధాకర రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని డాక్టర్ బి.వి.విజయలక్ష్మి కొనియాడారు. కార్మిక శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన సురవరం సుధాకర రెడ్డి పార్లమెంట్ వేదికను కార్మికుల హక్కుల కోసం వినియోగించారన్నారు. సుధాకర రెడ్డి తన అనుభవాలను ఆధారంగా చేసుకుని రాజకీయ, సామాజిక సమస్యలపై ఎప్పుడు, ఏ విధంగా స్పందించేవారో అంతో స్పష్టంగా వివరించేవారని అన్నారు. ఏ ఉద్యమానికైనా, ఏ కార్యక్రమానికైనా విద్య, అధ్యయనం ఎంతో ముఖ్యమనే విషయాన్ని సుధాకర్‌రెడ్డి జీవితం నుంచి నేర్చుకోవాలని విజయలక్ష్మి సూచించారు.




# సురవరం ఆదర్శ కమ్యూనిస్టు
### మొదటి వర్ధంతి సభలో డి.రాజా

**న్యూఢిల్లీ:** సిపిఐ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి స్ఫూర్తి ప్రదాత అని పార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా కొనియాడారు. సుధాకర రెడ్డి జీవితం భావి తరాలకు ఓ ప్రేరణ అన్నారు. న్యూఢిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో సురవరం సుధాకర రెడ్డి మొదటి వర్ధంతి సభ శనివారం జరిగింది. సురవరం సుధాకర రెడ్డి చిత్రపటానికి పూల మాటలు వేసి డి.రాజా సహా నాయకులు అరుణాంజలి ఘటించారు. అనంతరం డి.రాజా మాట్లాడుతూ సుధాకర రెడ్డి జీవితం, తోడ్పాటు, వారసత్వాన్ని గుర్తు చేశారు. సురవరం సుధాకర రెడ్డి నిబద్ధతలగల ఆదర్శ కమ్యూనిస్టు అని శ్లాఘించారు. ఆయన తుది వరకు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడ్డారన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి తరపున అనేక పోరాటాలు చేశారని, ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించారని గుర్తుచేశారు. శ్రామిక వర్గానికి సురవరం సుధాకర రెడ్డి అన్ని వేళలా అండగా నిలిచారని, వారి పక్షాన పోరాటాలు చేశారని డి.రాజా తెలిపారు. సురవరం సుధాకర రెడ్డి కమ్యూనిస్టు ఉద్యమానికి కట్టుబడి... న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్య విలువులను పాటించారని కొనియాడారు. ఆయన నాయకత్వం, నిడాంబరత, ప్రజల కోసం పడిన తపన భావి తరాలకు ఆదర్శనీయమని డి.రాజా అన్నారు. కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శులు పి.సంతోశ్ కుమార్, అనీరాజాతో పాటు జాతీయ కార్యవర్గ సభ్యుడు, ప్రొఫెసర్ దినేశ్ వర్షినే తదితరులు పాల్గొన్నారు. సురవరం సుధాకర రెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

# 'ఆత్మనిర్భర భారత్'
(మొదటి పేజీ తరువాయి)

భారం మోపుతున్న ఈ ధరల పెరుగుదలకు ఎవరు బాధ్యులు? 3. దేశంలో చక్కెర కొరత ఉండి, ప్రభుత్వం విదేశాల నుండి చక్కెరను దిగుమతి చేసుకుంటున్నప్పుడు, ఇ–20 ఇంధనం కోసం ఇథనాల్‌ను తయారు చేయడానికి చెరకు, ధాన్యాన్ని మళ్లించే విధానాన్ని ఎందుకు సమీక్షించడం లేదు? ఇది ఎలాంటి ఆత్మనిర్భర్ భారత్ అని ఖర్గే పేర్కొన్నారు. కేంద్ర ఇథనాల్ బ్లెండింగ్ విధానాన్ని లక్ష్యంగా చేసుకున్న కాంగ్రెస్ అధినేత... 'ముందుగా చక్కెర ఉత్పత్తి తగ్గింది, ఆ తర్వాత నిల్వలు 9 ఏళ్ల కనిష్ట స్థాయికి పడిపోయాయి, ఇప్పుడు మనం విదేశాల నుండి చక్కెరను దిగుమతి చేసుకుంటున్నాము; మరోవైపు, పెట్రోల్‌లో కలపడానికి చెరకును ఇథనాల్ తయారీకి మళ్లిస్తున్నాము' అని అన్నారు.

# ఇందిరమ్మ టవర్స్
(మొదటి పేజీ తరువాయి)

ఇళ్లను పరిశీలించి సకాలంలో బిల్లులు వచ్చాయా ? అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుత్తేదారుతో యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయించి డబుల్ బెడ్‌రూమ్ భవన సముదాయాన్ని స్వాధీనపర్చుకోవాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. విద్యుత్, తాగునీరు, సానిటేషన్ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో అర్బన్ నియోజకవర్గ లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి చేతుల మీదుగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కేటాయింపు పత్రాలు పంపిణీ చేశారు. కుల, మత రాజకీయాలకతీతంగా పట్టణం, గ్రామం, గూడెం తండా అనే తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా పేదలకు రేవంత్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ మొదటి విడత కింద 4.50 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, భూపతిరెడ్డి, నగర మేయర్ ఉమారాణి, గౌతమ్, కలెక్టర్ భవేష్ మిశ్రా, తాహెర్‌బిన్ హందాన్, కేశ వేణు, సీపీ సాయిచైతన్య, దిలీప్‌కుమార్, రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com